వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

## ప్రభుత్వ భూములు కాజేసేవారిపై ఉక్కుపాదం

- ఒక్క ప్రభుత్వ అధికారిని తొలగించాం : ఇద్దరిని సస్పెండ్ చేశాం
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



03

సంపుటి 09, సంచిక: 189 | మంగళవారం | 09-06-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

# స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిలో పేలుడు

## 8 మంది మృతి

- పలువురికి గాయాలు : ఆరుగురి పరిస్థితి విషమం
- కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం
- మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం : ఏఐటియుసి డిమాండ్

**విశాఖపట్నం :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం సాయంత్రం 4.15 గంటలకు స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్2 లో ల్యాడిల్ పేలి ద్రవ ఉక్కు పడిపోవడంతో 8 మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ముగ్గురిని మెడికవర్ ఆసుపత్రికి, మరో ముగ్గురిని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. మరికొంతమందిని షీలా నగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి, స్టీల్ ప్లాంట్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారిలో ఐదుగురు ఉద్యోగులు కాగా, ముగ్గురు కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు గొంతెన భానుకు మార్, జి.వి.అప్పారావు, ఎం.కష్ణ నాగు, కె.ప్రభాకర రావు, తరువాయి 8లో






## ఆర్థిక పరిస్థితిపై

# అఖిలపక్షం

- నిరుద్యోగం, రైతు, ప్రజా సమస్యలపైనా ఏర్పాటు చేయాలి
- 'సర్'పై సిజెఐకి పిటిషన్
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఐదు ముఖ్యమైన అంశాలపై కలిసికట్టుగా పోరాటం
- ఇండియా కూటమి సమావేశం తీర్మానం
- ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని నిర్ణయం

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి చెందిన నాయకులు సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (సర్), ఓట్ల అక్రమ తరలింపు అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తికి (సిజెఐ) లేఖ రాయాలని నిర్ణయించారు. అదే విధంగా నీట్ పరిక్షా ప్రతం లీక్, సిబిఎస్ఇ వివాదం నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామాకు డిమాండ్‌ను చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశంలోని ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, ప్రజలకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేశారని తెలిపారు. 'ఇండియా' కూటమి నాయకులు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని నిర్ణయించుకున్నారని, తదుపరి సమావేశం ఆగస్టులో హైదరాబాద్‌లో జరుగుతుందని, అయితే తేదీని తర్వాత ఖరారు తరువాయి 8లో

### 23 పార్టీలు.. 28 మంది అగ్రనేతలు

**కాంగ్రెస్ :** మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కె.సి.వేణుగోపాల్
**సమాజ్‌వాదీ పార్టీ :** అఖిలేశ్ యాదవ్
**టిఎంసి :** మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ
**ఆర్‌జెడి :** తేజస్వీ యాదవ్
**నేషనల్ కాన్ఫరెన్స్ :** ఒమర్ అబ్దుల్లా
**పిడిపి :** మెహబూబా ముఫ్తీ,
**జెఎంఎం :** సర్ఫరాజ్ అహ్మద్,
**శివసేన (యుబిటి) :** ఉద్ధవ్ థాక్రే,
**ఎన్‌సిపి (ఎస్‌పి) :** సుప్రియా సూలే,
**సిపిఐ :** డి.రాజా, పి.సందోశ్ కుమార్,
**సిపిఐ(ఎం) :** జాన్ బ్రిట్టాస్,
**సిపిఐ(ఎంఎల్):** దీపాంకర్ భట్టాచార్య,
**ఆర్‌ఎస్‌పి :** ఎన్.కె.ప్రేమచంద్రన్,
**ఐయుఎంఎల్ :** సాధిక్ థంగల్,
**విసికె :** తిరుమవళవన్,
**ఎండిఎంకె :** డి.వైగో,
**కేరళ కాంగ్రెస్ :** కె.జార్జ్,
**కేరళ కాంగ్రెస్ (ఎం) :** జోస్ కె మణి,
**ఆర్ఎల్‌పి :** హనుమాన్ బేణీవాల్,
**బిఎపి :** రాజేశ్ కుమార్ రౌత్,
**లోక్‌దళ్ :** సునీల్ సింగ్,
**ఫార్వర్డ్ బ్లాక్ :** జి.దేవరాజన్,
**షేత్కారి కామ్‌గార్ పక్ష్ :** జయంత్ పాటిల్,
**ఇండిపెండెంట్ ఎంపి :** కపిల్ సిబ్బల్



# తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

- వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి.ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం నుంచి జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా తెలంగాణలోకి అడుగుపెట్టిన రుతుపవనాలు రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించనున్నాయని అధికారులు ప్రకటించారు. రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. వచ్చే వారం రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు విస్తాయన్నారు. జూన్ 10, 11 తేదీల్లో తరువాయి 12లో

## యువతను ఆకర్షించేందుకు

# కొత్త వ్యూహాలు

### 50 ఏళ్ల నాటి పద్ధతులు నేటితరానికి సరిపోవు

- ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా కమ్యూనిస్టు పార్టీలు ఎదిగితేనే దేశ భవిష్యత్తుకు భరోసా
- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్




దేశంలో పెరుగుతున్న అసంతృప్తి, రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో నెలకొంటున్న నిరాశను అధిగమించాలంటే కమ్యూనిస్టు, సెక్యులర్, సోషలిస్టు శక్తులు ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయం గా ఎదగాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. కమ్యూనిస్టు ఉద్య మ స్ఫూర్తిని నేటి తరానికి చేరవేయడంతో పాటు యువతను ఆకర్షించే పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని, అప్పుడే కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు బాటలో పయనించిన వారమవుతామని పేర్కొన్నారు. కమ్యూని స్టు అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతిని పురస్కరించుకుని సి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బొద్దింకల పార్టీ ఆవిర్భావం– యువత, నెటిజెన్స్ ఎటువైపు' అనే అంశంపై సదస్సు సోమవారం ఫౌండేషన్‌లోని ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో నిర్వహించారు. సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కె.శ్రీనివాసరెడ్డి, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పి.జె.చంద్రశేఖరరావు, కోశాధికారి సి.చెన్నకేశవరావు, సిఆర్ ఫౌండేషన్ డయాగ్నస్టిక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కల్పన పాల్గొన్నారు. సదస్సులో కె.శ్రీనివాసరెడ్డి కీలకోపన్యాసం చేస్తూ ఓ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోచనతోనో లేక అనాలోచనతోనో బొద్దింకలు అనే పదాన్ని ఉపయోగించిన నేపథ్యంలో దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటు చేయడం, ఆ వెంటనే 2.20 కోట్ల మంది సభ్యులు దానికి మద్దతు పలకడం దేశ యువతలో నెలకొన్న అసంతృప్తికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. యువతను ఆకర్షించడంలో కమ్యూనిస్టు పార్టీలు కొత్త వ్యూహాలను అవలంబించాల్సిన అవసరం ఉందని, 50 ఏళ్ల కింద పనిచేసిన పద్ధతులు నేటి తరానికి సరిపోవని, వారి భాషలోనే మాట్లాడుతూ ఆధునిక మాధ్యమాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగితేనే దేశ భవిష్యత్తుకు భరోసా తరువాయి 8లో




## రాష్ట్రాన్ని కలిసికట్టుగా

# అభివృద్ధి చేసుకుందాం

- ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్లు ఉంది
- ఆరు నెలల ముందు రాజకీయాలు చేద్దాం
- ప్రతిపక్షాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- పాలనా సౌలభ్యం కోసమే జిహెచ్ఎంసి విభజన అని స్పష్టీకరణ
- సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ శాశ్వత కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/రంగారెడ్డి

'రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు చేసుకుందాం. అప్పటివరకు రాజకీయాలకు, జెండాలు, ఎజెండాలకు అతీతంగా వివక్ష, వితండవాదం లేకుండా అభివృద్ధి చేసుకుందాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలకు సూచించారు. పిల్లలకు చదువులు, వైద్యం ఉచితంగా అందించే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు సిఎం తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ రూ.1,674.74 కోట్ల నిధులతో చేపట్టనున్న సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ శాశ్వత కార్యాలయ భవన నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు, పిఎసి చైర్మన్ ఆర్కపూడి గాంధీ, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. నిపుణుల సలహా, పాలన సౌలభ్యం కోసమే గ్రేటర్ హైదరాబాద్ తరువాయి 8లో




## పెరిగిన నిత్యావసరాల ధరలు

# వెంటనే తగ్గించాలి

- సిపిఐ డిమాండ్
- రేపు జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలకు కూనంనేని పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈ నెల 10వ తేదీన నిరసన ధర్నాలు చేపడుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిజెపి ప్రభుత్వ పరిపాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు పప్పులు, నూనెలు, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. 'అచ్చే దిన్' వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు తరువాయి 12లో



## 'హిట్లర్' వ్యాఖ్యలపై బిఆర్ఎస్ విమర్శలు

# రాజకీయ దుష్ప్రచారమే

### ఐటి మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన 'హిట్లర్' వ్యాఖ్యలను వక్రీకరించి బిఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. చెరువులు, ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి రక్షించేందుకు అవసరమైన ఉక్కు సంకల్పాన్ని వివరించే సందర్భంలోనే ముఖ్యమంత్రి ఆ పదాన్ని ఉపయోగించారని, దాన్ని నాజీ తరువాయి 12లో

## నవభారత నిర్మాణంలో

# బొగ్గు రంగం కీలకం

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ అభివృద్ధి, ఆత్మనిర్భర భారత్ నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో బొగ్గు, గనుల రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తరువాయి 8లో

> త్వరలో జిహెచ్ఎంసి ఎన్నికలు ఉన్నందుకే సిఎం రేవంత్ రెడ్డి నన్ను టార్గెట్ చేసుకొని మాట్లాడుతున్నాడు. మెట్రో రైలును ఎల్ఎండ్‌టి నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అవసరమైన అప్పు కేంద్ర సంస్థ ఇచ్చింది. మొదటి దశకు రూ.1200 కోట్లు సాయం చేసింది. ధాన్యం 52 లక్షల టన్నులు కొనుగోలు చేసేందుకే కేంద్రంతో రాష్ట్రం ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఎక్కువ తీసుకోమంటే ఎట్లా? రేవంత్‌రెడ్డి పార్టీలు మారడం, అవినీతి,అక్రమాలు చేయడంలో సమర్థుడు
>
> – మీడియా చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

# మమతకు మరో దెబ్బ

- ఢిల్లీలో లోక్‌సభ ఎంపిల రహస్య భేటీ
- ఎన్‌డిఎకు మద్దతిస్తున్నట్లు 20 మంది సభ్యులు స్పీకర్‌కు లేఖ
- రాజ్యసభ సభ్యత్వానికి సుఖేందు రాజీనామా: చైర్మన్ ఆమోదం



**కోల్‌కతా / న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తరువాత అధికార తృణమూల్ కాంగ్రెస (టిఎంసి) పార్టీ ఓటమి పాలైంది. దీంతో పార్టీలో అసమ్మతి పెరిగిపోయింది. తిరుగుబాటు మొదలైంది 60 మంది ఎమ్మెల్యేలు పార్టీ తిరుగుబాటు నేత రీటాబ్రత్‌కు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నేతగా స్పీకర్ ఆయనను నియమించారు. టిఎంసిని పట్టిపీడిస్తున్న రాజకీయ అస్థిరత, ఇప్పుడు పార్లమెంటరీ శ్రేణులకు కూడా పాకినట్లు కనిపిస్తోంది. లోక్‌సభలోని 20మంది టిఎంసి ఎంపిలు ఎన్‌డిఎకు మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎంపి కకోలీ ఘోష్ నేతృత్వంలో రెబల్ ఎంపిలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించారు. లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా తాను.. తోటి ఎంపిలతో సంప్రదింపుల తర్వాతే ఈ నిర్ణయం తరువాయి 12లో

## ఉత్తర ఇజ్రాయెల్‌పై

# ఇరాన్ మెరుపు దాడులు

- లెబనాన్‌లో దుశ్చర్యలు కొనసాగితే కఠినంగా అణచివేస్తామని హెచ్చరిక
- ట్రంప్ మాట లెక్కచేయకుండా నెతన్యాహూ ఎదురుదాడులు
- ఇరాన్‌పై యుద్ధం ఆపేశాం : హెజ్బొల్లాపై దాడులు ఆగవు

### పశ్చిమాసియా యుద్ధానికి 100 రోజులు పూర్తి



**టెహ్రాన్:** బీరూట్‌లో ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా సోమవారం తెల్లవారకముందే ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాలపై క్షిపణులు,డ్రోన్లతో ఇరాన్ మెరుపు దాడులు ప్రారంభించింది. ట్రంప్ విజ్ఞప్తులతోపాటు పలు పరిణామాల తర్వాత సోమవారం సాయంత్రంనాటికి ఇరాన్ శాంతించింది. ఇజ్రాయెల్‌పై దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. స్తంభింపజేసిన తమ దేశ ఆస్తులను ఉపయోగించి గల్ఫ్‌లో యుద్ధ పునర్నిర్మాణ చర్యలు చేపట్టేందుకు అమెరికా ప్రయత్నాలను కూడా ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభించిన యుద్ధం జూన్ 8వ తేదీ సోమవారంనాటికి 100 రోజులు పూర్తయిన సందర్భంలో ఈ పరిణామం సంభవించింది. మొండిపట్టుదలతో లెబనాన్‌లో తరువాయి 12లో

# మోదీ ప్రభుత్వ సంకటం

కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆన్‌లైన్ నుంచి వాస్తవ క్షేత్రంలోకి దిగి నీట్ – యుజి ప్రశ్నాపత్రాల లీకేజి, సిబిఎస్ఇ పరీక్షల్లో మార్కుల కేటాయింపు (ఆన్‌లైన్ మార్కింగ్ సిస్టం)లో అవకతవకలకు మోదీ ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ, జూన్ 6న జంతర్‌మంతర్ నిరసన వేదిక నుంచి విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ బర్తరఫ్ ను డిమాండ్ చేయటం, వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్త ఆందోళనకు దిగుతామని ఆ పార్టీ నాయకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించటం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, మోదీ నాయకత్వ ప్రతిష్టను పెద్ద సందిగ్ధావస్థలో పడేసింది. దేశంలోని విద్యార్థులు, యువతలో నెలకొని ఉన్న అసంతృప్తి, ఆగ్రహానికి ముందుగా నీట్–యుజి ప్రశ్నాపత్రం లీకేజి, పరీక్ష రద్దు ఆజ్యం పోసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ 'నిరుద్యోగులను' బొద్దింకలతో పోల్చుతూ చేసిన వ్యాఖ్యను వ్యంగ్యంగా చిత్రిస్తూ ఒక భారతీయ యువకుడు అమెరికా నుంచి సోషల్ మీడియా ఎక్స్ ఆన్‌లైన్‌లో వదిలిన సిజెపి మిస్సైల్‌లా యువతరంలోకి దూసుకెళ్లింది. రెండు రోజుల్లోనే అనూహ్యంగా రెండు కోట్లకుపైగా ఫాలోయర్లు మద్దతు తెలిపారు. ఇది పాలక బిజెపి గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. అది జాతీయ భద్రతకు ముప్పు అని గూఢచారి విభాగం ఊహ ప్రభుత్వానికి చేరింది. మార్చి 16 ఎక్స్‌పై ప్రారంభించిన సిజెపి సోషల్ మీడియా అక్కౌంట్‌ను మోదీ ప్రభుత్వం తొలగింపజేసింది. బిజెపి మద్దతుదారులు సోషల్ మీడియాలో సిజెపిని నానా దుర్భాషలాడారు. అంటే దేశం యువతనుంచి మోదీ ప్రభుత్వానికి రాగల ప్రమాదాన్ని వారు గ్రహించి, మొగ్గలోనే కాలరాసే ప్రయత్నం చేశారన్నమాట. ఆ సిజెపి వ్యవస్థాపకుడు దీప్కే తన ప్రాణానికి ముప్పురాగలదన్న హెచ్చరికలను త్రోసిపుచ్చి అమెరికానుండి శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయం చేరుకున్నారు. పెద్ద బందోబస్తు చూసి ఆశ్చర్యపోయాడు. ఈలోపు, గెలికితే ఎగిసిపడుతుందని పాలకులకు జ్ఞానోదయం అయిందేమో చెప్పలేముగాని, ఢిల్లీ పోలీసులు ఆ యువకుణ్ణి లాంజ్‌లోకి తీసుకెళ్ళి, జంతర్‌మంతర్ నిరసనకు అనుమతికోరే దరఖాస్తుపై సంతకం చేయించుకుని అక్కడికక్కడే పర్మిషన్ మంజూరు ఇచ్చారు. ఆన్‌లైన్ ప్రకటన ఆధారంగా కొద్దివేలమంది విద్యార్థులు, యువకులు జంతర్‌మంతర్ చేరారు. వామపక్ష, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రేక్షకులుగా అక్కడికి చేరినా అది పూర్తిగా రాజకీయేతర సమూహం ఆందోళన. ప్రధాన్‌ను తొలగించేందుకు మోదీకి శనివారం వరకు సమయమిచ్చి ప్రశాంతంగా వెళ్లిపోయారు. అనంతరం దీప్కే తన తల్లిదండ్రులను కలుసుకునేందుకు మహారాష్ట్రలోని తమ స్వస్థలానికి వెళ్లారు.

నీట్–యుజి ప్రశ్నాపత్రం లీక్ అయిన దగ్గరనుంచీ నైతిక బాధ్యత వహిస్తూ విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా చెవిఒగ్గని మోదీ ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో ఉద్భవించిన హాస్య, వ్యంగ్య వేదిక 'బొద్దింక జనతాపార్టీ' ఎందుకు దడపుట్టించింది? పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జన్–జడ్ తరం అయత్నకృత తిరుగుబాటుతో ప్రభుత్వాలు కూలిపోయిన పీడకల పీడించి ఉంటుంది!

సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌నుండి సిజెపి హాండిల్ తొలగింపజేసిన మోదీ ఉత్తర్వు, తాను 'బొద్దింక'లని నిరుద్యోగులను ఉద్దేశించి వ్యాఖ్యానించలేదు, బోగస్ డిగ్రీలతో హడావుడి చేసేవాళ్లను అన్నానని జస్టిస్ సూర్యకాంత్ ఇచ్చిన వివరణ ఎందుకు విఫలమయ్యాయన్నది ప్రశ్న. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహకవర్గం రెండింటి విశ్వసనీయతలో యువత భ్రమలు కోల్పోవటం ఒక సమాధానంగా కనిపిస్తున్నది. న్యాయవ్యవస్థ కీలకాంశాలపై సకాలంలో తీర్పులు ఇవ్వకుండా పర్యవేక్షక పాత్రవహిస్తూ, స్వామికార్యం నెరవేరాక తీర్పులివ్వటంలో దాని దిగజారుడుతనం కనిపిస్తోంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సమీక్ష('సర్') కు సంబంధించి ఎన్నికల కమిషన్‌పై కేసులో మొన్న పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు వెలువడినాక – ఇసి చర్యను సమర్థిస్తూ జస్టిస్ సూర్యకాంత్ తీర్పు ఇచ్చారు. ఈలోపు ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో కోట్లమంది ఓటర్ల తొలగింపు, ఇసి సహాయంతో బిజెపి బిహార్‌లో ప్రభుత్వాన్ని నిలుపుకోవటం, ప.బెంగాల్‌లో అధికారం చేజిక్కించుకోవటం జరిగిపోయాయి. ఈ రెండు ఎన్నికలు న్యాయబద్ధంగా, సజావుగా జరగలేదన్న భావన యువతరంలో ఉంది. పరీక్షల నిర్వహణ సహా వివిధ అంశాలపై జవాబుదారీతనాన్ని నిర్ణయించటం ద్వారా, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కోల్పోయిన విశ్వసనీయతను పునరుద్ధరించుకోవాల్సి ఉంది.

ప్రభుత్వ వ్యవస్థలకు ఎంత అహంకారమో, నోటిదురుసో చూడండి. సిబిఎస్ఇ ఆన్‌లైన్ మార్కుల పద్ధతిలో తప్పులను ఎత్తిచూపిన విద్యార్థిని ప్రభుత్వ మీడియా యాంకర్లలో ఒకరు 'పాకిస్థానీ' (బిజెపికి అలవాటైన ముద్రవేసే పద్ధతి) అన్నారు. అది బెడిసికొట్టింది. అతనిది ఢిల్లీ. పార్లమెంటరీ కమిటీ అతన్ని పిలిచి అతని వివరణను విన్నది కూడా. ఈ ఉద్యమం వెనుక విదేశీ హస్తం ఉందన్న ప్రభుత్వ కథనాన్ని ముందుకు తేవటానికి పలువురు చేసిన ప్రయత్నం విఫలమైంది. కొందరు ముస్లింకోణం తేవటానికి ప్రయత్నించారు. 'మీరు ఉద్యమంలో పాల్గోకండి – పాల్గొన్నారో ప్రభుత్వం వెంటాడి వేధిస్తుంది' అని ముస్లిం సంస్థలు చేసిన విజ్ఞప్తి ఫలించింది.

సిజెపి డిమాండ్ చేస్తున్న జవాబుదారీతనం ప్రధాన్ రాజీనామాకే పరిమితం కాదు. ఇతర అనేక సమస్యలు ఇమిడి ఉన్నాయి. సిజెపి డిమాండ్‌పై చర్య తీసుకోకుండా ఉద్యమాన్ని అణచివేయటానికి మోదీ ప్రభుత్వ ప్రయత్నిస్తే అది మోదీ ప్రతిష్టకు, ఆయన ప్రభుత్వ విశ్వసనీయతకు, రాజకీయ ఆధిపత్యానికీ తీరని హాని చేస్తుంది. ప్రధాన్‌ని తొలగించి ప్రభుత్వ ప్రతిష్ట కాపాడుకోవాలనుకున్నా, 'మోదీ ఒత్తిడికి తలొగ్గడని' తెచ్చిపెట్టుకున్న ప్రతిష్ట మంటగలుస్తుంది. రైతుల సుదీర్ఘ ఆందోళనకు తలదించి మూడు కార్పొరేట్ అనుకూల చట్టాలు ఉపసంహరించుకుని దేశ ప్రజలకు తొలిసారి బహిరంగ క్షమాపణ చెప్పారు. కాని వారికిచ్చిన 'పంటల ఎంఎస్‌పికి చట్టబద్ధ రక్షణ' హామీ అమలు జరుపలేదు. ప్రస్తుత సమస్య, ప్రభుత్వ చర్య డిమాండ్ పర్యవసానం ఎలా ఉన్నా, సిజెపి ఉద్యమం మోదీ ప్రభుత్వాన్ని వెన్నాడుతూనే ఉంటుంది. ●



## మీనాక్షి నటరాజన్‌కి ఎంఎల్‌ఎల సంపూర్ణ మద్దతు

**కాంగ్రెస్ పార్టీలో చీలిక తీసుకురాగలమనే భ్రమ, తప్పుడు ఆలోచనలో బిజెపి ఉంది. కాంగ్రెస్ పూర్తిగా ఐక్యంగా ఉంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందరూ పార్టీ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్‌కు సంపూర్ణ మద్దతును ఇస్తున్నారు. అలాగే బిజెపికి అలవాటైన చీలిక ను సృష్టించే వ్యూహం మధ్యప్రదేశ్‌లో విజయవంతం కాదు. మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అభ్యర్థి, కాంగ్రెస్‌లో మేమంతా ఐక్యంగా ఉన్నాము.**

- కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ సింగ్

# నిర్వీర్యం అవుతున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం

ప్రాంతేతరుడు మోసం చేస్తే ప్రాంత పొలిమేరల వరకు తరిమి కొడతాం. ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే పాతిపెడతాం అన్న పెద్దలు కాలోజీ నారాయణరావు గారి మాటలు ఇప్పుడు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీల మదిలో మారుమ్రోగుతున్నాయి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఆంధ్రపాలకుల చెర వీడి, మా బతుకులకు కాసింత మంచి జరుగుద్ది అని, ప్రాంతం వోడే పాలకుడైతే బతుకెరిగి పాలిస్తే బిడ్డలందరికీ పట్టేడన్నం దొరుకుద్దని అలాగే మావెతలు తీరుతాయని భ్రమించి మలిదశ తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నడిచిన పేద బతుకులకు పేరాశే మిగిలింది. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన దళితులు, గిరిజన బిడ్డలు దినదిన గండంగా బతుకులు వెళ్ళదీస్తున్న దీన పరిస్థితి నేడు మన కళ్ళ ముందు కనబడుతోంది.

ఎస్సీ, ఎస్టీ లపై దాడులు నిరోధించేందుకు తీసుకొచ్చిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి దళితులు, ఆదివాసీలపై (గిరిజన) దాడులకు తెగబడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం, ఆర్థిక సాయం, పునరావాసం కల్పించటానికి ఈ చట్టంలో సెక్షన్ 12(4), 4ఏ కింద జిల్లా కలెక్టర్ లకు తక్షణ అధికారాలు కల్పించ బడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 4,088 మంది బాధితులు ఉండగా, వారికి సుమారు 40కోట్ల మేరకు పరిహారం అందాల్సి ఉన్నది. ఈ నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ, గతంలో జాతీయ ఎస్సీ కమీషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినా, రాష్ట్ర ప్రభుత్వ తీరులో మార్పు రాలేదు. పైగా గత రెండున్నరేండ్లుగా బాధితులకు పరిహారం చెల్లించడంలో విఫలమైందని, తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని చెప్పాలి. ఇదే విషయంపై గతంలో జాతీయ ఎస్సీ కమిషన్ సాక్షాత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నోటీసు జారీ చేయడం విశేషం.

దీంతో గత ఆర్థిక సంవత్సరం చివరిలో 20కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటన చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. అట్రాసిటీ బాధితుల పరిహారం, పునరావాసం కోసం 2026–27 బడ్జెట్ లో 70కోట్లు కేటాయిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి నామమాత్రంగా 5.59కోట్లు మాత్రమే విదిలించింది.

వాస్తవానికి ట్రెజరీ కంట్రోల్, అకౌంట్ తదితర సడలింపులు ఇచ్చైనా బాధితులకు సత్వరమే పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఈ విషయంపై ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి కొద్ది నెలల క్రితమే గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపారు. అవీ కూడా బుట్ట దాఖలు కావడం గమనార్హం. ఇక అమాయక జాతులు దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, కేసుల వివరాలు ఒకసారి పరికించి చూద్దాం. 2023లో 7,152 కేసులు నమోదు అవగా, అందులో 145 పరిష్కారం కాగా 7,,007 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 2024లో 9,959 కేసులు నమోదు అవగా, అందులో 73కేసులు మాత్రమే పరిష్కారం అవ్వగా 8,986కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. 2025వ సంవత్సరంలో 10,096 కేసులు నమోదు అవగా, కేవలం 9 కేసులు మాత్రమే పరిష్కరించబడగా, 10,087 కేసులు ఇంకా కోర్టు పరిధిలోనే ఉన్నాయి. ఇలా దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని ఈ గణాంకాలే చెపుతున్నాయి. 17వ శతాబ్దంలో ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా యూరప్‌ను గడగడలాడించిన ఇంగ్లీష్ విప్లవంలా అణగారిన జాతులు ఉప్పెన లా దూకి తమను తాము రక్షించుకునే రక్షణోద్యమం చేస్తే తప్ప ఇక్కడి మేధావులు, కవులు, కళాకారులు ఈ దురాగతాలపై స్పందించే పరిస్థితి కనబడుటలేదు.

**ధీరన్ కొడారి,**
8008200664

# ఆర్టీసిలో అధికార, సూపర్ వైజర్ల గ్రేడ్ పే దుర్వినియోగం



**ఎస్.బాబు,** అధ్యక్షులు
టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

ఆర్టీసి సూపర్ వైజర్లు, అధికారులు గ్రేడ్ పేకు చెదల్లా పట్టారు. తెలంగాణ ఆర్టీసిలో కార్మికులకు రావలసిన 2013 వేతన సవరణ రాష్ట్రం సాకారమైన తరువాత టిఆర్ఎస్ ప్రభుత్వం 2015లో అమలు చేసింది. ఈ వేతన సవరణలోనే సూపర్ వైజర్లకు, ఆర్టీసి ఆఫీసర్లకు గ్రేడ్ పే ఇచ్చుకున్నారు. క్లాస్3, క్లాస్ 4 ఉద్యోగులకు కూడా గ్రేడ్ పే అమలు చేయాలని ఆనాడు గుర్తింపు సంఘంగా ఉన్న ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసినా అధికారులు అమలు చేయలేదు. కేవలం ఆఫీసర్లకు, సూపర్ వైజర్లకు మాత్రమే అమలయింది. గ్రేడ్ పే మీద డి.ఎ, హెచ్.ఆర్.ఎ కూడా డ్రా చేస్తారు. ఎన్ క్యాష్ మెంట్ సెటిల్మెంట్ బెనిఫిట్స్ లో కూడా ఈ గ్రేడ్ పే కలుస్తుంది.

ఆఫీసర్లు 2015లో 12,000 గ్రేడ్ పే అమలు చేసుకున్నారు. అసలు ఈ గ్రేడ్ పే పెట్టుకోవాల్సిన అవసరం ఏముంది? అధికారులకు కాని,

| క్రమ సంఖ్య | కేటగిరీ | సంవత్సరం | గ్రేడ్ పే నెలకు | 2017 వేతన సవరణలో పెరిగిన గ్రేడ్ పే | పెరిగిన శాతం |
|---|---|---|---|---|---|
| 1. | అసిస్టెంట్ మేనేజర్ | 2015 | 1,500 | 2,300 | 54 శాతం |
| 2. | సూపరింటెండెంట్ | 2015 | 700 | 1,100 | 57 శాతం |
| 3. | డిప్యూటీ సూపరింటెండెంట్ | 2015 | 500 | 800 | 60 శాతం |
| 4. | రీజనల్ మేనేజర్ / హెచ్.ఓ.డి | 2015 | 12,000 | 14,500 | 21 శాతం |
| 5. | సీనియర్ స్కేల్ ఆఫీసర్ | 2015 | 8,000 | 10,000 | 20 శాతం |
| 6. | జూనియర్ స్కేల్ ఆఫీసర్ | 2015 | 5,500 | 7,000 | 28 శాతం |

సూపర్ వైజర్లకు కాని గ్రేడ్ పే అమలు చేసుకోవటానికి ప్రత్యేక నైపుణ్యం కలిగిన కోర్సులు ఏమైనా చేశారా? 12,000 రూపాయలు ఉన్న గ్రేడ్ పే 2017 వేతన సవరణలో 21 శాతం పెరిగి 14,500 అయింది. అంటే ప్రైవేట్ కంపెనీలలో ఇదొక ఉద్యోగి నెల జీతం. అంతటి మొత్తాలను గ్రేడ్ పే గా పెట్టుకుని దానిపై డి.ఎ, హెచ్.ఆర్.ఎ లు డ్రా చేస్తూ నష్టాలలో ఉన్న ఆర్టీసిని మరింత నష్టంలోకి కూరుకుపోయేలా చేశారు. సూపర్ వైజర్ కేటగిరీలో గ్రేడ్ పే ను 60 శాతంగా పెంచుకోవటం కార్మికులకు అన్యాయం చేయటమే. కాకులను కొట్టి గద్దలకు పెట్టటమంటే ఇదే. కార్మికులకు ఇవ్వాల్సిన 2017 ఆర్పీఎస్ లో అలవెన్సులు అమలు చేయకుండా ఒక్క గ్రేడ్ పే మాత్రమే పెంచుకోవటం అన్యాయం.

వేతన సవరణకు 11 శాతం ఫిట్మెంట్ వస్తే, గ్రేడ్ పే ను అధికారులు, సూపర్ వైజర్లు 28 నుండి 60 శాతం పెంచుకోవడం వల్ల వారి ఆర్థిక ఆదాయం బాగా పెరిగింది. ఈ గ్రేడ్ పే లను బేసిక్ పే తో కలపడం వల్ల సహజంగా రావాల్సిన బేసిక్ పే 10,000 రూపాయలకు పైబడి పెరిగింది. అందువల్ల డిపో మేనేజర్ బేసిక్ పే కొత్త వేతన సవరణలో 74,500 రూపాయలు రావలసి ఉండగా అది 84,000 వరకు పెరిగింది. ఈ గ్రేడ్ పే వల్ల సీనియర్ స్కేల్ ఆఫీసర్ బేసిక్ పే కూడా 1,22,000 కు పెరిగింది. గ్రేడ్ పే ను అధికారులు తమ ఇష్టం వచ్చిన విధంగా పెంచుకోవటం వల్ల సంస్థపై సాలీనా 7 కోట్ల రూపాయల అదనపు భారం పడింది. మూలిగే నక్కపై తాటిపండు పడటం అంటే ఇదే. అధికారులు, సూపర్ వైజర్లు కార్మికులను త్యాగాలు చేయాలంటారు. కానీ వారు మాత్రం గ్రేడ్ పే లాంటివి పెంచుకుని సంస్థకు భారంగా తయారవుతున్నారు. 2021 వేతన సవరణలో 14,500 ఉన్న గ్రేడ్ పే బేసిక్ పే తో మెర్జ్ చేయటం వల్ల సంస్థకు నష్టం, అధికారగణానికి లాభం. ఎపిఎస్ ఆర్టీసి ప్రభుత్వంలో విలీనం అయినప్పుడు గ్రేడ్ పే ను బేసిక్ పే తో మెర్జ్ చేయకుండా ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. ఇది గమనించిన తెలంగాణ ఆర్టీసి అధికారులు ఆర్టీసి ప్రభుత్వంలో విలీనం అయితే తాము అప్పనంగా తింటున్న గ్రేడ్ పే ఎక్కడ లేకుండా పోతుందో అనే ముందు చూపుతో బేసిక్ పే లో మెర్జ్ చేసుకుని స్కేల్ పెంచుకోవటం ఆర్టీసి దౌర్భాగ్యం. అధికారులకు ఒక న్యాయం, కార్మికులకు మరొక న్యాయమా అని వర్కింగ్ క్లాస్ ప్రశ్నిస్తోంది. టైపిస్ట్ ల స్పెషల్ పే ని బేసిక్ పే లో మెర్జ్ చేయాలని గత 20 సంవత్సరాలుగా యూనియన్లు డిమాండు చేస్తున్నా యి. అయినా వారి స్పెషల్ పే నేటివరకు బేసిక్ పే లో మెర్జ్ కాలేదు. కాక పోగా గత 2 పిఆర్సీల నుండి స్పెషల్ పే పెరగడం కూడా లేదు. అధికారుల గ్రేడ్ పే పెరుగుతుంది కాని కార్మికుల స్పెషల్ పే లు, అలవెన్సులు పెరగవు. ఇదెక్కడి న్యాయమని ఆర్టీసి కార్మికులు వాపోతున్నారు. సంస్థ నష్టాల్లో ఉందని కాకమ్మ కథలు చెప్తున్న ఆర్టీసి అధికారగణం సాలీనా 7 కోట్ల రూపాయలను అప్పనంగా ఎందుకు దోచుకుంటున్నారు?

| క్రమ సంఖ్య | కేటగిరి | గ్రేడ్ పే కలపకుండా వచ్చిన ఫిక్సేషన్ మొత్తం | గ్రేడ్ పే కలిపిన తరువాత పెరిగిన ఫిక్సేషన్ /బేసిక్ పే | బేసిక్ పే లో పెరిగిన మొత్తం |
|---|---|---|---|---|
| 1. | రీజనల్ మేనేజర్/ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ | 1,45,750 | 1,65,000 | 19,250 |
| 2. | సీనియర్ స్కేల్ ఆఫీసర్ | 1,08,477 | 1,22,000 | 13,523 |
| 3. | డిపో మేనేజర్ / జూనియర్ స్కేల్ | 74,536 | 84,000 | 9,464 |
| 4. | అసిస్టెంట్ మేనేజర్ | 45,134 | 48,200 | 3,066 |
| 5. | సూపరింటెండెంట్ | 38,692 | 40,160 | 1,468 |
| 6. | డిప్యూటీ సూపరింటెండెంట్ | 36,044 | 37,110 | 1,065 |

కార్మికులకు ఇచ్చే ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ తీసివేస్తూ సర్క్యులర్ ఆదేశాలు జారీ చేస్తారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ ప్రభుత్వంలో లేదు కాబట్టి తీసివేశాం అంటున్నారు. మరి గ్రేడ్ పే కూడా గవర్నమెంట్ ఉద్యోగులకు లేదు కదా? అప్పుడు గ్రేడ్ పే ను కూడా రద్దు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ సచివాలయం సాలీనా కరెంట్ బిల్లు ఖర్చు 9 కోట్ల రూపాయలు అవుతుంది. ఆర్టీసి అధికారులు, సూపర్ వైజర్లు గ్రేడ్ పే కోసం సాలీనా 7 నుండి 8 కోట్ల రూపాయలు సంస్థపై ఆర్థిక భారం మోపుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఫిట్మెంట్ తీసుకుంటూనే గ్రేడ్ పే ను బేసిక్ పేలో విలీనం చేసుకుంటూ ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతున్నారు. గ్రేడ్ పే ను మెర్జ్ చేసి బేసిక్ పే లను పెంచుకుంటూ అధికారులు యాక్షన్ థ్రిల్లర్ సినిమా చూపిస్తున్నారు. 2021 ఆర్పీఎస్ లో గ్రేడ్ పే అనేది బర్నింగ్ టాపిక్ గా మారింది. తెలంగాణ ఎండల వల్ల నిప్పుల కొలిమిగా మారితే, ఆర్టీసిలో ఈ గ్రేడ్ పే అనేది హీట్ వేవ్ లను సృష్టిస్తోంది. నార్సింగ్ లో ముస్కిన్ చెరువును రియల్టర్లు కబ్జా చేసిన విధంగా ఆర్టీసి అధికారులు, సూపర్ వైజర్లు గ్రేడ్ పే ను బేసిక్ పేలో మెర్జ్ చేసి ఆర్పీఎస్ 2021 ను కబ్జా చేశారు. గ్రేడ్ పే ను బేసిక్ పే లో కలపక ముందు, కలిపిన తరువాత జరిగే చిత్రం పై పట్టికలో చూడొచ్చు.

గ్రేడ్ పే ను బేసిక్ పేలో మెర్జ్ చేయటం వల్ల రీజనల్ మేనేజర్ /హెచ్.ఓ.డి లకు వాస్తవంగా రావలసిన బేసిక్ పే కంటే 19,250 రూపాయలు పెరిగింది.

సీనియర్ స్కేల్ ఆఫీసర్ బేసిక్ పే 13,523 రూపాయలు పెరిగింది. దీనిమీద ప్రతినెల డి.ఎ, హెచ్.ఆర్.ఎ లు డ్రా చేయటం జరుగుతుంది. డిపో మేనేజర్ కేటగిరీలో 9,464 రూపాయలు బేసిక్ పే పెరగటం చూశాం. అలాగే ఇతర కేటగిరీలలో కూడా బేసిక్ పే లు విపరీతంగా పెరిగాయి. కాని డ్రైవర్, కండక్టర్లకు మాత్రం డి.ఎ మరియు ఫిట్మెంట్ కలిపిన తరువాత స్కేల్ లో కూర్చోవటానికి కేవలం రూపాయి, రెండు రూపాయలు మాత్రమే పెరిగాయి.

ఎండనక, వాననక కళ్ళలో ఒత్తులు వేసుకుని 16 నుండి 18 గంటలు పని చేస్తున్న డ్రైవర్, కండక్టర్లకు స్కేల్ లో వచ్చే బెనిఫిట్ 1 లేదా 2 రూపాయలు. అదే అధికారులకు గ్రేడ్ పే బేసిక్ పే లో మెర్జ్ కావటం వల్ల బేసిక్ పే వేలకు వేల రూపాయలు పెరిగింది. సమ్మె సందర్భంగా అధికారులు, సూపర్ వైజర్లు సమ్మెలు వద్దన్నవారే.

కార్మికులు సమ్మె చేశారు. పోలీసు కేసులు అయ్యాయి. జైలు పాలయ్యారు. ఎఫ్.ఐ.ఆర్‌లు బుక్ అయి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పోలీసులతో లాఠీ దెబ్బలు తిన్నారు. లీవులు పోగొట్టుకున్నారు. అటువంటి వారికి వచ్చిన స్కేల్ బెనిఫిట్ కేవలం 1 లేదా 2 రూపాయలు మాత్రమే. పే స్కేల్ వద్దన్న అధికారులు, సమ్మె లోకి రాని సూపర్ వైజర్లు గ్రేడ్ పే లను మెర్జ్ చేసి బేసిక్ పేలు పెంచుకుని ఆర్టీసిని ఆర్థికంగా దెబ్బ తీస్తున్నారని కార్మికులలో దృఢంగా ఒక అభిప్రాయం ఏర్పడింది. అందువలన కార్మికులకు పి.పి గా వస్తున్న తెలంగాణ ఇంక్రిమెంట్ ను, గ్రాడ్యుయేషన్ ఇంక్రిమెంట్లను, ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్లను, టైపిస్టుల స్పెషల్ పే లను బేసిక్ పేలో మెర్జ్ చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

# 80 వసంతాల ఉద్యమ సంఘం ఎస్టీయు

నాడు నిజాం నిరంకుశ పాలనలో హక్కులు కోల్పోయి, అణచివేతకు గురవుతూ నిబిడీకృతమైన నిర్బంధపు గాఢాంధకారంలో మ్రగ్గుతూ, నిరాశ నిస్పృహలతో జీవయాత్ర కొనసాగిస్తున్న ఉపాధ్యాయ లోకాన్ని చైతన్య పరచుటకై కారుచీకట్లను చీల్చుకుంటూ ఓ కాంతిరేఖ ప్రసరించింది. నియంతృత్వపు దాస్య శృంఖలాలను ఛేదించుకున్న ఓ గళం పొలికేక పెట్టింది. బతుకుతోవలు చూపుతూ అరుణోదయం ఆవిష్కృతమైనది. అరుణోదయం పోరుబిడ్డల నుదుట సింధూరమైంది. అరుణ కిరణాలు ఉద్యమ పతాకాలై రెపరెపలాడాయి.హక్కుల నినాదాలు శంఖారావాలై ప్రతిధ్వనించాయి.అవి ఉపాధ్యాయ ఉద్యమానికి నాందీ గీతాలైనాయి. ఉపాధ్యాయ లోకాన్ని కదిలించిన ఆ చైతన్య కాంతిరేఖయే, ఆ పొలికేకయే, ఆ అరుణోదయమే మన రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు).

భారత స్వాతంత్ర్యానికి పూర్వమే నాటి హైదరాబాదు సంస్థానంలో 'హైదరాబాదు స్టేట్ టీచర్స్ యూనియన్'గా ఆవిర్భవించబడి అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ వెన్నుచూపని, మడమతిప్పని పోరాటాల ద్వారా నిజాం నిరంకుశ ప్రభుత్వం మెడలువంచి 1947 జూన్ 9న ప్రభుత్వంచే గుర్తింపు సంఘంగా ఉత్తర్వులు పొందింది. ఆవిధంగా భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వ గుర్తింపు సాధించిన సంఘంగానే కాకుండా మొట్టమొదటి వేతన సవరణను కూడా నియమింపజేసిన ఘనత రాష్ట్రోపాధ్యాయ సంఘానికి దక్కింది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు విలీనమై ఆంధ్రప్రదేశ్‌గా అవతరించిన తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 'హైదరాబాదు స్టేట్ టీచర్స్ యూనియన్ – స్టేట్ టీచర్స్ యూనియన్‌గా ఏర్పడింది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రభుత్వ బడుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నది.

సంఘం ఆవిర్భవించి 79 వసంతాలు పూర్తిచేసుకున్నది. బహుశ ఇంతటి సుదీర్ఘ ప్రస్థానం ఏ ఉపాధ్యాయ సంఘానికి లేదంటే అతిశయోక్తి కాదేమో! ఒక నది కొండల్లో పుట్టి,గుట్టలెక్కుతూ, దిగు తూ, మలుపులు తిరుగుతూ, ఒకచోట గంభీరంగా, మరొకచోట ధ్వనిస్తూ వేగంగా ఉరకలెత్తుచూ, తన మార్గంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ ప్రవహిస్తుంటుంది. ఎస్టీయూ ప్రస్థానం కూడా ఒక జీవనది లాంటిదే. కఠిన పరిస్థితుల నడుమ ఆవిర్భవించి ప్రవాహంలా ఉద్యమాన్ని కొనసాగిస్తూ ఆ క్రమంలో ఎదురైన ఎన్నో నిర్బంధాలు,అక్రమ అరెస్టులు, లాఠీ దెబ్బలు తదితర అవరోధాలను అధిగమిస్తూ ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణ, విద్యారంగ సంక్షేమం లక్ష్యాలుగా తన ప్రస్థానాన్ని కొనసాగించింది, కొనసాగిస్తూనే ఉంటుంది.

ఉన్నతమైన లక్ష్యం, ఆశయం, పోరాటం పునాదులుగా సంఘటిత శక్తితో నిర్మితమైన రాష్ట్రోపాధ్యాయ సంఘాన్ని వివిధ కారణాలతో చీలికలు, పేలికలు చేయాలని ప్రయత్నించిన వారందరూ కాలగర్భంలో కలిసిపోయారు. యస్.టి.యు. తనను ఆశ్రయించిన వారిని ఆదరించి, అక్కున చేర్చుకొని, అండగా నిలిచింది. తన 79 ఏండ్ల ప్రస్థానంలో ఎందరో సమర్థవంతులైన నాయకులను తయారుచేసింది. మెరికల్లాంటి కార్యకర్తలను సమకూర్చుకున్నది. మేధావులను చట్టసభలకు పంపించింది. ఆ 'మేధావి' వర్గం సభలో 'ఉపాధ్యాయ వాణి'ని సమర్థవంతంగా వినిపించి 'నమస్తే ఉపాధ్యాయ' అనిపించేలా చేసింది.

నాటి నుండి నేటి వరకు ఎందరో రాష్ట్ర సంఘానికి నాయకత్వం వహించారు. ఎస్టీయు లో నాయకత్వం అనేది ఒక పదవికాదు.అది త్యాగం తో కూడిన ఒక బాధ్యత, యస్.టి.యు. నాయకులు సంఘ ఆశయాలకు అనుగుణంగ కర్తవ్యోన్ముఖులై కార్యదీక్షతో సంఘ నిర్మాణాన్ని పటిష్ట పరుస్తూ ముందుకు సాగారు. 'మీరు పోరాడండి మీ వెనుక మేమున్నాం' అనే తీరు కాకుండా తామే ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారు. ఆ క్రమంలో అనేకమార్లు ఉద్యమాన్ని నిరోధించే శక్తులతో పెనుగులాడి, గాయాల పాలయ్యారు. ఉపాధ్యాయ సమస్యలపై ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూస్తూ కాలయాపన చేయడం ఎస్టీ యు నాయకత్వానికి చేతకాదు. పార్టీ ఏదైనా, పాలకులెవరైనా ఎస్టీయు కు సంబంధంలేదు. ఉపాధ్యాయ సమస్యలపై తక్షణమే స్పందించి, ఉద్యమించి పాలకుల కండ్లు తెరిపించే ప్రయత్నం చేస్తుంది. పైరవీలకు తావులేనిది, పాలకుల, అధికారుల భజనకు ఆస్కారం లేనిది రాష్ట్రోపాధ్యాయ సంఘం. ఎస్టీ యూ నాయకత్వానికి మనోధైర్యం, పోరాటతత్త్వం, తెగువ, అంకితభావం, సమస్యలపై అవగాహన పూరిత ఆలోచన సంఘమే నేర్పింది. 'ఒకచో నేల పై, ఒకచో పూసెజ్జపై' అన్నట్లు కార్య సాధకులైన ఎస్టీయూ నాయకులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ అందుబాటులో ఉన్న సౌకర్యాలనే వినియోగించుకుంటూ నిరంతరం సంఘాన్ని పటిష్టపరుస్తూ, ఉపాధ్యాయులలో చైతన్యం కలిగించే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అటువంటి ఉద్యమ పుత్రులను పోషించిన తల్లి రాష్ట్రోపాధ్యాయ సంఘం.

యస్.టి.యు. తన 79 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు చేసింది. ఎన్నో ఫలితాలు సాధించింది. ఈనాడు ఉపాధ్యాయులు పొందుతున్న అనేక సర్వీసుపరమైన,ఆర్థిక పరమైన ప్రయోజనాలకు, సౌకర్యాలకు ఎస్టీయు పోరాటమే మూలము.

ఎస్టీయూ ఉపాధ్యా య సమస్యలతో పాటు విద్యారంగ సంక్షేమం కొర కు, బడిపిల్లలకు నాణ్యమైన విద్య లభించడం కొరకు ఆది నుండి తన గళం వినిపిస్తూనే ఉన్నది. ఉద్యమిస్తూనే ఉన్నది. విద్యారంగంలో చోటుచేసు కుంటున్న పరిణామాలు, విద్యా ప్రణాళికలు, మూల్యాంకన విధానాలు మొదలైన అంశాలపై పరిశోధన, పరిశీలన, అధ్యయనం, లోతైన అవగాహన, విశ్లేషణలతో కూడిన సలహాలు, సూచనలు ప్రభుత్వానికి అందించింది. పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా లభిస్తుందో సహేతుకంగా తెలియజెప్పింది. జాతీయ స్థాయి విద్యా విధానంపై కూలంకషంగా చర్చించి తన అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. పేద పిల్లలు చదువుకునే బడులను హేతుబద్ధీకరణ పేరుతో పాలకులు మూసివేయాలని నిర్ణయించినప్పుడు ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా, పేద పిల్లలకు అండగా ఉద్యమించిన ఎస్టీయు ప్రభుత్వ బడులను కాపాడుకొనుటలో సఫలీకృతమైంది.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడుతూనే ఎస్టీయు సామాజిక అవసరాలపై కూడా బాధ్యతా యుతంగా స్పందించింది. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను గుర్తించిన ఎస్టీయు తొలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నది. తత్ఫలితంగా తన గుర్తింపును కోల్పోయింది. అయినా వెనుకడుగు వేయలేదు. అట్లాగే మలిదశ ఉద్యమంలో కూడా చురుకుగా పాల్గొన్నది. ఇక్కడ స్థిరపడిన ఆంధ్రా సోదరులకు తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను తెలిపి వారిని కూడా ఉద్యమంలో భాగస్థులను చేసిన సంఘం ఒక్క ఎస్టీయు మాత్రమే.

అదేవిధంగా కోవిడ్ సమయంలో తమ ఉపాధ్యాయులకు జీతాలు సరిగా అందకపోయినా కూడా సమాజంలో పనులు లేక పస్తులుంటున్న దినసరి కూలీల ఆకలి తీర్చడం కోసం ఎస్టీయు బియ్యం, పప్పు, కూరలు వంటి వాటిని పేదలకు అందించింది. కరోనా వల్ల ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడిన ప్రైవేటు ఉపాధ్యాయులను ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సూచించడమే కాకుండా తన వంతు కూడా వస్తు రూపేణా,ధనరూపేణా సహాయం అందించింది. కరోనా సమయంలో రక్తం దొరకక బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు రక్త కొరతను ఎదుర్కొంటున్నప్పుడు ఎస్టీయూ సభ్యులు రక్తదాతలై పలుచోట్ల రక్తదానం చేశారు. వయనాడ్‌లో ప్రకృతి సృష్టించిన ప్రళయానికి అభాగ్యులైన వారిని ఆదుకోవడానికి 2లక్షలు నగదు రూపేణా విరాళం అందించింది.

ఈ విధంగా చెప్పుకుంటూ పోతే యస్.టి.యు. సేవా తత్పరత ఒక గ్రంథం అవుతుంది. ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక అంశాలపై బాధ్యత కలిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎంతో ఉన్నతమైనది. అటువంటి సంఘంలో సభ్యత్వం కలిగి ఉండడం ఉపాధ్యాయులకు గర్వకారణం. 'ఏ రాపిడి లేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది, ఏ అలజడి లేకుండా సంద్రం ఎలా నిలుస్తుంది, నడిపించే చైతన్యం లేనిదే నడవదు సృష్టి' అన్నట్లు ఎన్నో ఆటుపోట్లు, ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా టీచర్ల సహకారంతో వాటిని తట్టుకొని నిలబడిన వజ్ర సమాన సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం. వజ్రోత్సవ వేడుకలను పూర్తిచేసుకుని శత వసంతాల వేడుకలు జరుపుకోవడానికి పరుగులు తీస్తున్న సంఘ సేవలో పునరంకితం అవుదాం. ఎస్టీయు సభ్యులుగా గర్విద్దాం.

***(జూన్ 9 ఎస్టీయు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా)***

**సుధాకర్.ఏ.వి**
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా



- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఎబోల' ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్‌నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం అందించే వారి పట్ల 'ఎపిడెమిక్ డిసిజెస్' చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తప్పుడు చిరునామాలు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డెమోక్రెటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి' నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ తదితర అంశాలపైన మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. 'ఎబోలా' ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని, ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వారు వివరించారు.

ఐసిఎంఆర్ సూచన మేరకు మరోసారి వారి నుంచి శాంపిల్స్‌ను సేకరించి పూణేలోని ఎన్‌ఐవికి పంపించామని, రెండోసారి కూడా నెగిటివ్‌గా వస్తే, వారిని ఐసోలేషన్ నుంచి డిశ్చార్జ్ చేస్తామన్నారు. ఆరోగ్య శాఖకు అవసరమైన సహకారం అందించాలని సిసిఎంబి డైరెక్టర్‌ను మంత్రి కోరారు. దీనిపైన ఐసిఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి స్పందిస్తూ 'ఎబోలా' టెస్టింగ్ కిట్లు రావడంతో పరీక్షలు ప్రారంభించామన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తప్పుడు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయాన్ని అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టం చేయాలని సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని ఆదేశించారు. ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడే సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విమానాశ్రయంలోనే అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలన్నారు.

**సమన్వయంతో ట్రేసింగ్ చేయాలి...**

కాంట్రాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్య శాఖ, జిహెచ్‌ఎంసి, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలో ఎబోలా వ్యాధి నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా నిచ్చారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తు, జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ సంతోష్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సంతోష్ చౌహాన్, కేంద్ర ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పావని, జిఎంఆర్ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ సంజయ్ కుమార్, జిహెచ్‌ఎంసి చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.పద్మజ, హైదరాబాద్ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి, రంగారెడ్డి డిఎంహెచ్‌ఓ డాక్టర్ స్వర్ణకుమారి, ఐడిఎస్‌పి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజిరెడ్డి, డిసిపి శిల్పవల్లి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు రాకేశ్ రంజన్, అన్నమేరీ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

కార్మికులను సింగరేణి యాజమాన్యం కట్టుబానిసలుగా చూడటం సరికాదు

ఈ 12 ఏళ్ల పద్దుపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలి

యాజమాన్యానికి నేడు సమ్మె నోటీస్

విలేకరుల సమావేశంలో కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మికుల శ్రమ శక్తితో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ, అదే సంస్థల్లో అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు, యాజమాన్యం కట్టుబానిసలు కూడటం సరైంది కాదని, కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండురోజులుగా వర్కర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు రుద్రంపూర్‌లో ఆర్‌సిఓఏ క్లబ్‌లో జరిగాయి. చివరి రోజు సోమవారం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని బంగారుబాతులా వాడుకుంటున్నాయని, సంస్థ మనుగడకు పాటుపడుతూ ఉత్పత్తిని, ఆదాయాన్ని పెంచే మార్గాలను వదిలిపెట్టి సంస్థలో ఉన్నదాన్నంతా దోచుకుని సంస్థ మూసివేసే దశకు చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక యంత్రాల ద్వారా సంస్థ పనులు చేయించి కార్మికులు లేకుండా చేయలనే ఉద్దేశ్యంతో ఉన్నారని చెప్పారు. ఇక్కడ ఇత్పత్తి అయ్యే బొగ్గులో నాణ్యత లేదనే సాకులు చూపుతున్నారని, నాణ్యత, నాణ్యత తక్కువగా ఉన్న బొగ్గును కలిపి అవసరమైన పరిశ్రమలకు విక్రయించేందుకు దృష్టి సారించాలని చెప్పారు. దీనిని సాకుగా చూపి సింగరేణి మనుగడను దెబ్బతీయాలని చూస్తే ఊరుకోమని చెప్పారు. సంస్థ నష్టాల్లో నడుస్తోందంటూ చెబుతున్నారని, ఎవరి వల్ల నష్టాలు వచ్చాయని, ఎందుకు వస్తున్నాయని, దానికి కారణాలు ఏంటో తేల్చాలన్నారు. ఈ 12 ఏళ్ల స్వరాష్ట్రంలో గత, ఈ ప్రభుత్వంలో వచ్చిన ఆదాయం, లాభాలు, ఖర్చుల పద్దుపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నష్ట నివారణ చర్యలు చేపట్టకుండా చోద్యం చూడటం సరైంది కాదన్నారు. సింగరేణి వ్యాప్తంగా చేపడుతున్న ప్రాజెక్టులకు కార్మిక నేతలు కొమరయ్య, శేషగిరి రావు, విఠల్ రావు పేర్లను పెట్టాలని డిమాండ్ చేశారు. సంస్థలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, సొంతింటికి రుణసదుపాయాన్ని కల్పించాలని, డిపెండ్లకు ఉద్యోగాలు ఇవ్వాలని, డిపార్ట్మెంట్ పోస్టులు భర్తీ చేయాలని, సహజన మరణం పొందిన వారికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, 30 డిమాండ్ల సాధనకు గుర్తింపు సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందిస్తున్నామని, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయకుంటే ఆర్‌టిసి సమ్మెకు మించిన సమ్మెను చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాల రంగయ్య, కెసారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మద్ది ఎల్లయ్య, వైవి రావు, ముస్కే సమ్మయ్య, వంగా వెంకట్, వీరస్వామితో పాటు అన్ని ఏరియాల బ్రాంచ్ కార్యదర్శులు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గురుకులాల్లో పూర్తి పారదర్శకత



- విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అడ్మిషన్ల నుంచి అకాడమిక్ కార్యకలాపాల వరకు పూర్తి పారదర్శకత పాటించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయం నుంచి టిజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, జోనల్ అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి కొత్త విద్యా సంవత్సరానికి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. గురుకులాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని, ఈ విజయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. విద్యార్థుల సంక్షేమం, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల పెంపును అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. ఇటీవల చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనల నేపథ్యంలో ఫుడ్ పాయిజన్‌కు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వడ్డింపు వరకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వంటశాలలు, హాస్టళ్లు, తాగునీటి సదుపాయాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో అకాడమిక్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, పీరియడ్ వారీ బోధన, వారాంత సమీక్షలు, నెలవారీ ప్రగతి నివేదికలు అమలు చేయాలని చెప్పారు. జెఈఈ, నీట్, క్లాట్, సియూఈటి వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అడ్మిషన్ల ప్రక్రియలో పూర్తి స్థాయి పారదర్శకత ఉండాలని, అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్‌ఎసి) కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి.శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీ (అకౌంట్స్) చిన్న సాయిలు, ఓఎస్‌డీ వై.జే.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలకు జ్ఞానసౌధాలు



- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల విద్యా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ నిర్మాణాలు అంబేద్కర్ ఆశయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రతిపాదిత అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ స్థలం, నింబోలీఅడ్డాలో ఆధునికీకరించనున్న బాబు జగ్జీవన్‌రామ్ వసతి గృహ స్థలాలను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి డిప్యూటీ సిఎం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ కేవలం భవనం కాదని, పేద, అణగారిన వర్గాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన కేంద్రమని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్ నిపుణుల బోధనను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నింబోలి అడ్డాలోని విద్యార్థి వసతి గృహాన్ని చారిత్రాత్మక కేంద్రంగా అభివర్ణించిన ఆయన, అక్కడ చదివిన అనేక మంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యా అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందని అన్నారు. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌కు సుమారు రూ.110 కోట్లతో, బాబు జగ్జీవన్‌రామ్ వసతి గృహానికి సుమారు రూ.25 కోట్లతో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు కేవలం భవనాలు కాకుండా సామాజిక న్యాయం, విద్యా సమానత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌ఏలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘీక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్‌అండ్‌బి, ఎస్‌సి కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్మార్ట్ పోలీసింగ్‌కు టెక్నాలజీ కీలకం

డిజిపి సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థను మరింత ఆధునికంగా, సాంకేతికత ఆధారితంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ అధికారులకు సూచించారు. డిజిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశంలో పోలీస్ పరిపాలన, జ్యూరిస్డిక్షన్ పునర్వ్యవస్థీకరణ, సాంకేతికత వినియోగం, మహిళా పోలీసుల సాధికారత వంటి పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కమిషనరేట్ల పరిధులు, పోలీస్ స్టేషన్ల హద్దులు, సరిహద్దు గ్రామాల విభజన, సర్కిళ్లు, జోన్ల పునర్విభజన వంటి అంశాలను అన్ని శాఖలకు అనుకూలంగా ఉండే విధంగా రూపొందించాలని డీజీపీ సూచించారు. అలాగే గృహ సేవకులుగా పనిచేస్తున్న వారి వివరాలను రాష్ట్రవ్యాప్తంగా సేకరించి సమగ్ర డేటాబేస్ రూపొందించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందిన వ్యక్తుల వివరాలను నమోదు చేసి, వారి నివాసం, ఉద్యోగ స్థలాల సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. పోలీసింగ్‌లో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని డిజిపి స్పష్టం చేశారు. సిసిటిఎన్ఎస్ 2.0, టిజి కాప్స్, డయల్100, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, వాహనాల సెర్చింగ్ వంటి సేవలను టెక్నాలజీతో అనుసంధానం చేసి వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), డ్రోన్లు, హెచ్‌ఆర్‌ఎంఎస్, డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. 'తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ – యూజింగ్ టెక్నాలజీ' లక్ష్యంతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేసిన డిజిపి, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల ఆడిట్, సిబ్బంది వినియోగంపై సమర్థవంతమైన విధానాలు అమలు చేయాలని సూచించారు. సమావేశంలో హోంశాఖ కార్యదర్శి శిఖాగోయల్, ఇంటెలిజెన్స్ డిజి విజయ్‌కుమార్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్‌భగవత్‌తో పాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## సివిల్ సప్లయిస్ హమాలీలకు బీమా సౌకర్యం

- ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సివిల్ సప్లయిస్ విభాగంలో పనిచేస్తూ మరణించిన హమాలీల కుటుంబాలకు ప్రమాద నష్టపరిహారం, కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఇన్సూరెన్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీలకు జనవరి నుంచి మే నెల వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది కార్మికులు సోమవారం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా జరిగిన నిరసన కార్యక్రమంలో ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ కార్మికులు చేసిన పనులకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కమిషనర్, డైరెక్టర్, జనరల్ మేనేజర్ తదితర అధికారులతో కార్మిక సంఘాల ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా క్వింటాల్ ఎగుమతి, దిగుమతికి రూ. 38 చెల్లించాలని డిమాండ్ చేయగా కమిషనర్ రూ.33 చెల్లించేందుకు అంగీకరించారని తెలిపారు. బోనస్‌ను రూ. 10 వేలకు పెంచాలని కోరగా, రూ. 8500 చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి, చెన్నూర్ ప్రాంతాల్లో ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గన్నీ బ్యాగుల హమాలీ రేట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. చర్చల్లో ఎఐటియుసి నాయకులు మునీశ్వర్, వై.ఓమయ్య, సిఐటియు నాయకులు పాలడుగు భాస్కర్, వంగూరి రాములు, సుధాకర్, బిఆర్‌టియు నాయకులు శ్రీనివాస్, బాబామియా, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం పాల్గొన్నారు.

## పాఠశాలలు తగ్గిస్తే తిరుగుబాటే

- ఎఐఎస్‌ఎఫ్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను భారీగా తగ్గించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వ విద్యా రంగాన్ని బలహీనపరిచేలా ఉన్నాయని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేస్తామన్న వ్యాఖ్యలు పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య దూరం చేయడమేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రైవేట్ విద్యను ప్రోత్సహించే విధంగా ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెప్పి ఇప్పుడు వాటిని తగ్గిస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్న సిఎం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సింది పోయి నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని, ప్రైవేట్ విద్యను ప్రోత్సహించే విధానాలను అంగీకరించబోమని వారు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూములను కాజేసేవారిపై ఉక్కుపాదం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులే కంచె చేను మేసినట్లుగా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని, అలాంటి వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం అన్నారు. ప్రభుత్వ భూములను అంగుళం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే వాటిని దోచుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు.

**ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలనలో బయటపడ్డ 'భూలీలలు'..** హైదరాబాద్, క్యూర్ పరిధిలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల గుర్తింపు కోసం హౌసింగ్ బోర్డు భూములను పరిశీలిస్తున్న సమయంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ భూ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాము నాయక్, 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్ (ఎల్‌ఏఓ)గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో ఆయన అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో తక్షణమే రామునాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రూ.కోట్ల విలువైన భూమి నామమాత్రంగా, బహిరంగ మార్కెట్‌లో గజం రూ.2 లక్షలకు పైగా విలువ చేసే, హైకోర్టు 56 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు వెలుగుచూసింది. గతంలో హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్స్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగం నుంచి తొలగింపబడిన ఇఫ్తాకర్ అహ్మద్ భార్య సుబియా సుల్తానా పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. కనీసం దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డబ్బులు కూడా నేటి వరకు బోర్డుకు జమ కాలేదు. కాగా, కాలక్రమంలో 2025 ఏప్రిల్‌లో ఈ భూమిని సుబియా సుల్తానా మరొకరికి విక్రయించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం లోతైన విచారణ జరిపిస్తోందని మంత్రి తెలిపారు.

**తీగ లాగితే కదిలిన డొంక: 2016 నుంచి భూదందాలు..** రాము నాయక్ భూ దందాలకు సంబంధించి 2017 నుంచే పలు కేసులు ఉన్నాయని, అప్పట్లో బిఆర్‌ఎస్ పాలకులు, అధికారులు దీనిపై స్పందించలేదని మంత్రి ఆరోపించారు. ఒక కేసు విచారణ చేస్తుంటే తీగ లాగితే డొంక కదిలినట్లు రాము నాయక్ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని తెలిపారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 చదరపు గజాలు, లక్ష్మిగూడలో 130 చదరపు గజాలు, మహబూబ్‌గంజ్‌లో 497 చదరపు గజాల స్థలాలను రామునాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు గుర్తించారు. ఈ భూములకు సంబంధించిన పత్రాలను, బోర్డు అనుమతులను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన నాటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, ఇతర కేసుల్లోని సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపైనా విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజిని మంత్రి ఆదేశించారు. అలాగే ఈ అక్రమ సేల్ డీడ్‌లన్నింటిని రద్దు చేయాలని స్పష్టం చేశారు.

**ఒకరు డిస్మిస్ – ఇద్దరు సస్పెండ్ !..** ప్రభుత్వ అధికారిగా అక్రమాలకు పాల్పడిన రామునాయక్‌ను తక్షణమే సస్పెండ చేశామని, యుద్ధప్రాతిపదికన విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత ఆయనను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తామని మంత్రి ప్రకటించారు. రాము నాయక్ భూ అక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను రిటైర్‌మెంట్ మరో పది సంవత్సరాలు ఉండగానే విధుల నుంచి శాశ్వతంగా తొలగించామని, మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

## పారదర్శకంగా ఎరువుల పంపిణీ

- దేశానికే ఆదర్శంగా తెలంగాణ ఫెర్టిలైజర్ యాప్ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని పొరుగు రాష్ట్రాలు కూడా ప్రత్యేక డిజిటల్ వ్యవస్థలను రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నాయని ఆయన తెలిపారు. ఎరువుల స్టాక్ వివరాలు, పంపిణీ ప్రక్రియను సులభతరం చేసిన తెలంగాణ నమూనా ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారిందన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కూడా ఈ యాప్ పనితీరును పరిశీలించి ప్రశంసించిందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా ఎరువుల పంపిణీ వ్యవస్థను డిజిటల్ చేయడానికి కేంద్రం (ఎఫ్‌ఎస్‌ఎఎస్)ను రెండు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రైతుల సౌలభ్యం కోసం యాప్‌ను మరింతగా మెరుగుపరిచినట్లు మంత్రి తెలిపారు. యాప్ ద్వారా రైతులు తమ ప్రాంతంలోని డీలర్ల వద్ద ఉన్న ఎరువుల స్టాక్‌ను మొబైల్ ఫోన్ ద్వారా ముందుగానే తెలుసుకునే అవకాశం కలిగిందని మంత్రి వివరించారు. దీంతో అనవసరంగా తిరగడం, క్యూలలో నిలబడటం తగ్గిందని చెప్పారు.

**జూన్ చివరి నాటికి 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు చర్యలు**

ఇప్పటికే రాష్ట్రానికి 3.89 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని, జూన్ వరకు అవసరమైన 6 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపును సాధించేందుకు కేంద్రంతో నిరంతరం చర్చలు కొనసాగుతున్నాయని మంత్రి నాగేశ్వర రావు తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి నోడల్ అధికారులను కూడా నియమించినట్లు చెప్పారు.

GHMC
గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.

Short NIT No. 05/EE-II/CIRCLE-39/KHAIRATABAD ZONE/GHMC/2026-27, Dt: 08.06.2026

NIT No. 05/EE-II/Circle-39/KZ/GHMC/2026-27, పని పేరు: సివిల్ పనులు (1-6 వరకు నెం.లు), అంచనా విలువ / ఇసివి: రూ.76.83 లక్షలు, ప్రారంభ తేదీ / డౌన్‌లోడ్ ఆఖరి తేదీ & సమయం: క్ర.సం.01 నుండి 06 వరకు పనుల కొరకు 09.06.2026 మ.12.00గం.ల నుండి 12.06.2026 మ.12.00గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https:www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. ఇ-మెయిల్ అడ్రస్: eec39.ameerpet@gmail.com, మొబైల్ నెం. 9063836121.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II,
ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 3847-PP/CL/ADVT/2026-27, Date: 08-06-2026

# విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత

- ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు :మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం రవాణా శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు రాష్ట్రంలో పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్, డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం,
తెలంగాణ విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ :: హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండర్ నోటీసు నం. SE/TGEWIDC/HYD/NIT/193 నుండి 196/2026-27, తేదీ: 06.06.2026

అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఈ క్రింది పనుల కోసం టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి: 1) మహబూబ్‌నగర్ జిల్లాలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల) నిర్మాణం (మిగిలిపోయిన పని) (అంచనా వ్యయం రూ.1950.00 లక్షలు), 2) మహబూబ్‌నగర్ జిల్లాలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల) నిర్మాణం (మిగిలిపోయిన పని) (అంచనా వ్యయం రూ.1895.00 లక్షలు), 3) మహబూబ్‌నగర్ జిల్లా, మహబూబ్‌నగర్ MCT పరిధిలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో "కామన్ సర్వీస్ సెంటర్" నిర్మాణం (అంచనా వ్యయం రూ.94.34 లక్షలు), 4) వనపర్తి జిల్లా, కొత్తకోట (గ్రామం & మండలం)లోని KGBV (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) వద్ద అదనపు మౌలిక సదుపాయాల కల్పన / బలోపేతం (రూ.42.12 లక్షలు).

| | |
|---|---|
| టెండర్లు స్వీకరించడానికి చివరి తేదీ మరియు సమయం | : 25.06.2026 సాయంత్రం 4.00 గంటల వరకు |
| టెక్నికల్ బిడ్ తెరిచే తేదీ | : 25.06.2026 సాయంత్రం 4.30 గంటలకు |
| ప్రైస్ బిడ్ తెరిచే తేదీ | : 30.06.2026 సాయంత్రం 4.00 గంటలకు |

పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడవచ్చు లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ భవనం, SCERT కాంపౌండ్, E-గేట్ ఎదురుగా, L.B. స్టేడియం, హైదరాబాద్ వారిని స్వయంగా సంప్రదించవచ్చు. ఫోన్ నం. 29565991.

సం/-XX
సూపరింటెండింగ్ ఇంజనీర్,
TGEWIDC, హైదరాబాద్.

DIPR R.O. No. : 3874-PP/CL/ADVT/2026-27, Date: 08-06-2026

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

### డిఎస్‌పి వాహిద్దీన్



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట :** పెంచికల్‌పేట మండలంలోని చెడ్వాయి, పోతేపల్లి గ్రామాల్లో సోమవారం ప్రజాపాలన ముగింపు గ్రామ సభలు నిర్వహించారు. చెడ్వాయిలో జరిగిన సభకు డిఎస్‌పి వాహిద్దీన్ హాజరై మాట్లాడుతూ మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద పోస్టులు పెడితే చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. గ్రామాల్లో గంజాయి సాగు, నకిలీ విత్తనాల విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోతేపల్లి గ్రామసభలో రైతులు వరి కొయ్యలు కాల్చరాదని వ్యవసాయ అధికారులు, అడవుల్లో ఉచ్చులు వేయ డం, చెట్లు నరకడం చట్టవిరుద్ధమని అటవీ అధికారులు హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన పూరి గుడిసెల వివరాలు సేకరించినట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. కాగా గత మూడు వారాలుగా మి షన్ భగీరథ నీరు రావడం లేదని, సభకు ఎఇ హాజరుకాకపోవడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిఐ కుమారస్వామి, ఎస్సై అనిల్‌కుమార్, సర్పంచ్‌లు చౌదరి శ్రీనివాస్, దుర్గం పోషన్న, ఉపసర్పంచ్‌లు నానాజీ, చిన్నయ్య, వార్డు సభ్యులు మహేష్, వెంకటాచలం, పంచాయతీ కార్యదర్శి రాకేష్, ఆర్ఐ రాజేశ్వర్, ఏఈఓ వెంకటేష్, ఫారెస్ట్ అధికారి అరవింద్, హౌసింగ్ ఈఈ అక్షిత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా జిల్లాలో ఎంపిక చేసిన 74 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి గాను తాత్కాలిక పద్ధతిలో నియమించే ఒక ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు నెల 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు ఏడో తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో కలిపి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అందజేయాలని సూచించారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 ఏళ్ల మధ్య ఉండాలని, నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ పర్సన్స్‌కు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల వయోసడలింపు ఉంటుందన్నారు. ఎంపిక ప్రక్రియ స్థానికత, మెరిట్ ఆధారంగా పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## యూరియా పంపిణీపై ఫోన్ యాప్‌ను తొలగించాలి

### ఎఐయుకెఎస్ డిమాండ్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వరి ఇతర వ్యవసాయ పంటలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన లోపభూయిష్టమైన కనీస మద్ధతు ధరను వెంటనే సవరించాలని, యూరియా సప్లయిపై ఫోన్ యాప్‌ను తొలగించాలని జిల్లా కన్వీనర్ ఎం.నారాయణ అన్నారు. ఎఐయుకెఎస్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో వరి, ఇతర వ్యవసాయ పంటలకు లోపభూయిష్టంగా నిర్ణయించిన కనీస మద్దతు ధరలను వెంటనే సవరించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ధరల నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. రైతు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఐయుకెఎస్ నాయకులు శంకర్, గంగాధర్, ఒడ్డెన్న, సాయిలు, సీతారాం, మల్లయ్య, దేవన్న పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### హోం సైన్స్ శాస్త్రవేత్త డా. గెడ్డం ప్రియ సుగంధి



**ప్రజాపక్షం / మందమర్రి :** గ్రామీణ కుటుంబాల్లో పోషకాహార లోపాలను నివారించడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో మందమర్రి మండల సారంగపల్లి గ్రామపంచాయితీ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం సైన్స్ శాస్త్రవేత్త డా. గెడ్డం ప్రియ సుగంధి మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరి ఆరోగ్య పరిరక్షణకు రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి పరిసరాల్లో పోషకాహార తోటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తాజా కూరగాయలు, ఆకుకూరలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చని ఆమె వివరించారు. పంటల కోత అనంతరం కలిగే నష్టాలను తగ్గించడంలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అత్యంత అవసరమని పేర్కొంటూ, పోషకాహారం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, సర్పంచ్ రాములు, పంచాయతీ కార్యదర్శి సవ్య, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

**ప్రజాపక్షం / భైంసా :** భైంసా మండలం బడ్గాం గ్రామం అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించిన బోస్లే విశబూల్ తండ్రి బోస్లే చంద్రకాంత్‌ను సన్మానించి అభినందనలు తెలపిన ముథోల్ నియోజకవర్గ యువ నాయకులు బాజీరావు, ఈ సందర్భంగా యువనేత బాజీరావు అన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ అగ్నివీర్‌లో అనేక మంది యువకులు ఉద్యోగం సంపాదించి ముందుకు వెళ్తున్నారని ఇట్టి అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ వసంతరావు పటేల్, యోగేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# లాభాల వేటలో 'మొరం' మాఫియా..





**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** అధికారుల నిర్లక్ష్యం, మైనింగ్ మాఫియా కాసుల కక్కుర్తి కలిసి ముగ్గురు ప్రాణాలను నిలువునా మింగేసాయి. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రి గుట్ట సమీపంలో జరిగిన విషాదం అందరిని కలిచివేసింది. ఇది కేవలం ప్రమాదం కాదు. అది ముమ్మాటికీ వ్యవస్థ చేసిన హత్యేనని స్థానికులు మండిపడుతున్నారు. ఒడ్డెర కాలనీకి చెందిన హరీష్ (10), వర్షిణి (5), అరవింద్ (4) అనేముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి బ్రామ్మణ కుంటలో జలసమాధైన ఘటన వెనుక అసలు నిందితులు ఎవరనే దానిపై ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. సాధారణంగా పల్లెల్లో ఉండే కుంటలు, చెరువులు చిన్నారులకు ఆట స్థలాలు కానీ భీమ్‌గల్ మండలంలో పరిస్థితి వేరు. ఇక్కడి కుంటలు సహజసిద్ధమైన లోతును కోల్పోయి, మొరం, మట్టి మాఫియా జరిపిన ఇష్టారాజ్యమైన తవ్వకాలతో మృత్యుకూపాలుగా మారాయి. కుంటల్లో లేదా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరపాలంటే నిర్ధేశిత లోతు మాత్రమే తవ్వాలనే నిబంధనలున్నాయి. కానీ, ఇక్కడ జెసిబిలతో ఇష్టమొచ్చినట్లు 2030 అడుగుల లోతు వరకు మొరం మట్టిని తోడేశారు. తవ్వకాలు జరిపి వదిలేసిన గుంతల చుట్టూ ఎలాంటి రక్షణ (ఫెన్సింగ్ ) చర్యలు ఏర్పాటు చేయలేదు. కనీసం అక్కడ ప్రమాదకరమైన లోతు ఉందని తెలిపే హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ లోతైన గుంతల్లో నీరు చేరి పైకి మామూలు కుంటలా కనిపించింది. లోతు అంచనా వేయలేక దిగిన చిన్నారులు ఆ గుంతల్లో చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. మాఫియాకు కొండంత బలం. విచ్చలవిడిగా, అక్రమంగా పగలు, రాత్రి తేడా లేకుండా వందలాది ట్రాక్టర్ల మొరం తరలిపోతుంటే సంబంధిత రెవెన్యూ, పోలీస్ మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వెనుక ఉన్న మతలబు ఏంటనేది బహిరంగ రహస్యం. మా పిల్లల మృతికి ఆ మొరం తవ్వకాలే కారణం. అక్రమార్కులు గుంతలు తవ్వి వదిలేయబట్టే మా కడుపుకోత మిగిలింది. రోజువారిగా ఇక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. వాళ్లూ వీళ్లూ అంతా ఒక్కటే అంటూ బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినా, ఉన్నతాధికారులు కేవలం నామమాత్రపు జరిమానాలతో సరి పెట్టారే తప్ప శాశ్వత చర్యలు తీసుకోలేదు. ఈ 'మాముళ్ల' సంస్కృతే ఈ రోజు ముగ్గురు చిన్నారుల ప్రాణాలను బలిగొందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా మేల్కొనకపోతే మరిన్ని ప్రాణాలు బలవుతాయంటూ మండిపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా తవ్వకాలు జరిపిన వారిపై ఇందుకు సహకరించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మైనింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి వాటి చుట్టూ రక్షణ కంచెలు వేయాలి లేదా వాటిని పూడ్చివేయాలి. రెవెన్యూ పోలీస్, మైనింగ్ శాఖల సమన్వయంతో అక్రమ రవాణాపై 24 గంటలు ప్రత్యేక నిఘా పెట్టాలి. మరణించిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే భారీ నష్టపరిహారమందించి వారికి పూర్తి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపకపోతే రేపు మరో కుంటలో, మరో గుంతలో ఇంకెన్నో అమాయక ప్రాణాలు బలికాక తప్పదు. చట్టాన్ని చుట్టంలా మార్చుకున్న అక్రమార్కులకు బుద్ధి చెప్పినప్పుడే ఆ చిన్నారుల ఆత్మలకు శాంతి చేకూరుతుంది.

## రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేరడిగొండః** మండలంలోని బుద్ధికొండ నుండి తేజాపూర్ గ్రామం వరకు రూ.రెండు కోట్లతో నిర్మించ తలపెట్టిన బిటి రోడ్డు సిడి వర్క్స్ పనులకు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవుని కనీస అవసరాలు తీర్చడానికి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు కనెక్టివిటి కీలకమని, బుద్ధి కొండతేజాపూర్ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజలకు, రైతులకు, విద్యార్థుల రాకపోకలకు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయి అభివృద్ధిలో గ్రామాలు ముందువరుసలో ఉంటాయి అని అన్నారు. అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్‌లు వసుంధర నవీన్, మహేందర్ రెడ్డి, శోభన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వడూర్ సర్పంచ్ శ్రీకాంత్, సాబ్లే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## భీమ్‌గల్‌లో జరిగిన ఘటన బాధాకరం

### ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని లింబాద్రి గుట్ట వద్ద నివాసముంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు చిన్నారులు శుక్రవారం ఆడుకోవడానికి వెళ్లి వారిగుడిసెల వెనక ఉన్న కుంటలో పడి మృతి చెందటం తీవ్ర విషాదకరమని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చిన్నారులను కోల్పోయిన తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతమని పేర్కొంటూ ఓదార్చారు. ప్రమాదానికి కారణమైన నీటి కుంటను పరిశీలించిన ఎమ్మెల్యే ఇలాంటి విషాద ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సంబంధిత కుంట చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయటం లేదా అవసరమైతే కుంటను పూడ్చివేయటం వంటి చర్యలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వెంటనే ఘటనా స్థలాన్ని సందర్శించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాలకు ఖర్చుల నిమిత్తం 18 వేల ఆర్థిక సాయం అందజేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో స్వీకరించి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు ,కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 70 ఫిర్యాదుల అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో కలెక్టరేట్‌లో 27, సంగారెడ్డి డివిజన్‌లో 17, అందోల్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్ డివిజన్‌లో 11,జహీరాబాద్ డివిజన్‌లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ,జిల్లా స్థాయి అధికారులు ,రెవెన్యూ అధికారులు ,మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్ :** గ్రామ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు గ్రామ సభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. సోమవారం చేగుంట మండల కేంద్రంలోని గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో జిల్లా అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 4,6,8,10, తేదీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామ సభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలపై అవగహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధితో మెరుగైన వైద్య సేవలు

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిల అభివృద్ధితో మరింత మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిల్లి కొటాల్ ఏరియాలో ఉన్న ఎంసిహెచ్ కేంద్రంజిజిహెచ్‌ఎస్ సూపరిండెంట్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ షర్మిల, జిజిహెచ్‌ఎస్ ఆర్ఎంఓ రేవతి, డిసి హెచ్‌ఎస్ శివదయాల్, ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, హెచ్‌ఓడి జనరల్ మెడిసిన్ డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ రాజేశ్వరి, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ పావని, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బోస్, రాజశేఖర్, బోని లతో కలిసి ఆసుపత్రుల అభివృద్ధి సంఘం సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి పనులకు గాను అవసరమైన బడ్జెట్ కేటాయింపు కొరకు ప్రతిపాదించడం జరిగిందని, ఇందులో భాగంగా ఆసుపత్రి నాముునా, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల కోసం చర్చించామన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా వ్యవహరించాలని, ఆ దిశగా నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఆసుపత్రులో ప్రజా ప్రయోజనకరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మంచి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని కలెక్టర్ సందర్శించి, వైద్యాధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగులూ మా కుటుంబ సభ్యులే

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం / రాంచంద్రాపురం :** పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులు తన కుటుంబ సభ్యుల లాంటి వారిని వారి సంక్షేమానికి ఎల్లప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిదిలోని మయూరి నగర్ కాలనీలో గల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు సంఘం రామచంద్రాపురం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు హాజరయ్యారు. ఇటీవల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాశీ , అయోధ్య, ఢిల్లీ , బెంగళూరు. మైసూరు ,ఊటీ తదితర విహార యాత్రలకు సంపూర్ణ ఆర్థిక సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ దంతులకు ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా విశ్రాంతి ఉద్యోగుల సంఘానికి తనకు ఆత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు అందిస్తూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. వారి సంక్షేమం కోసం సహకారం అందించడంతో పాటు సమావేశాలు నిర్వహించేందుకు భవన నిర్మాణానికి సైతం సంపూర్ణ సహకారం అందించామని గుర్తు చేశారు. తాను పదవిలో ఉన్నా, లేకున్నా పెన్షర్లకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు , నాగభూషణం సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

### అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగం రవి



**ప్రజాపక్షం / మంచిర్యాల :** రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగం రవి డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉన్నత విద్యను పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదని మండిపడ్డారు. దీనివల్ల నిరుద్యోగులు నిరాశకు గురవడమే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. శాఖల వారీగా ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, కాంట్రాక్టు విధానాలకు స్వస్తి పలికి శాశ్వత నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి మహేష్, దేవి పోచన్న పాల్గొన్నారు.

## రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు

### అందుబాటులో 27,023 మెట్రిక్ టన్నుల యూరియా

### రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాల కంటే నిజామాబాద్ జిల్లాలోనే అత్యధిక స్థాయిలో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకమైన పంపిణీ కోసం యూరియా బుకింగ్ యాప్ దోహదపడుతుందన్నారు. ఈ యాప్ పనితీరును గమనించిన ఇతర రాష్ట్రాలు కూడా ఒక్క యూరియానే అందిస్తున్నాయని తెలిపారు. ఈ యాప్‌తో ఆయా మండలాల్లో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉందనే సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉందని, రైతులు సమీప డీలర్ల వద్ద పంట సాగు విస్తీర్ణానికనుగుణంగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. యూరియా ఎరువులతో ముడిపెడుతూ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతులను బలవంతం చేస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## పక్కాఇండ్ల స్థలాలను శాశ్వతం చేయాలి

### కలెక్టర్‌కు లెఫ్ట్ పోచంపాడ్ గ్రామస్తుల వినతి

**ప్రజాపక్షం / నిర్మల్ :** సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామానికి చెందిన దాదాపు 80 కుటుంబాలకు పక్కా ఇండ్లు నివాస థలాల హక్కులు కల్పించాలని కోరుతూ సర్పంచ్ ఆమని ఆధ్వర్యంలో గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తూ, తాము గత 60 సంవత్సరాలుగా లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోనే నివాసం ఉంటున్నామని ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఇంతకాలంగా తాము ఇక్కడే బతుకు తెరువు సాగిస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు తమకు ఏలాంటి పక్కా ఇండ్ల సౌకర్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము నివసిస్తున్న ప్రాంతం ప్రభుత్వ క్వార్టర్ల స్థలమని, కావున మానవీయ కోణంలో స్పందించి ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉన్న స్థలాన్ని వారికే శాశ్వతంగా కేటాయిస్తూ పట్టాల పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఒకవేళ సాంకేతిక కారణాల వల్ల అది వీలుకాని పక్షంలో, తమకు వేరే ఎక్కడనా ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కొత్త ఇండ్లను ముంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆమని, లెఫ్ట్ పోచంపాడ్ గ్రామ ప్రజలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి: ఏఐవైఎఫ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగేందర్ మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతుండగా, మరో వైపు నిరుద్యోగ యువత వయోపరిమితి దాటిపోతూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఖాళీలపై పూర్తి వివరాలు వెల్లడించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా యువతకు ఉద్యోగ భద్రతను దూరం చేస్తున్నారన్నారు. ఇది నిరుద్యోగ యువత పట్ల అన్యాయం మాత్రమే కాకుండా ప్రజా సేవల నాణ్యతను కూడా దెబ్బతీస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం, మౌలిక వసతుల కొరత, నిధుల లోపం కారణంగా ప్రభుత్వ విద్య బలహీనపడుతోందన్నారు . ఇదే సమయంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని శాఖల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని యుగేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు చెంచల మురళి, పినమల్ల భాస్కర్, మాడిశెట్టి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట పోలీసు ఉద్యోగ మిత్ర యువతకు ఉపాధి పోర్టల్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట పోలీసు ఉద్యోగ మిత్ర యువత ఉపాధి పోర్టల్ ద్వారా సిద్దిపేట యువతకు సాధికారితవైపు నడిపించటమే పోలీసులు ముఖ్య ఉద్దేశమని పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆప్లెవిజ్ సంస్థ భాగస్వామ్యంతో ఏడాది పొడవునా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. గత ఏప్రిల్ 25న సిద్దిపేటలో నిర్వహించిన పోలీసు ఉద్యోగ మిత్రకు మంచి స్పందన లభించినట్లు తెలిపారు. ఉద్యోగాలు కోరుకునేవారికి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకు మధ్య పోర్టల్ అద్భుతమైన వారధిగా పనిచేస్తుందన్నారు.అర్హతలబట్టి నైపుణ్యం కలిగిన యువత, నైపుణ్యం లేని అభ్యర్థులకు తగిన విధంగా ఉపాధి కల్పించటమే ప్రాథమిక లక్ష్యంగా ఈ వెబ్ ఫోర్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సిద్దిపేట యువత జీవితం ఎదగటానికి మెరుగైన జీవితాన్ని గడపటానికి ఈ పోర్టల్ మంచి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఈ వెబ్‌సైట్‌ను సిద్దిపేట నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజావాణి సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి అని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఫిర్యాదిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణి సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రజావాణిపై ప్రజలు ఏంతో నమ్మకంతో ఉన్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. జిల్లా నలుమూలల నుండి పలువురు ఆర్జీదారులు ప్రజావాణిలో 188 ఆర్జీలు సమర్పించారు. ఆర్జీదారులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసి మరోసారి ఆర్జీ పెట్టకుండ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, ఎస్టీపి వరలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దారి కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** పోలాలకు వెల్లే బాటను కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ హైమావతికి ప్రజావాణిలో రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిగుల్ గ్రామంలోని 60 కుటుంబాలకు చెందిన 600 ఎకరాల వ్యవసాయ పోలాకు వెళ్లే బండ్లబాటను గ్రామానికి చెందిన ఎడ్ల జనార్థన్‌రెడ్డి అనే వ్యక్తి బాట దున్నడంతో పాటు అడ్డుకున్న 18 మంది రైతులపై పోలీసు కేసులు నమోదు చేయించినట్లు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల నుండి తమ పోలాలకు పోయిన బాటను ఆక్రమించి అడ్డుకున్న గ్రామస్థులపై కేసులు వేసిన ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇటీవల జరిగిన గ్రామ సభలో బండ్లబాటను ఉఫాదిహామీ పథకం ద్వారా రొడ్డు నిర్మించుకునేందుకు తీర్మానం చేసి రోడ్డు వేసినట్లు రైతులు తెలిపారు.

# రైతుల గురించి మాట్లాడే అర్హత హరీష్ రావుకు లేదు

రైతన్నలకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే
ఇచ్చిన హామీలకు మేము కట్టుబడి ఉన్నాం
ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రైతుల గురించి మాట్లాడే అర్హత హరీష్ రావు లేదని, కెసిఆర్ కుటుంబం అబద్ధాలు ఆడడంలో తమకు తమే సాటి అని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం రోజున నందన గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న హరీష్ రావు మాట్లాడే మాటలన్నీ అబద్ధాలే అని నిన్న ఆదివారం రోజున పెద్దపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మాటలను ప్రభుత్వ విప్ విజయరమణ రావు తీవ్రంగా ఖండించారు. అబద్ధాలను పదే పది చెప్పి నిజం చేసే దిశగా హరీష్ రావు వ్యవహరిస్తున్నారని వారి కల్లబొల్లి మాటలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు ఫ్రెస్టేషన్ ఫీల్ అవుతున్నారని గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయకుండా రైతన్నలను బ్యాంకులో డిఫాల్టర్లుగా మిగిల్చారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నలకు వరంగల్ డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి రైతన్నలకు అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. గతంలో రైతులకు వరి వేస్తే ఉరే అన్న బిఆర్ఎస్ పార్టీ వారు రైతు సంక్షేమం గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ యాసంగి సీజన్లో కేంద్ర ప్రభుత్వం 51 లక్షల టన్నుల కొనుగోలుకు అనుమతులు ఇస్తే మా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 70 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యాన్ని కొనుగోలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ సీజన్లో రాష్ట్రంలో మొక్కజొన్న పంట అధికంగా పండినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వక పోయినా తమ ప్రభుత్వం సుమారు 3500 కోట్ల బడ్జెట్ కేటాయించి మక్కలను కొనుగోలు చేశామని ఆ డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామని ఇవన్నీ హరీష్ రావు గారికి కనబడటం లేదా అని విమర్శించారు. సిద్దిపేట ఎమ్మె ల్యే హరీష్ రావు గారు ఇక నైనా అబద్ధాల మాటలు మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ లాగ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు పండించిన పంటలో గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తున్నామని అలాగే కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు రోజుల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. హరీష్ రావు ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉందని అంటుంటే విడ్డూరంగా ఉందని అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క మంత్రి కూడా కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని గత కొన్ని రోజుల క్రితమే పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దకలవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మేమందరం కలిసి సందర్శించడం జరిగిందని కొనుగోళ్ల గురించి సమీక్షా సమావేశం కూడా నిర్వహించడం జరిగిందని ఇవన్నీ బిఆర్ఎస్ నాయకుల కళ్ళకు కనబడడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మూత్రం వస్తే పోవడానికి బాత్రూమ్స్ లేవని,విద్యార్థులు చెట్ల పక్కకో, గోడ పక్కకో పోయే పరిస్థితి ఉందని,కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని,కాబట్టి తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన అన్నారు. అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని,ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని,నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని ,విద్యాధికారులను డిమాండ్ చేశారు. విద్యాధికారులు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తే కార్యాలయాలు ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## ఖాళీ సిలిండర్లు, కట్టెల పొయ్యితో కాంగ్రెస్ నిరసన



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రధాని నరేంద్ర మోడీ విశ్వగురువునని, వికసిత భారత్ అని ప్రచారం చేసుకుంటూనే ప్రజలపై ధరల భారాన్ని మోపుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ నేతృత్వ బీజేపీ ప్రభుత్వం పెంచిన ఎల్‌పీజీ గ్యాస్ ధరలకు నిరసనగా సోమవారం కరీంనగర్‌లోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన, వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఖాళీ సిలిండర్లతో, బీజేపీ వ్యతిరేక నినాదాల ప్లకార్డులతో రోడ్డుపై కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ కాంగ్రెస్ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడారు. గత నెల రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలపై కక్షకట్టినట్లుగా ధరలను పెంచుతున్నారని, పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు, ఎల్పిజి గ్యాస్ ధర ఒకేసారి 29 రూపాయలు పెంచి పేద ప్రజలపై భారం మోపుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ మొదటి నుండి చెబుతున్నట్లుగా ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత నరేంద్ర మోడీ దేశ ప్రజలపై ధరల భారం మోపబోతున్నారని దేశ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ మోసపూరిత కేంద్ర ప్రభుత్వంపై మనమందరం పోరాడటానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించినట్లుగానే ఎన్నికలు మోయగానే ఇప్పుడు ఇంధన ధరలు పెంచి వాటి ప్రభావం నిత్యవసరాలు పై పడటంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ధరలను తగ్గించేంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందని, మోడీ సర్కార్ కు బుద్ధి వచ్చే విధంగా మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, మల్లికార్జున రాజేందర్, పులి ఆంజనేయులు గౌడ్, కోమటిరెడ్డి భాస్కర్ నాయక్, బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ కార్యకర్త సభ్యులు పాల్గొన్నారు.

### గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు

## నిరసనగా రేపు ఆందోళన

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాలు మోపడాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన (రేపు) భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని వవిజయవంతం చేయాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం వల్ల ప్రజల జీవనప్రమాణలపై తీవ్ర ప్రభావం పడుతుందని, పేదల ఆర్థిక స్థితి గతులు చిన్నా భిన్నం అవుతున్నాయని,సిలిండర్ల పై వంటచేసుకునే పరిస్థితి లేకుండా పోతుందని, చిన్న చిన్న ఉద్యోగాలు, ప్రైవేట్ రంగాల్లో తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకునే వారు కనీసం వారి వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోయించుకోవడానికే భయపడుతున్నారని అన్నారు. దేశంలో గ్యాస్ పెట్రోలు డీజిల్ కు ఎలాంటి కొరత ఏర్పడదని ప్రగల్భాలు పలికిన బిజెపి పాలకులు ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే విడతల వారీగా ధరలు పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని అన్నారు. పెంచిన ధరలను నిరసిస్తూ రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారాపు వెంకటేష్ ,మచ్చ రమేష్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యా వ్యాపారం చేస్తూ అక్షరాలతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని, బీటెక్ ఫీజుల కంటే ఎల్ కే జి ఫీజులే ఎక్కువగా ఉన్నాయని, అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల 20 వేల వరకు వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, వరల్డ్ అని హోర్డింగ్స్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారాపు వెంకటేష్, మచ్చ రమేష్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటికే అనేక పాఠశాలలో పాఠశాలల ఆవరణలోనే వచ్చే విద్యాసంవత్సరం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ, మౌలిక వసతుల కల్పన లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు వత్తాసు పలుకుతూ వారికి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని అనుమతి లేని పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ముట్టడిస్తామని వెంకటేష్,మచ్చ రమేష్ హెచ్చరించారు.

## ప్రైవేట్ పాఠశాలల దోపిడీ అరికట్టాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈ నెల 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. విద్యా హక్కు చట్టంను అనేక ప్రైవేట్ పాఠశాలలు ఉల్లంఘిస్తూ, విద్యాసంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చి, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అలాగే, సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం బడుగు బలహీన పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రతి ఒక్క ప్రైవేట్ స్కూల్లో 25 శాతం ఉచిత నిర్బంధ విద్య అందజేయాలని చట్టంలో ఉన్నజిల్లాలో ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులకు అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టి, విద్యార్థుల హక్కులను కాపాడాలని, విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మలుచుకొని వ్యవహరిస్తున్నారన్నారు. కనీస వసతులు కల్పించకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెల అధిత్య, బండారి చందు, నాయకులు ఏనుగుల అరవింద్, సురేందర్, విష్ణు, అఖిల్, మహేష్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపు లీకేజీకి మరమ్మతులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గోదూరు వెళ్లే రహదారి వెంబడి డి25 కెనాల్ సమీపంలో మిషన్ భగీరథ పైపు లీకేజీపై ప్రజాపక్షం దినపత్రికలో గత నెల 18న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం పగిలిన ప్రధాన పైపును మరమ్మత్తులు చేసి నీటి వృథాను అరికట్టారు. లీకేజీ కారణంగా ఏర్పడిన గోతిని కూడా పూర్తిగా పూడ్చారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న ప్రజాపక్షం కథనానికి స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## తడిసిన ధాన్యం వెంటనే తరలించాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/వేములవాడ:** కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? ఎంత తరలించారో ఆరా తీశారు. ఈ సందర్భంగా వర్షానికి ధాన్యం తడువగా, జిల్లా కలెక్టర్ తేమ యంత్రంతో ధాన్యం తేమ శాతం పరిశీలించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ తో వెంటనే మాట్లాడి.. లారీలు సమకూర్చాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. కొనుగోళ్లలో వేగం పెంచాలని, వెంట వెంటనే ధాన్యం తరలించాలని సూచించారు. కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు పంపాలని ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం నిలువలకు అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహా, తహసీల్దార్ అబూబాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రానీయొద్దు

కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఎలాంటి ఆటంకాలు లేకుండా అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డిస్ట్రిక్ట్ లెవల్ సాండ్ కమిటీ) సమావేశంలో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ గృహాల నిర్మాణంతో పాటు జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు కూడా ఇసుక కొరత తలెత్తకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక సరఫరా ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మైనింగ్ శాఖ సమగ్ర ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించి సమర్పించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కాలువల్లో పూడిక తొలగింపు (డీసిల్టేషన్) పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఇసుక నిర్వహణ, సరఫరా, పూడిక తొలగింపు తదితర ఐదు కీలక అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసాచారి, సీపీఓ రాందత్తారెడ్డి, వెంకటరెడ్డి, డీపీఓ జగదీశ్వర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



## న్యాయం చేయండి సారూ...

### ఎమ్మెల్యేని వేడుకున్న ఎస్ఆర్టీ బాధితులు

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** న్యాయం చేయండి సారూ ... అంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావును ఎస్ఆర్టీ బాధితులు వేడుకున్నారు. ఎఐటియుసి కేంద్ర కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం ఆర్‌సిఒఎ క్లబ్‌కు విచ్చేసిన ఎమ్మెల్యేను ఎస్ఆర్టీ బాధితులు కలిశారు. రుద్రంపూర్ సిపిఐ సెక్రెటరీ, ఉప సర్పంచ్ తోటరాజు, సలిగంటి శ్రీనివాస్ మరియు గనిగళ్ళ వీరస్వామిల ఆధ్వర్యంలో ఎస్ఆర్టీ ఏరియా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గూడెల్లి యాకయ్య ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ గోడు వినిపించారు. మా ఇండ్లను కూల్చివేసి రెండున్నరేళ్లు అయిందని నేటికీ ఇందిరమ్మ ఇళ్లు కానీ, సింగరేణి వారి నుండి సిఎస్ఆర్ ఫండ్ గాని ఎలాంటి సహాయం ఇప్పటి వరకు తమకు అందలేదని తెలిపారు. వారి గోడు విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ మీరందరికీ కూడా మొదటి విడతలోని ఇందిరమ్మ ఇండ్లు రావాలి కానీ కొంత ఆలస్యమైందని తెలియజేశారు. వెంటనే సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎంకి ఫోన్ చేసి మాట్లాడుతూ బాధితులలో ఎవరికైతే ఇందిరమ్మ ఇండ్లు రాలేదో వారికి కనీసం సిఎస్ఆర్ ఫండ్ కిందనైనా సహాయం అందజేయాలని కోరారు. అంతేకాకుండా ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడుతానని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్ఆర్‌టి ఏరియా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గూడెల్లి యాకయ్య, బుడిబుడి రవి, ధరావత్ నాగమణి, వార్డు మెంబర్ పూదరి గట్టు, గుంజపడిగా, రాంచందర్, జోసఫ్, హరీష్, కరుణ, కంచరల దుర్గాప్రసాద్, బొజ్జం సంపత్, సమ్మక్క, సుశీల, గడీల చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఘన వ్యర్థాల నిర్వహణపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సోమవారం 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఎస్‌డబ్ల్యుఎం రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బి.రవీందర్, అసిస్టెంట్ కమిషనర్ జె.అనిల్‌కుమార్ పాల్గొని ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుఎం రూల్స్ ప్రకారం చెత్తను నాలుగు విభాగాలుగా వేరుచేసి, సేకరించి ప్రాసెసింగ్‌కు పంపాలని సూచించారు. బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి వారి వద్దే వ్యర్థాల ప్రాసెసింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓపెన్ డంపింగ్, ఓపెన్ లిటరింగ్, వ్యర్థాల దహనం, వ్యర్థాల కలుషితం వంటి చర్యలను పూర్తిగా నివారించాలన్నారు. సెగ్రిగేటెడ్ వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌డబ్ల్యుఎం రూల్స్, నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి, సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల వినతులను పరిష్కరించాలి

### కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అధికార్లపై ఉన్న నమ్మకంతో ఇక్కడి దాకా వచ్చి వినతి పత్రాలు సమర్పించే ప్రజల వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో ప్రజావాణికి హాజరైన ఆయన జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన ప్రజల విన్నపాలు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి సంబంధిత శాఖలకు బట్వాడా చేశారు. త్వరితగతిన పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

**నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి :** ఈనెల 21న జిల్లాలో నిర్వహించనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 1128 మంది అభ్యర్థులు నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారని, మ.2 గం. నుండి సా.5.15 గం.ల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## ఎస్ఐఆర్‌ను పరిశీలించిన కమిషనర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ వెరిఫికేషన్‌ను ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలు, ఎఇఆర్‌వో, సూపర్‌వైజర్లతో కమిషనర్ మాట్లాడారు. పనుల పురోగతి, వివరాల ఖచ్చితత్వం, నమోదు ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. లిస్టులో ఉన్న వివరాలను పరిశీలించి మ్యాపింగ్ లోపాలు, నివాస వివరాలు, కుటుంబ వివరాలు, ఇతర వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో ఎలా పరిశీలిస్తున్నారో అనేది పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించడం, మ్యాపింగ్ లోపాలను గుర్తించడం, నమోదు చేసిన సమాచారాన్ని ధృవీకరించడం ద్వారా మాత్రమే ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన సుడా చైర్మన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్యను కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం నగర అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశంపై పరస్పరం చర్చించారు. నగర అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు

### నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లుల విడుదల

### రాజుపేట, గట్టు సింగారంలో గృహ ప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/కూసుమంచి :** రాష్ట్రంలోని ప్రతి అర్హులైన పేద కుటుంబాలనికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కేవలం ఇళ్ల మంజూరుతో బాధ్యత ముగిసిపోదని, నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తున్నామని చెప్పారు. రాజుపేట గ్రామంలో వనాపురం సుబ్రత, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్యల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రాజుపేట గ్రామంలో మంజూరైన ఇళ్లలో నాలుగు పూర్తి కాగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు నిర్వహించినట్లు తెలిపారు.

ప్రతి పేద కుటుంబానికి గౌరవ ప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ లక్ష్యంతోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మరో రెండు వేల మంది అర్హులైన లబ్దిదారులకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన చివరి లబ్దిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశల వారీగా ఈకార్యక్రమాన్ని కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. నూతన గృహాల్లో ప్రవేశించిన కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో, ఆత్మ గౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్టీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

**కూసుమంచిలో రూ.35లక్షలతో నిర్మించిన ఇఆర్ఓ కార్యాలయం ప్రారంభించిన మంత్రి**

ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయ(ఈఆర్‌వో)భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ వినయోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. నూతన ఇఆర్ఓ కార్యాలయం ద్వారా విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని, బిల్డింగ్, ఫిర్యాదుల పరిష్కారం, కనెక్షన్లకు సంబంధించిన సేవలు మరింత వేగంగా అందుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, జిల్లా అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# భావితరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పేదలకు ప్రాధాన్యత

### వివిపాలెంలో పర్యటించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి రూ.97లక్షలు సుడా నిధులతో జగ్యాతండాలో చేపట్టనున్న సిసి రోడ్డు, డ్రైన్ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షలతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వివిపాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్‌టిఆర్‌తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చి భోజనం చేశానని గుర్తుచేశారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వ కాలంలో ఈ గ్రామంలో ఎత్తిపోతల పనులు చేపట్టమని అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ ఈ గ్రామాభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్ నిర్మాణంతో ఈ గ్రామంలోని భూముల విలువ కోట్లల్లో పెరిగిందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. వివిపాలెం గ్రామాన్ని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలపాలన్నారు. మండల పశువైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డివోను ఆదేశించారు. అర్హులైన పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. చేసే అభివృద్ధి పదికాలాల పాటు మన్నేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మండల ఉప కేంద్రం స్థాయిలో వివిపాలెంలో పశు వైద్యశాల నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యత తెలియజేస్తుందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు అధ్యక్షతన జరిగిన సభలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, సర్పంచ్ కాపా ఆదినారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ బి. పురందర్, వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, ఎంపిడిఓ అశోక్‌కుమార్, ఎంపిఓ శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, జెవివో టి.కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### 47వ, డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పాల్వంచ 47వ, డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు అన్నారు. డివిజన్‌లో ఇందిరమ్మ చీరలను సోమవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ అర్హత కలిగిన కుటుంబానికి అందేలా పాటుపడతానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలతో ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకొందామని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎల్లపుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ నరేష్, ఆర్‌పిలు, స్వయం సహాయక గ్రూపు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆధునిక మిస్టింగ్ బస్‌స్టాప్‌ల ఏర్పాటు

### ప్రయాణికులకు వేడిమి నుంచి ఉపశమనం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేదిశగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో, ఎన్నెస్పి కెనాల్ వాక్‌వే వద్ద, సర్దార్ పటేల్ స్టేడియం సమీపంలో ఆధునీక మిస్టింగ్ బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మిస్టింగ్ బస్‌స్టాప్‌లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మిస్టింగ్ వ్యవస్థ ద్వారా సూక్ష్మ నీటి బిందులు విడుదలై పరిసర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. దీనితో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు వేసవి తీవ్ర ఎండల నుంచి ఉపశమనం పొందగలుగుతారు. ఈ బస్‌స్టాప్‌లను పర్యావరణ హితంగా రూపొందిస్తూ ఆకర్షణీయమైన డిజైన్‌తో పాటు పచ్చదనాన్ని పెంపొందించేవిధంగా మొక్కలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా నగర సౌందర్యాన్ని పెంచడమే కాకుండా ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

# గ్రామాలలో మృగశిర కార్తె సందడి

### గోదావరి, చెరువుల్లో చేపల వేటలో జాలరులు

### చేపల విక్రయాలతో మార్కెట్లు కిటకిట



**ప్రజాపక్షం/పినపాక :** రోళ్లు పగిలే రోహిణి కార్తె పూర్తయ్యాక తొలకరి చినుకులు మోసుకొచ్చే మృగశిర కార్తె ప్రారంభమవుతుంది. మృగశిర పలకరింపుతో పుడమి తల్లి పులకిస్తుంది. అప్పటి వరకు గ్రీష్మ తాపంతో వేడెక్కిన భూమి కొంత చల్లబడుతుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగింది. ఆరోగ్యకరమైన వర్షాకాలానికి ఆహ్వానం పలికేదే మృగశిర కార్తె, మృగశిర కార్తె ప్రారంభం కావడంతో వినియోగదారులతో పినపాక మండల వ్యాప్తంగా సోమవారం గ్రామాలలో సందడి కనిపించింది. కార్తె ప్రారంభం రోజు చేపలు తినాలి అనే నానుడి ఉండటంతో కొనుగోలుదారులు ఎగబడటంతో మార్కెట్లో అమ్మకాలు ఊపు అందుకున్నాయి. అమ్మకందారులు సైతం పెరిగారు. ఉదయం నుంచే కొనుగోలు దారులు చేపల దుకాణాల వద్ద బారులు తీరారు. ఇదే అదునుగా చేసుకున్న చేపల అమ్మకందార్లు కేజీకి రూ.50లు, రకాన్ని బట్టి 100 రూపాయలు రేట్లు అధికం చేసి అమ్మకాలు జరపడంతో డిమాండును ఆసరాగా చేసుకొని అధిక ధరలకు అమ్మకందారులు అమ్మకాలు చేపట్టడం వల్ల కొనుగోలుదారులు అసహనం వ్యక్తం చేశారు. మృగశిర రోజున చేపలు తింటే అనారోగ్య సమస్యలు రావనేది ప్రజల నమ్మకం.

**జోరుగా చేపల విక్రయాలు...** ఈ నేపథ్యంలో చేపల వ్యాపారులు ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి వినియోగదారులకు రకరకాల చేపలను అందుబాటులో ఉంచారు. మృగశివర కార్తె సందర్భంగా చేపల కొనుగోళ్లు విపరీతంగా పెరుగుతుండగా, పినపాక మండలంలో ఉత్సాహం కనిపించింది. చేపల మార్కెట్, గ్రామీణ పల్లెల్లో రద్దీ పెరిగి విక్రయాలు భారీగా సాగడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మృగశిర కార్తెను పురస్కరించుకుని ప్రజలు ఇళ్లలో వేడుకలకు సిద్ధమవుతుండటంతో చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని తలపించాయి.

**మృగశిర కార్తె ప్రత్యేకత...**

మృగశిర కార్తెలో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి మందగిస్తుంది. ఆస్తమా వంటి శ్వాసకోస సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉంటాయి. అందుకే మృగశిర కార్తె ఆరంభం కాగానే శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి, శ్వాసకోస సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి ఆహారంలో చేపలు విరివిగా తినాలని అంటారు. అయితే శాఖాహారులు మాత్రం బెల్లంలో ఇంగువ కలుపుకుని తింటారు. ఇది శరీరంలో ఉష్ణోగ్రత ప్రేరేపించి వర్షాకాలంలో సోకే వ్యాధులను అడ్డుకుంటుందని పెద్దల విశ్వాసం.

# అధికారులను నిలదీసిన గ్రామస్తులు

### వైద్యుడి నియామకం నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు పలు సమస్యలపై ఆగ్రహం



**ప్రజాపక్షం/ములకలపల్లి :** ములకలపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామసభ ప్రజా సమస్యలకు వేదికగా మారింది. గ్రామాభివృద్ధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడి కొరత, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, మట్టి తోలకాల అనుమతులు, పంచాయతీ ఖర్చుల వివరాలు వంటి అంశాలపై గ్రామస్తులు అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటూ వెంటనే వైద్యుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు సిపిఐ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. మట్టి తోలకాల అంశంపై ఇరిగేషన్ ఎఇ ప్రవీణ్ స్పందిస్తూ, రైతులు తమ వ్యవసాయ అవసరాల కోసం మట్టి కోరితే దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇతర అవసరాలకు మట్టి కావాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము చెల్లించి అనుమతి పొందవచ్చన్నారు. చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు లేదా తోలకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని బిఆర్ఎస్ నాయకుడు కొండవీటి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాజకీయ సిఫారసులు, జోక్యాలకు తావులేకుండా నిజంగా ఇల్లు లేని ప్రతి అర్హత కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన ఖర్చుల వివరాలను వెల్లడించాలని గ్రామస్తులు ప్రశ్నించగా, ప్రస్తుతం ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహిస్తున్నామని, జూన్ 23న జరిగే తదుపరి గ్రామసభలో 60 రోజుల ప్రణాళికతో పాటు పంచాయతీ ఖర్చుల వివరాలను సమగ్రంగా ప్రవేశపెడతామని ఎంపిడిఓ రామారావు తెలిపారు. అయితే గ్రామస్తులు అడిగిన ప్రశ్నలు, లేవనెత్తిన సమస్యలను గ్రామసభ మినిట్స్ బుక్‌లో నమోదు చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. గ్రామసభలో సర్పంచ్ కొరస చంద్రలేఖ, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, ఎంపిడిఓ రామారావు, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మిషన్ భగీరథ ఎఇ వరప్రసాద్, ఇరిగేషన్ ఎఇ ప్రవీణ్, హౌసింగ్, వ్యవసాయ, విద్యుత్, అటవీశాఖ అధికారులతో పాటు వార్డు సభ్యులు, గ్రామ నాయకులు బత్తుల అంజి, ఎండిజహీరుద్దీన్, నరాటి రమేష్, అనుముల సాయి, అయ్యప్ప పాల్గొన్నారు.

## రైతులు బిల్లు లేకుండా విత్తనాలు కొనుగోలు చేయొద్దు

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలంలోని డీలర్ షాపులను టాస్క్‌ఫోర్స్ టీమ్ ద్వారా జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, సబ్ ఇన్‌సపెక్టర్ వపన్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు ఆథరైజ్డ్ లైసెన్స్ పొందినటువంటి డీలర్స్ ద్వారానే పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని తెలియజేశారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు బిల్ తీసుకోకుండా ఎవరూ విత్తనాలను కొనుగోలు చేయకూడదు. తప్పనిసరిగా లాట్ నెంబర్‌ను మనం తీసుకున్నటువంటి బిల్లులో ఉండేవిధంగా చూసుకోవాలని అదేవిధంగా వాతావరణ పరిస్థితులు అనుకూలతను బట్టి సరైనటువంటి రకాలను ఎంపిక చేసుకొని తెలియజేశారు. ఒకే రకమైనటువంటి విత్తనాలను ఎంపిక చేసుకోవడం కాకుండా ఇతర రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తెలియజేశారు. దీని ద్వారా రైతులు ఒకే రకమైన విత్తనం విత్తుకున్నప్పుడు సరైన దిగుబడు రాకపోతే వేరొక రకం ద్వారా పొందవచ్చని రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులు తగ్గట్లుగా అధిక వర్షాలు లేనట్లయితే ప్రత్యామ్నాయ పంటలైనటువంటి కంది, పెసర, మినుము వంటి పరాల పంటలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి మయాన మంజుఖాన్, విస్తరణ అధికారి మేడా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుంటే...

## రాష్ట్రాలు, నగరాల్లోనూ నిరసనలు

● సిజెపి ఉద్యమం పూర్తిగా శాంతియుతమైనది● పొరుగు దేశాల్లో జరిగిన ఆందోళనలతో దీనిని పోల్చలేం● కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**ఛత్రపతి సంభాజీనగర్ :** పరీక్షలు, నియామక పరీక్షలలో అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఈనెల 13 నాటికి రాజీనామా చేయకపోతే, దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల్లో నిరసనలు చేపడతానని ప్రకటించారు. నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఇటీవల 'జెన్‌జెడ్' వర్గం చేపట్టిన నిరసనల గురించి అడిగినప్పుడు, ఆదివారం నాడు డిప్కే స్పందిస్తూ... సిజెపి ఉద్యమం పూర్తిగా శాంతియుతమైనదని, పొరుగు దేశాల్లో జరిగిన ఆందోళనలతో దీనిని పోల్చలేమని స్పష్టం చేశారు. సిజెపి అనేది ప్రత్యేకంగా 'జెన్‌జెడ్' కోసం ఉద్దేశించినదని, దీనికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం ఉండదన్నారు. దేశంలో పరీక్షా పత్రాల లీకేజీ (పేపర్ లీక్) ఆరోపణల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, 'కాక్రోచ్ జనతా పార్టీ' 6న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహించింది. అయితే ఆదివారం రాత్రి ఎక్స్ పోస్టులో దీప్కే స్పందిస్తూ 'శనివారం (జూన్ 13) నాటికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే, ఆందోళనను మరింత విస్తృతం చేస్తానని నేను ఇంతకు ముందే చెప్పాను. ఆ దిశగా అడుగులు వేస్తూ, ఒకవేళ ప్రధాన్ రాజీనామా చేయకపోతే, నేను స్వయంగా వివిధ నగరాలు, రాష్ట్రాలకు వెళ్లి, ఆయన రాజీనామా డిమాండ్‌తో నిరసనలు చేపడతాను' అని అన్నారు. జాతీయ రాజధానిలో తదుపరి దశ ఆందోళన ప్రణాళికల గురించి కూడా ఆయన మాట్లాడారు. రాష్ట్రాల్లో నిరసనల తర్వాత కూడా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే తమకు మళ్లీ ఆందోళన చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. అప్పుడు దేశం నలుమూలల నుండి విద్యార్థులు న్యూఢిల్లీకి వచ్చి శాంతియుతం గా నిరసన తెలుపుతారని చెప్పారు. ప్రధాన్ రాజీనామా చేసే వరకు తాము ఆగే ప్రసక్తే లేదని, కోటి మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు ఆయన నైతిక బాధ్యత వహించాలి డిమాండ్ చేశారు. అంతకు ముందు, ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో దీప్కే మాట్లాడుతూ 'కాక్రోచ్' అనే పదాన్ని ఆధారంగా చేసుకుని ఆన్‌లైన్ వ్యంగ్య వేదికగా ప్రారంభమైన సిజెపి ఉద్యమాన్ని, కొన్ని పొరుగు దేశాల్లో జరిగిన ఆందోళనలతో సమానం చేయలేమని పేర్కొన్నారు. పొరుగు దేశాల్లో 'జెన్‌జెడ్' కారణంగా వచ్చిన విప్లవం భారతదేశంలో కూడా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారా అని ప్రశ్నించగా, 'పొరుగు దేశాలతో (ఆందోళనను) పోల్చాలని నేను అనుకోవడం లేదు, ఎందుకంటే ఇక్కడ (భారతదేశంలో) ఒక వ్యవస్థ ఉంది. కానీ బంగ్లాదేశ్, నేపాల్‌లలో జరిగిన వాటితో పోల్చుతూ ఒక కథనం ప్రచారం చేస్తున్నారు. మేము దేశంలో బీభత్సం సృష్టించాలనుకుంటున్నామని కూడా వారు అంటున్నారు' అని దీప్కే బదులిచ్చారు. 'పొరుగు దేశాలలో జరిగిన ఉద్యమాలతో మా ఉద్యమాన్ని పోల్చేవారు ఒక విషయం తెలుసుకోవాలన్నారు. జంతర్ మంతర్ ఆందోళన జనంతో నిండిపోయినప్పటికీ, అది చాలా శాంతియుతంగా జరిగిందని, ఈ ఆందోళనలో పాల్గొన్న యువకులు దేశంలోని నలుమూలల నుండి వచ్చారన్నారు. ఇకపై, ఇంకా పెద్ద నిరసనలు జరుగుతాయి, అవి కూడా శాంతియుతంగానే ఉంటాయని స్పష్టం చేశారు.

### అంగీకారంతో కూడిన శారీరక సంబంధం

## చెడు ప్రవర్తనకు సంకేతం కాదు



**న్యూఢిల్లీ :** మేజర్ల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ నియామక మండలికి కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది. అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్ ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

**వివాహంతోనే ప్రేమ ముగియాలనే నియమం లేదు!**

ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

**చట్టపరమైన పరిమితుల్లోనే!**

క్రిమినల్ న్యాయ వ్యవస్థలో ఒక వ్యక్తిపై ఆరోపణలు నిరూపితమయ్యే వరకు అతడిని నిర్దోషిగానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఆరోపణలు ఉన్నాయనే కారణంతోనే అతడిని దోషిగా చూడలేమని తెలిపింది. ముఖ్యంగా మోసం జరిగిందా లేదా అనే విషయాన్ని సంబంధిత బాధితురాలు మాత్రమే వివరించగలదని పేర్కొంది. ఈ కేసులో యువతి స్వయంగా కేసును కొనసాగించేందుకు ఆసక్తి చూపకపోవడం, ఎలాంటి సాక్ష్యాలు సమర్పించకపోవడం, పైగా రాజీకి అంగీకరించడం వంటి అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది. అలాంటి పరిస్థితుల్లో నియామక అధికారులు తమంతట తామే ఊహాగానాలు చేసి అభ్యర్థి వ్యక్తిత్వంపై చెడు అభిప్రాయం ఏర్పరచుకోవడం సమంజసం కాదని స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన అంశాలను చట్టపరమైన పరిమితుల్లోనే పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. చట్టం నిషేధించని వ్యక్తిగత సంబంధాలను ఆధారంగా చేసుకుని ఒకరి ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయడం సరైంది కాదనే సందేశాన్ని ఈ కేసులో తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చింది.

## మణిపూర్‌లో ఎన్ఆర్‌సి నవీకరణ చేయాల్సిందే

పౌర సంస్థలు డిమాండ్ : వేలాది మంది ర్యాలీ




**ఇంఫాల్ :** రాష్ట్రంలో జనాభా గణన నిర్వహించడానికి ముందే మణిపూర్‌లో ఎన్ఆర్‌సిని నవీకరించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది ర్యాలీ నిర్వహించారు. 14 పౌర సమాజ సంస్థలు నిర్వహించిన ఈ ర్యాలీ, ఇంఫాల్‌లోని టిడ్డిమ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి థౌ గ్రౌండ్‌లో ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. 'మణిపూర్‌ను నిర్లక్ష్యం చేయవద్దు', 'ఎన్ఆర్‌సి నవీకరణ వద్దు, జనాభా గణన వద్దు' అని రాసి ఉన్న ప్లకార్డులను ర్యాలీ పాల్గొన్న వారు ప్రదర్శించారు. అక్రమ వలసదారులను గుర్తించి, వారిని దేశం నుండి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఆందోళనకారుల ప్రతినిధి శాంతా నహక్‌పామ్ మాట్లాడుతూ, 'అసోం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారాల సమయంలో బిజెపి అక్రమ వలసదారుల సమస్యను లేవనెత్తింది. మణిపూర్‌లో కూడా అక్రమ వలసలు, సరిహద్దు కంచె వంటి అనేక సమస్యలు ఉన్నాయి' అని అన్నారు. మణిపూర్‌లో ఎన్ఆర్‌సి (జాతీయ పౌర పట్టిక) నిర్వహించాలనే ఆసక్తి కేంద్రానికి లేదని తాము భావిస్తున్నామని, ఎన్ఆర్‌సి నవీకరణ, తదనంతరం అసెంబ్లీ సీట్ల పునర్విభజనను కోరుకుంటున్నామని నహక్‌పామ్ పేర్కొన్నారు. నిష్పక్షపాతమైన జనాభా గణనను నిర్ధారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ మార్చిలో చెప్పారు. 2027 జనాభా గణన కోసం రాష్ట్రంలో సెప్టెంబర్ 1 నుండి 30 మధ్య ఇళ్ల జాబితా తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తామని, ఆగస్టు 17–31 వరకు స్వీయగణనకు అవకాశం కల్పిస్తామని మణిపూర్ ప్రభుత్వం గతంలో ప్రకటించింది. 60 మంది సభ్యులు గల అసెంబ్లీకి వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు జరిగేజరిగే అవకాశం ఉంది.

### అభిప్రాయ భేదాలను పరిష్కరించుకునేందుకు త్వరలో

## ఇండియా కూటమి కీలక నేతల భేటీ

15 రోజుల్లో కీలక నాయకులను ఆహ్వానించి పరిష్కారానికి యత్నం : శరద్ పవార్



**పుణె :** 'ఇండియా' కూటమికి డిఎంకె దూరమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ స్పందించారు. విభేదాలను పరిష్కరించుకునేందుకు ప్రతిపక్ష కూటమిలోని కీలక నాయకుల సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని సోమవారం మహారాష్ట్రలోని బరామతిలో జరిగిన విలేకరు సమావేశంలో ఆయన వెల్లడించారు. 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు సోమవారం ఢిల్లీలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించాయని, ఇందులో కూటమిలోని భాగస్వామ్య పక్షాలన్నీ ఎటువంటి తీవ్రమైన నిర్ణయాలు లేదా చర్యలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కొన్ని చోట్ల కలిసి, మరికొన్ని చోట్ల విడివిడిగా పోటీ చేశాయి. ఎన్నికల తర్వాత, కూటమిలోని భాగస్వామ్య పక్షాలలో ఒకటైన డిఎంకె బయటకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అటువంటి పరిస్థితి తలెత్తుతున్నందున, రాబోయే 8 నుండి 15 రోజుల్లో కూటమిలోని కీలక నాయకులను ఆహ్వానించి, పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నిస్తామని, కచ్చితంగా పరిష్కారం లభిస్తుందని తనకు నమ్మకం ఉందని పవార్ అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశం ప్రధానంగా ఒక సమీక్షా సమావేశమని ఆయన పేర్కొన్నారు. సోమవారం నాటి చర్చల ఫలితాల ఆధారంగా, భవిష్యత్తు కార్యాచరణను, పరిష్కారాన్ని ఎలా కనుగొనాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అలాగే సమీప భవిష్యత్తులో తక్షణ ఎన్నికలేవీ లేవని ఆయన పేర్కొన్నారు.

## కేరళలో చురుకుగా 'నైరుతి'

మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ :వర్షాలతో ఇద్దరు మృతి



**తిరువనంతపురం :** కేరళలో నైరుతి రుతుపవనాలు సోమవారం చురుకుగా కొనసాగాయి. ఈ నేపథ్యంలో ఉత్తర ప్రాంతంలోని మూడు జిల్లాలకు మంగళవారం కోసం భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసిందని అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భవనాలు దెబ్బతినగా, మలప్పురం, పాలక్కాడ జిల్లాల్లో రెండు మరణాలు సంభవించాయి. మలప్పురం జిల్లాలోని చంగరంకుళంలో సోమవారం ఉదయం చేపలు పడుతుండగా నీటి గుంటలో పడి 15 ఏళ్ల బాలుడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మరణించిన బాలుడిని ముహమ్మద్ కుమారుడు ముర్షిద్‌గా గుర్తించారు. పాలక్కాడ జిల్లాలోని కుజల్మన్నంలో, బావిని శుభ్రం చేస్తుండగా అది కూలిపోవడంతో 30 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తిని పెరింగ్‌కున్నమ్‌కు చెందిన రామదాస్‌గా గుర్తించారు. ఉదయం 10:30 గంటల ప్రాంతంలో బావి కూలిపోయి రామదాస్ లోపలే చిక్కుకుపోవడంతో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ ప్రకారం మంగళవారం 24 గంటల వ్యవధిలో కోజికోడ్ కన్నూర్, కాసరగోడ్ జిల్లాల్లో 20 సెంటీమీటర్లకు పైగా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. పాలక్కాడ త్రిసూర్, ఎర్నాకులం, ఇడుక్కి, కొట్టాయం, పతనంతిట్ట జిల్లాల్లో 6 నుండి 11 సెంటీమీటర్ల వరకు భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉన్నందున మంగళవారం కోసం 'ఎల్లో అలర్ట్' ప్రకటించారు. సోమవారం కోసం తిరువనంతపురం, కొల్లం, పతనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకులం, త్రిసూర్, పాలక్కాడ మలప్పురం, వయనాడ్ జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. కేరళ తీరం వెంబడి గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో (అప్పుడప్పుడు 60 కిలోమీటర్ల వేగం వరకు పెరిగే అవకాశం ఉన్న) బలమైన గాలులతో కూడిన ప్రతికూల వాతావరణం నెలకొనే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. భారీ వర్ష సూచన దృష్ట్యా, ముందస్తు జాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పర్యాటక ప్రాంతాలను మూసివేశారు. కొండచరియలు విరిగిపడే, బురద ప్రవాహాలు వచ్చే, ఆకస్మిక వరదల ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచిస్తే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు కోరారు. నదీ తీరాల్లో మరియు ఆనకట్టల దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలను కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా, పతనంతిట్ట జిల్లాలోని కూడల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఒక మర్రిచెట్టు సోమవారం తెల్లవారుజామున కూలిపోవడంతో భవనానికి స్వల్ప నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. అధికారుల సమాచారం ప్రకారం, బలమైన గాలులను గమనించిన కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో ఇంటికి పాక్షికంగా నష్టం వాటిల్లింది.

## భారత్—చైనా ప్రత్యర్థులు కాదు సహకార భాగస్వాములు:లిన్ జియాన్

**బీజింగ్:** భారత్—చైనా దేశాలు ప్రత్యర్థులు కాదని, ఈ రెండూ సహకార భాగస్వాములని, రెండు దేశాలకు పరస్పర అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి తప్ప బెదిరింపుల బెడదలు లేవని చైనా విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు. బీజింగ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఒక ప్రశ్నకు సమాధానంగా లిన్ జియాన్ పైవిధంగా వ్యాఖ్యానించారు .చైనా—భారత్ సంబంధాలు, ఈ రెండు దేశాలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు మాస్కో చేస్తున్న కృషి గురించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ఇటీవల చేసిన వ్యాఖ్యపై అడిగిన ప్రశ్నకు లిన్‌జియాన్ స్పందించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఇటీవల జరిగిన ఆర్థిక మండలి అంతర్జాతీయ వేదిక సమావేశాల సందర్భంగా గడచిన గురువారం పలు దేశాల మీడియా సంస్థల అధిపతులతో పుతిన్ సమావేశమై సమాధానాలు చెప్పారు. పిటిఐ వార్తాసంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం భారత్—చైనా సరిహద్దు పరిస్థితులు సాధారణంగా స్థిరంగా ఉన్నాయని, రెండుదేశాల మధ్యా చాలా చక్కటి సమన్వయంతో సమాచార సంబంధాలు కొనసాగుతున్నాయని లిన్ జియాన్ చెప్పారు. ''ఈ రెండు దేశాలూ ప్రత్యర్థులు కాదు, సహకార భాగస్వాములు, ఒక అభివృద్ధి మరొకరికి ముప్పుకాదు, దానిని ఒక అవకాశంగా భావించాలనే దృక్పథానికి కట్టుబడి ఉండాలి'' అన్నారు. పాకిస్థాన్‌తో చైనాకు ఉన్న సన్నిహిత సంబంధాలపై భారత్ వ్యక్తం చేస్తున్న ఆందోళనపై కూడా లిన్ మాట్లాడుతూ, చర్చలు, సంప్రదింపుల ద్వారా ఈ విభేదాలను పరిష్కరించుకోవడంలోనూ,అదేవిధంగా ఈ ప్రాంతాన్ని శాంతియుతంగా,సుస్థిరంగా ఉంచడానికి వీలుగా భారత్—పాకిస్థాన్ రెండు దేశాలకూ తమదేశం పూర్తి మద్దతు ఇస్తుందని చెప్పారు. భారత్—రష్యా—చైనా ఆర్థిక సంబంధాల గురించి కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాలు వర్ధమాన ఆర్థిక వ్యవస్థలనీ, వీటిమధ్య మంచి సంబంధాలు కొనసాగించడం ఆయా దేశాల ప్రయోజనాలకు మాత్రమే కాకుండా ప్రపంచశాంతి, భద్రత,స్థిరత్వానికి కూడా దోహదం చేస్తాయని అన్నారు. భారత్,రష్యా దేశాలతో సత్‌సంబంధాలు కొనసాగించేందుకు చైనా ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని, త్రైపాక్షిక సహకారాన్ని ముందుకు తీసుకువెళుతుందని చెప్పారు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ మీడియా సంస్థల అధిపతులతో సుదీర్ఘసమావేశం సందర్భంగా పుతిన్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌లపై ప్రశంసలు కురిపించారు. ఈ రెండు దేశాలతో రష్యా అనేక దశాబ్దాలుగా మంచి భాగస్వామ్య, ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగస్తోందని, ఈ రెండు దేశాలు పూర్తిగా స్వతంత్రంగా,సహజసిద్ధంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.

## కూల్చివేతలపై ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు సలహాలకోసం సుప్రీం కోర్టు మిత్రుడి నియామకం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ నగర పాలక సంస్థ (ఎంసిడి) చేపట్టే కూల్చివేతల చర్యలతో సహా వివిధ రకాలుగా సంస్థకు మార్గదర్శనం చేసేందుకు సంబంధిత రంగంలో అనుభవం ఉన్న ఒక నిపుణుణ్ణి ''కోర్టు మిత్రుడు'' హోదాలో సుప్రీం కోర్టు నియమించింది. దేశ రాజధానిలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయి, ఈ విషయంలో చర్యలు తీసుకుంటున్నారు. వీటికి వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలవుతున్నాయి. ఈ విషయాలపై సర్వేలు నిర్వహించాలి. ఇదే విషయంగా ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు ఎంసిడిని కోరింది. అనధికార నిర్మాణాలపై తీసుకున్న చర్యలపై కార్యాచరణ నివేదికను, సర్వే నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు కోరింది. ఢిల్లీలోని సైదుల్ అజైబ్ ప్రాంతంలో ఐదు అంతస్తుల ఒక భవనం ఆకస్మికంగా కుప్పకూలిపోవడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడ్డారు. ఈ ఏడాది మే 30వ తేదీన ఢిల్లీలో ఈ ఘటన జరిగింది. ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోర్టు కోరింది. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి ఇదే విషయంపై కేసు విచారణ సందర్భంగా, భవన నిర్మాణ నియంత్రణ నిబంధనలను చాలా దారుణంగా ఉల్లంఘిస్తున్నారని, మద్రాసు మహానగర పాలక సంస్థ అధికారులు ఈ ఉల్లంఘనలు,అనధికార నిర్మాణాలను అరికట్టడంలో విఫలమయ్యారని జస్టిస్ అసదుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మార్చి 25వ తేదీన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

## 13 నుంచి హైదరాబాద్‌లో సౌత్ జోన్ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ భారత రాష్ట్రాల పికిల్‌బాల్ క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకురానున్న 2వ సౌత్ జోన్ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 13 నుంచి 15 వరకు కొంపల్లిలోని ది హబ్ పికిల్‌బాల్ ఫెసిలిటీలో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ జరగనుండగా, పోటీల అధికారిక మాస్కట్, వాల్ పోస్టర్‌ను రాష్ట్ర క్రీడలు, యువజన సేవలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండి డాక్టర్ ఎ. సోనిబాలా దేవి సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. వివిధ విభాగాల్లో ఛాంపియన్‌షిప్ టైటిళ్లు, పతకాలు, ఆకర్షణీయ నగదు బహుమతుల కోసం పోటీ పడనున్నారు. క్రీడా సామగ్రి సంస్థలు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించనున్నాయి. అమేచ్యూర్ తెలంగాణ పికిల్‌బాల్ అసోసియేషన్, ఆల్ ఇండియా పికిల్‌బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయి. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ , తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సహకారం అందిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఎటిపిఎ ప్రధాన కార్యదర్శి, ఎఐపిఎ సెలెక్షన్ కమిటీ చైర్మన్ పి. జగన్ మోహన్ గౌడ్ జాయింట్ సెక్రటరీ కె. వెంకటేష్, ఆఫీస్ సెక్రటరీ కిరణ్ చారి తదితరులు పాల్గొన్నారు. దక్షిణ భారత రాష్ట్రాల క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ ఛాంపియన్‌షిప్ కీలక వేదికగా నిలవడంతో పాటు, దేశంలో వేగంగా ప్రజాదరణ పొందుతున్న పికిల్‌బాల్ క్రీడ విస్తరణకు మరింత ఊతమిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నూతన లేబర్ కోడ్‌ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్‌లు 2020 అమలుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. నూతన కార్మిక కోడ్‌ల నిబంధనలను రాష్ట్ర వ్యవస్థలో సమన్వయం చేసే ప్రక్రియ కొనసాగుతోందని, అవసరమైన చర్యలు పూర్తయ్యాక వాటిని త్వరలోనే రాష్ట్రంలో అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కార్మిక మంత్రులతో సోమవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌ను కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నిర్వహించింది. సమావేశంలో నాలుగు కేంద్ర కార్మిక కోడ్‌ల అమలు స్థితిగతులు, వాటి అమలులో ఎదురవుతున్న అంశాలు, దేశవ్యాప్తంగా కార్మిక సంస్కరణలకు సంబంధించిన వివిధ విషయాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే కార్మిక సంక్షేమం, ఉపాధి అవకాశాల విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా కార్మిక చట్టాల అమలు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో కార్మి క సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి కల్పన చర్యలు, కార్మిక చట్టాల అమలుకు స ంబంధించి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రి వివరించారు. ఈ సమావేశంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ (ఎల్ఇటిఎఫ్) కార్యదర్శి దాసరి హరిచందన, కార్మిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కార్మిక సంక్షేమం కోసం లేబర్ కోడ్స్–2020 అమలును వేగవంతం చేయాలి: కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ**

కార్మిక రంగం ఉమ్మడి జాబితాలో ఉన్నందున, లేబర్ కోడ్‌ల సమర్థవంతమైన అమలుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. లేబర్ కోడ్స్2020ద్వారా ప్రస్తుతం అమలులో ఉన్న వివిధ కార్మిక చట్టాలను ఏకీకృతం చేసి, సరళమైన విధానంలో తీసుకువచ్చామని తెలిపారు. దీనివల్ల కార్మికులకు మరింత రక్షణ, సంక్షేమ ప్రయోజనాలు లభించడంతో పాటు పరిశ్రమలు, యాజమాన్యాలకు చట్టాల అమలులో సౌలభ్యం కలుగుతుందని వివరించారు.

### రైలు ప్రయాణికులకు శుభవార్త

## 'ఎస్‌సిఆర్ రైల్ సమాచార్' అధికారిక వార్తా బులెటిన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతను మరింత పటిష్ఠం చేయాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ట్రాక్ నిర్వహణ పనుల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రయాణికులకు రైల్వే తాజా సమాచారాన్ని చేరవేసేందుకు దక్షిణ మధ్య రైల్వే తొలి అధికారిక వార్తా బులెటిన్ 'ఎస్‌సిఆర్ రైల్ సమాచార్' ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం నిర్వహించిన జోన్ స్థాయి రైలు భద్రత సమీక్షా సమావేశంలో ఎస్‌సిఆర్ అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖల ప్రధానాధికారులతో కలిసి జీఎం పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోన్ వ్యాప్తంగా భద్రతా పనితీరును సమీక్షించిన జీఎం, అన్ని డివిజన్లలో కొనసాగుతున్న అగ్నిప్రమాదాల నివారణ ప్రత్యేక డ్రైవ్‌ల పురోగతిని పరిశీలించారు. అలాగే ఇంజినీరింగ్, సేఫ్టీ, సెక్యూరిటీ, ఆపరేటింగ్ విభాగాల అధికారులు నిర్వహిస్తున్న రాత్రి వేళ ఆకస్మిక తనిఖీలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రైవేట్ సైడింగ్‌లు, గూడ్స్ షెడ్‌ల వద్ద సిసిటివి కెమెరాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన ఆయన, లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు తదితర రన్నింగ్ సిబ్బందికి నూతన భద్రతా మార్గదర్శకాలు, సురక్షిత పనితీరు విధానాలపై నిర్వహిస్తున్న రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాల పురోగతిని కూడా సమీక్షించారు. అంతకుముందు ప్రారంభించిన 'ఎస్‌సిఆర్ రైల్ సమాచార్' బులెటిన్ ద్వారా దక్షిణ మధ్య రైల్వే విజయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, అధికారులు తెలిపారు.

## పాక్ ఆక్రమిత కశ్మీరులో నిరసనలు

ఏడుగురు మృతి:60 మందికి గాయాలు

**రావల్‌కోట్:**పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులోని రావల్‌కోట్‌లో జరిగిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారడంతో ఏడుగురు మరణించారు. మరో 60 మంది గాయపడ్డారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో నిషేధిత గ్రూప్ ప్రారంభించిన నిరసన ప్రదర్శన చివరకు పోలీసులతో ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణ హింసాత్మకంగా మారింది. ఈ ఘర్షణలో ముగ్గురు పౌరులు సహా నలుగురు పోలీసు అధికారులు మరణించారు. 40 మంది ప్రదర్శకులు, మరో ఇరవై మంది ఇతరులు కూడా ఈ ఘర్షణల్లో తీవ్రంగా గాయపడినట్లు రావల్‌కోట్ ఉన్నతస్థాయి అధికారి సర్దార్ వహీద్ మీడియాకు చెప్పారు. ప్రజా భద్రతకు తీవ్ర ఆటంకంగా మారిన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నిరసన ప్రదర్శనలు చేపట్టడానికి ఒక రోజు ముందుగా ఈ ఘర్షణ చెలరేగింది. ఈ ప్రాంతంలో పర్యాటకులు ఈనెల ఐదో తేదీ నుండి 20వ తేదీ వరకూ వెళ్ళవద్దని, అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలని అమెరికా దౌత్యకార్యాలయం ముందుగానే ఒక ప్రకటన చేసింది. ఇటీవలికాలంలో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ హింసాత్మకమైన ప్రదర్శనలు చేస్తోంది. వచ్చేవారంలో కూడా ఇదేవిధమైన ప్రదర్శనలకు పిలుపు ఇచ్చింది.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
09-06-2026
www.prajapaksham.in


### ఆధిపత్యవాదం, యుద్ధోన్మాదాలపై ఉమ్మడి పోరు
## ఉత్తర కొరియా పర్యటనలో జిన్‌పింగ్



**ప్యాంగ్‌యాంగ్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఏడు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఉత్తర కొరియా పర్యటనకు వెళ్ళారు. రెండు రోజుల పర్యటన సందర్భంగా ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లో జిన్‌పింగ్‌కు వేలాదిమంది ప్రజల మధ్య ఘన స్వాగతం లభించింది. ఆధిపత్యవాదం, యుద్ధోన్మాదాలపై ఉమ్మడి పోరాటం చేస్తామని పర్యటనకు ముందుగా జిన్‌పింగ్ చెప్పారని మీడియా పేర్కొంది. సంప్రదాయ స్నేహానికి చైనా ఎంతో గొప్ప విలువ ఇస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. ప్రత్యేక విమానంలో ఆయన ప్యాంగ్‌యాంగ్ చేరుకున్నప్పుడు ఆయనకు ప్రజలు ఎర్ర జెండాలతో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కొరియా వర్కర్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి,డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా(డిపిఆర్‌కె) రాజ్య వ్యవహారాల అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో జిన్‌పింగ్ సంభాషించారు. రెండు దేశాల మధ్య పరస్పర రాజకీయ విశ్వాస పునాదిని పటిష్టం చేసుకోవాలని నిర్ణయించారు. కొరియాతో సంప్రదాయబద్ధమైన స్నేహానికి విలువ ఇచ్చే విషయంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, చైనా ప్రభుత్వం అనుసరించే వైఖరిలో ఎన్నటికీ మార్పు రాబోదని చర్చల సందర్భంగా జిన్‌పింగ్ చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు వచ్చినాగానీ, రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోవడంలో అనుకూలమైన వ్యూహాత్మక వాతావరణాన్ని రక్షించుకోవడంలో చైనా ధృఢ వైఖరి మారబోదని కూడా ఆయన స్పష్టం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా ముందుకు తీసుకువెళ్ళేందుకు పాటించే మార్గదర్శకాలలో భాగంగా ఉన్నతస్థాయిలో పరస్పర పర్యటనలు,మార్పిడులు కొనసాగించాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు. మే నెలలో అమెరికా,రష్యా అగ్రదేశాల నాయకులతో సంభాషణల తర్వాత జీ జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటనకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. యుద్ధోన్మాదం, సైనికీకరణ వల్ల ప్రాంతీయ భద్రతకు, ప్రాంతీయ సుస్థిరతకు ముప్పు వాటిల్లుతుందని పర్యటనకు ముందుగా జిన్‌పింగ్ అన్నారు.

### అన్నీ నేనే..నెతన్యాహూకు మరోమార్గం లేదు
## ఒప్పందానికి కట్టుబడాల్సిందే: ట్రంప్





**వాషింగ్టన్:** ఇరాన్‌తో అమెరికా కుదుర్చుకునే ఎలాంటి ఒప్పందానికైనా కట్టుబడి ఉండటం తప్ప ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూకు మరోమార్గం ఉండదని డోనాల్డ్ ట్రంప్ తెగేసి చెప్పారు. ద ఫైనాన్సియల్ టైమ్స్‌కు టెలిఫోన్ ద్వారా సోమవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ‘‘నిర్ణయాలు తీసుకునేది నేనే, అన్నీ నేనే నిర్ణయిస్తాను, నెతన్యాహూ నిర్ణయాలు తీసుకోలేరు...ఆయనకు వేరే మార్గం ఉండదు’’ అన్నారు. లెబనాన్‌లో యుద్ధాన్ని ఇజ్రాయెల్ ముగించాలని, ఈ విషయాన్ని కూడా యుద్ధ ముగింపు ఒప్పందం ముసాయిదా ఎంఒయులో చేర్చాలని ఇరాన్ ప్రతినిధులు గట్టిగా పట్టుబడుతున్న తరుణంలో ట్రంప్ పైవిధంగా చెప్పారు. అదేసమయంలో సోమవారం తెల్లారకముందే ఉత్తర ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులుచేసినప్పుడు, ఎదురు దాడులు చేయవద్దని నెతన్యాహూకు ఫోన్ ద్వారా ట్రంప్ తెలియజేశారు. ‘‘చర్చలు ముగింపు దశలో ఉన్నాయి, ఈ సమయంలో దాడులు చేసి యుద్ధాన్ని విస్తరించి చర్చల వాతావరణాన్ని చెడగొట్టవద్దు’’ అని ట్రంప్ చెప్పారని యాక్సియోస్ పేర్కొంది. ఇరాన్ అనుకూల హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాలకు బీరూట్‌లో ఉన్న బలమైన కమాండ్ కేంద్రాలపై ఆదివారం ఉదయం ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసి తీవ్ర నష్టం కలిగించింది. దీంతో ఇరాన్ తీవ్రంగా ఆగ్రహించి గంటల వ్యవధిలోనే తెల్లారకముందే ఉత్తర ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. ఇరాన్ ఆగ్రహంతో ఉందని, దాడులు చేస్తుందని ఐ.డి.ఎఫ్ సైనిక అధికారులు ముందుగానే గుర్తించారని, వారు అప్రమత్తంగా ఉన్నారని ఇజ్రాయెల్ ఆ తర్వాత ప్రకటించింది. యుద్ధం ముగించేందుకు ఒక ఒప్పందం చేసుకునే మధ్యవర్తిత్వ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతున్నందువల్ల దాడులు చేయవద్దని నెతన్యాహూను ట్రంప్ కోరారని ఆక్సియోస్ సంస్థ ప్రకటించింది.

**ఎన్‌బిసి ఇంటర్వ్యూ నుండి ట్రంప్ వాకౌట్**

ట్రంప్ తన యాటిట్యూడ్ చూపించారు. ఎన్‌బిసి యాంకర్ వెల్కర్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ, ఆమె అడిగిన ప్రశ్నలను భరించలేక ఆగ్రహం ఆణచుకుని ‘‘థాంక్యూ డార్లింగ్, ఇంతటితో ముగిద్దాం’’ అంటూ మైక్‌ను నేలమీదకు విసిరేసి బయటకు వాకౌట్ చేశారు. యుద్ధం గురించి, అమెరికాలో అంతర్గతంగా జరుగుతున్న పరిణామాల గురించి యాంకర్ వెల్కర్ అనేక ప్రశ్నలు అడిగారు. ఇందులో ట్రంప్‌కు అభ్యంతరకరమైన ఎన్నికల రిగ్గింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు కూడా ఉన్నాయి. ఐనాగానీ ఆయన సమాధానాలు చెప్పారు.2020లో జరిగిన ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిన విషయాన్ని ట్రంప్ సమర్థించుకున్నారు. అదేవిధంగా ఇప్పుడు కాలిఫోర్నియా ఎన్నికల్లో కూడా రిగ్గింగ్ జరుగుతోందని, ఇందుకు లెక్కింపు జాప్యమే ఒక ఆధారమని ట్రంప్ అన్నారు. వారు (డెమొక్రాట్లు) ఎన్నికల్లో మోసం చేస్తున్నారని ట్రంప్ అన్నారు. వీటికి ఆధారాలు చూపించాలని యాంకర్ ప్రశ్నించగా ట్రంప్ ఆగ్రహం చెందారు. మైక్ విసిరేసి వెళ్ళిపోయారు.

## ఆర్మేనియాలో ప్రధాని పాషిన్యాన్ మళ్ళీ గెలుపు

• ఇఎఇయులో కొనసాగుతామని ప్రకటన • యూరప్ దేశాల అభినందన



**ఎరెవాన్:** ఆర్మేనియా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్ నాయకత్వానగల అధికార ‘‘సివిల్ కాంట్రాక్ట్’’ పార్టీ కూటమి మళ్ళీ విజయం సాధించింది. ఫ్రాన్స్ సహా యూరోపియన్ దేశాలు పాషిన్యాన్‌కు అభినందనలు తెలియజేశాయి. సివిల్ కాంట్రాక్ట్ పార్టీ కూటమికి 49.81 శాతం ఓట్లు లభించగా, తామే గెలిచామని ప్రధానమంత్రి ప్రకటించుకున్నారు. వాస్తవానికి విజేతకు యాభైశాతం మేరకు ఓట్లు రావాలి. సామ్వేల్ కరపెట్యాన్ నాయకత్వానగల రష్యా అనుకూల ‘‘స్ట్రాంగ్ అర్మేనియా’’ పార్టీకి 23.29 శాతం ఓట్లు, ద ఆర్మేనియా రాజకీయ కూటమికి 9.9 శాతం ఓట్లు లభించాయి. 2023లో అజర్‌బైజాన్‌తో జరిగిన యుద్ధంలో ఘోరంగా ఓటమి పాలైన తర్వాత ఆర్మేనియాలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలు ఇవే. రష్యా నుండి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడులను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్న ప్రధానమంత్రి పాషిన్యాన్ దేశాన్ని యూరప్‌వైపు నడిపించాలని చాలా ధృఢంగా నిర్ణయించుకున్నారు. ఇక ఇప్పుడు అందుకు అనుగుణంగానే ఆయన అడుగులు వేస్తారు. 2018 నుండి పాషిన్యాన్ ప్రధానమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. ఆర్మేనియా ప్రజలు శాంతికి,ప్రాంతీయ ప్రగతికి, సహకారానికి ఓటు వేశారని ఆయన చెప్పారు. పశ్చిమ దేశాలతో సయోధ్యను,సహకారాన్ని కొనసాగిస్తామని, కానీ యూరేషియన్ ఎకనామిక్ యూనియన్(ఇఎఇయు)లో భాగస్వామ్యాన్ని,సభ్యత్వాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌లో చేరతారా? లేక రష్యా నాయకత్వానగల ఇఎఇయులో కొనసాగుతారో తేల్చుకోవాలని, ఈ విషయంలో త్వరగా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని మే నెలాఖరులో పాషిన్యాన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒక హెచ్చరిక చేశారు. యూరోపియన్ యూనియన్‌లో చేరాలనే జెలెన్స్కీ ఆలోచన కారణంగానే ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైందన్న విషయం కూడా పుతిన్ గుర్తుచేశారు. పశ్చిమ దేశాలతో చేతులు కలిపితే ఏస్థాయిలో ఆర్థిక ప్రయోజనాలను ఆర్మేనియా కోల్పోతుందో కూడా పుతిన్ ఒక జాబితా విడుదల చేశారు. ఆర్మేనియాకు రష్యా 1000 క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను 177.50 డాలర్లకే సరఫరా చేస్తుండగా, బయట మార్కెట్‌లో ఈ ధర 600 డాలర్లు దాటిపోయింది. పాషిన్యాన్‌కు 54 శాతం మేరకు ప్రజల మద్దతు ఉండగా ఈసారి ఎన్నికల్లో ఈ మద్దతు 30 శాతానికి తగ్గినప్పటికీ విజయం సాధించారు. అమెరికా మధ్యవర్తిత్వంలో గత ఏడాది అజర్‌బైజాన్–ఆర్మేనియా మధ్య శాంతి ఒప్పందం జరిగింది. ఈ శాంతి ఒప్పందం విషయంలో కూడా ప్రజలకు పాషిన్యాన్‌పై తీవ్ర అసంతృప్తి ఉంది. 2023లో జరిగిన యుద్ధంలో ఆర్మేనియా తన పర్వతప్రాంత కరాబాఖ్ భూభాగాన్ని అజర్‌బైజాన్‌కు కోల్పోయింది. ఈ భూభాగంకోసం 1990వ దశకంలో పోరాటం జరిగింది. ఈ అంశమే ఆర్మేనియా జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకఅంశంగా, ఆనాడు ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపించే అంశంగా మారిపోయింది.

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం: 32 మంది మృతి

• నేలమట్టమైన భవంతులు: విరిగిపడిన కొండ చరియ • సునామీ హెచ్చరిక



**మనీలా:** దక్షిణ ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఈ తీవ్ర ప్రకంపనలతో అనేకచోట్ల పలు చిన్న చిన్న భవంతులు నేలమట్టమయ్యాయి. ఇప్పటివరకూ 32 మంది మరణించినట్లు ధృవీకరించారు. శిథిలాలను తొలగించే సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మృతులసంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. రిచ్‌టర్ స్కేలుపై 7.8 తీవ్రతతో భూకంపం నమోదు కాగా, ఆ తర్వాత కూడా 6.1 తీవ్రతతో ప్రకంపనలు సంభవించాయి. ఒక్క దక్షిణ ఫిలిప్పీన్స్ ప్రాంతంలోనే 17 మంది మరణించారు. 200 మంది గాయపడ్డారు. గ్లాన్ పట్టణంలో ఉన్న పర్వత భాగాలు గ్రామాలలో ఇళ్ళపై కుప్పకూలిపోవడంతో 13 మంది మరణించారు. సారంగని గ్రామంలో మరో నలుగురు మరణించారు. ఈ ఏడాదిలో ఫిలిప్పీన్స్‌లో సంభవించిన అతిపెద్ద భూకంపం ఇదే. తక్షణం సహాయ బృందాలు రంగంలోకి దిగాలని, అన్ని కార్యకలాపాలను నిలిపివేయాలని ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్, మే నెలల్లో వేసవి సెలవుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలను సోమవారంనాడే తెరిచారు. వెంటనే ఈ భూకంపం సంభవించింది. భూకంపం కారణంగా 17 దేశీయ విమానాలను రద్దు చేశారు. వేలాదిమంది ప్రజలు ప్రాణ భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు ఆకస్మికంగా ఎగిరి పడటంతో టైర్లు బద్దలయ్యాయని డ్రైవర్లు భ్రమపడ్డారు. మిండనావోలో మూడు మీటర్ల ఎత్తున అలలు ఎగసిపడే ప్రమాదం ఉందని పేర్కొంటూ సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిండనావో ద్వీపానికి సమీపంలో 33 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. కాగా ఏడు లక్షలమంది జనాభాగల రేవు ప్రాంత నగరం జనరల్ సాంతోస్‌లో ఈ ప్రకంపనలు తీవ్రంగా ఉన్నాయి. ఒక భవనం జనం కళ్ళముందే పేకమేడలా కుప్పకూలిపోయింది. సునామి కారణంగా ఒక తీరప్రాంత గ్రామంనష్టపోయింది. ఈ ఘటనతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. పలుచోట్ల భవంతులు కూలిపోయాయి. ఇండోనేసియా, జపాన్ ప్రాంతాలలో కూడా సముద్ర అలలు ఎగసిపడ్డాయి.ప్రపంచంలో భూకంప ప్రమాదం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఫిలిప్పీన్స్ కూడా ఒకటి. ఇక్కడ అగ్నిపర్వతాలు కూడా బద్దలవుతాయి. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో ఈ దేశం ఉంది. ప్రతి ఏడాదీ ఫిలిప్పీన్స్‌ను దాదాపు 20 భయంకరమైన తుఫానులు గడగడలాడిస్తాయి.

## అఖిలపక్షం (మొదటి పేజీ తరువాయి)

చేస్తామని ఖర్గే చెప్పారు. విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ, కూటమికి చెందిన ఇతర సీనియర్ నాయకులతో కలిసి మాట్లాడిన ఖర్గే, తాము ఐదు అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చామని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్), ఓట్ల అక్రమ తరలింపు, ఎన్నికల అపహరణ వంటి అంశాలపై త్వరలో భారత ప్రధాన న్యాయమూర్తికి (సిజెఐ) లేఖ పంపుతాము అని చెప్పారు. నీట్, సిబిఎస్‌ఇ పరీక్షలకు హాజరైన లక్షలాది మంది యువతకు జరిగిన ద్రోహానికి బాధ్యత వహించాల్సిన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలని కూడా ఏకగ్రీవంగా నిర్ణయించామన్నారు. అలాగే, దేశం లో ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న అకృత్యాలపై చర్చించడానికి కేంద్రం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. తాము ప్రజలకు సంబంధించిన అనేక అంశాలను లేవనెత్తబోతున్నామని, దీనికి అన్ని పార్టీలు ఏకగ్రీవంగా అంగీకరించాయి అని ఆయన చెప్పారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని నిర్ణయించుకున్నామని, తదుపరి సమావేశం ఆగస్టులో హైదరాబాద్‌లో జరుగుతుంది, దాని తేదీని తర్వాత ఖరారు చేస్తామన్నారు. ‘రాబోయే పార్లమెంటు వర్షాకాల సమావేశాల సమయంలో కూడా సమన్వయాన్ని కొనసాగించాలని, ప్రతిపక్ష నాయకుడి కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం సమావేశాలు నిర్వహించాలని ప్రతిపక్ష నాయకులు నిర్ణయించారు’ అని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రతిపక్ష నాయకులందరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించారని ఆ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నారు. ఇండియా బ్లాక్‌లోని కొన్ని భాగస్వామ్య పక్షాల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె ఓటమి తర్వాత, బిజెపి ఎదుర్కొనేందుకు ఐక్యతను పెంపొందించడానికి, తమ వ్యూహాన్ని పునఃసమీక్షించుకోవడానికి, అలాగే అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడానికి నాయకులు ఈ చర్చలను ప్రారంభించారు. ఈ సమావేశానికి హాజరైన వారిలో కాంగ్రెస్ నుండి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నుండి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ నుండి అఖిలేష్ యాదవ్, ఆర్‌జెడి నుండి తేజస్వి యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నుండి ఒమర్ అబ్దుల్లా, పిడిపి నుండి మెహబూబా ముఫ్తీ, ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే, సిపిఐకి చెందిన డి. రాజా, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్, కొన్ని చిన్న పార్టీల నాయకులు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. కాగా, ఉద్ధవ్ థాక్రే, హేమంత్ సోరెన్ వర్చువల్‌గా చేరారు. ప్రతిపక్ష కూటమి నుంచి వైదొలగినందున డిఎంకె, ఆప్ ఈ చర్చల్లో పాల్గొనలేదు. తమిళనాడు అధికార పార్టీ టివికె కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు. అసలు ఇండియా కూటమిలో ఉన్నవారిని సమావేశానికి ఆహ్వానించినట్లు వర్గాలు తెలిపాయి.

**ఐక్యతను బలోపేతం చేసుకోవాలి : ఖర్గే**

సోమవారం సమావేశం ప్రారంభం కాగానే పలు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇండియా కూటమిలో ఐక్యతను నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం, ప్రజల జీవనోపాధికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడం అవసరమని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తూ మోదీ ప్రభుత్వ దుష్పరిపాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను ఎదుర్కోవడానికి నాయకులు ఐక్యతను బలోపేతం చేసుకోవాలని కోరారు. రాజ్యాంగంపై దాడి కొనసాగుతోందని, రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి, భయపెట్టడానికి, బెదిరించడానికి దర్యాప్తు సంస్థలను నిరంతరం సాధనాలుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. ఆర్థిక వాతావరణం అత్యంత ప్రతికూలంగా ఉందని, కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి అవసరమైన వేగంతో కొత్త పెట్టుబడులు రావడం లేదని కూడా ఆయన నొక్కి చెప్పారు. లక్షలాది మంది యువత ఆశలు, ఆకాంక్షలను దెబ్బతీసిన పరీక్షా విధానంలోని పూర్తి దుర్వినియోగాన్ని కూడా కాంగ్రెస్ అధినేత ఎత్తి చూపారు. ‘2026 ఏప్రిల్ 17న, డీలిమిటేషన్‌పై మోదీ ప్రభుత్వ దురుద్దేశపూర్వక బిల్లులను ఓడించడానికి మనమందరం దృఢంగా ఏకమై, లోక్‌సభలో ఐక్యతను, సంఘీభావాన్ని చాలా నిర్ణయాత్మకంగా ప్రదర్శించామని గుర్తు చేశారు. ‘మోదీ ప్రభుత్వ దుష్పరిపాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను మనం ఎదుర్కోగలిగేలా, ఇప్పుడు మనం అదే స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలి’ అని ఖర్గే అన్నారు.

## అభివృద్ధి చేసుకుందాం
(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)ని కోర్, అర్బన్, రీజియన్ (క్యూర్)గా విభజించామని వెల్లడించారు. దేశం 140 కోట్ల జనాభా, 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో విస్తరించి ఉన్నప్పటికీ, ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ నగరాలే భరత ప్రభుత్వాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయన్నారు. ఈ ప్రధాన నగరాల్లో ఢిల్లీ కాలుష్యంతో, చెన్నై వరదలతో, కలకత్తా శాంతి భద్రతల సమస్యతో, బెంగళూరు ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నాయన్నారు. ప్రధాని నివాసముండే దేశ రాజధాని కాలుష్య సమస్యతో స్కూళ్లు మూసివేసే పరిస్థితి దాపురించిందని గుర్తు చేశారు. ఓఆర్‌ఆర్ లోపల హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతో విస్తరించి ఉండటం వల్ల, అభివృద్ధి, పాలన విషయంలో ఇబ్బందులు ఎదురుక్కొన్నాయన్నారు. ఈ నేపథ్యంలో నిపుణుల సలహా మేరకు పద్ధతి ప్రకారం, పాలన సౌభల్యం 150 డివిజన్ల తో జిహెచ్‌ఎంసి, మరో 76 డివిజన్లతో సైబరాబాద్, 74 డివిజన్లతో మేడ్చల్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేషన్‌లో ఏర్పాట్లుతో పాటు అందుకు అనుగుణంగా పోలీస్ కార్పొరేషన్‌లను సైతం ఏర్పాటు చేశామని సిఎం గుర్తు చేశారు. ‘విశ్వనగరం అని గొప్పలు చెప్పుకుంటే సరిపోదు అందుకు అనుగుణంగా అభివృద్ధి జరగాలి. అందుకే, మెట్రో రెండో దశ విస్తరణ చేపడుతున్నాం. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌లో లక్ష ఎల్‌ఐజి, ఎంఐజి ఇళ్లను కట్టి పేదల కష్టాలు తీరుస్తాం. ఎక్కడ ఉన్న వారికి అక్కడే ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి విడిపించి అక్కడి పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళికలు వేస్తున్నాం. రాబోయే 24 నెలలు అభివృద్ధిపైనే మా దృష్టి ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి’ అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**మరి మీరేం చేశారు?**

తెలంగాణ నుంచి 8 మంది బిజెపి ఎంపిలను పంపిస్తే మోదీ ప్రధాని అయ్యారు. మరి ఆ ఎంపిలు తెలంగాణకు ఏం తీసుకొచ్చారు. రెండేళ్లలో ఏం చేయలేదని నన్ను అంటున్నారు.. మరి మీరేం చేశారు? నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుపుల్ల పెట్టారు. సబర్మతి, గంగా, యమున నదులను ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అన్నారు. మూసీ ప్రక్షాళనకు సహకరించమని బిజెపి ఎంపిలు మోదీని అడిగారా? పదేళ్ల కెసిఆర్ పాలన, పన్నెండేళ్ల మోదీ పాలన, 30 నెలల మా పాలనపై చర్చకు సిద్ధం. **ఎవరేం చేశారో.. ఎన్ని నిధులు తెచ్చారో చర్చిద్దాం రండి’ అని సవాల్ విసిరారు.**

నియోజకవర్గాల పునర్విభజనలో శేర్లింగంపల్లి, కుత్బుల్లాపూర్,కూకట్‌పల్లి నియోజకవర్గాల పరిధిలో 10 కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉందని, అందుకు వేదికపైనున్న నాయకులందరూ పోటీ చేసేందుకు అవకాశం వస్తుందన్నారు.

**పివి బీజం వేశారు : మంత్రి శ్రీధర్ బాబు**

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితమే భారత మాజీ ప్రధాని పివి నరసింహారావు నాయకత్వంలో ఐటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో బీజం వేసిందన్నారు. హైదరాబాద్ లో ప్రస్తుతం 1500 ఐటి కంపెనీలు, 10 లక్షల మంది ఐటి నిపుణులు పనిచేస్తున్నారని, వారికి ఎలాంటి అవసరాలైన సమకూర్చి పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్ కుమార్ యాదవ్, తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, బండి రమేష్, స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, మున్సిపాల్, రెవెన్యూ, రోడ్లు భవనాలు, విద్య, శాఖల ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

## కొత్త వ్యూహాలు (మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతల నేపథ్యంలో కమ్యూనిస్టు, సెక్యులర్, సోషలిస్టు శక్తుల మనుగడ అత్యంత కీలకమన్నారు. ఈనెల 6వ తేదీన కాక్రోచ్ జనత పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజి, సిబిఎస్‌ఈ ఘటనలపై యువత పెద్ద ఎత్తున నిరసన తెలిపిన సందర్భంగా వారు ప్రధానంగా 5 డిమాండ్లను ప్రభుత్వ ముందు పెట్టారన్నారు. అందులో ఒక పార్టీ గుర్తుపై ఎన్నికై తర్వాత మరో పార్టీలో చేరే ప్రజాప్రతినిధులను 20 ఏళ్ల పాటు పోటీకి అనర్హులుగా ప్రకటించాలని, ఈ దేశంలోని 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికి ఓటు కల్పించాలని, దానిని ఎన్నికల కమిషన్ తొలగిస్తే కమిషనర్లపై ‘ఉపా’ చట్టం కింద కేసులు నమోదు చేసేలా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత పెంచాలని సూచించారన్నారు. మీడియా సంస్థలు ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యతను మరవకూడదని, ప్రజల సమస్యలను ప్రతిబింబించే స్వతంత్ర మీడియాకు మాత్రమే అనుమతించాలని కార్పొరేట్ మీడియా సంస్థలను నిషేధించాలని డిమాండ్ చేశారని వివరించారు. భారత వామపక్ష రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు చంద్ర రాజేశ్వర రావు వ్యక్తిగత జీవితం, రాజకీయ జీవితం, ప్రజాసేవలో ఆదర్శప్రాయుడని శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. సిఆర్ కేవలం కమ్యూనిస్టు నాయకుడే కాకుండా రాజకీయ నైతికతకు, నిరాడంబర జీవనానికి ప్రతీకగా నిలిచారన్నారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ దేశ సమైక్యతకు ఎనలేని కృషి చేసిన మహానేత చంద్ర రాజేశ్వరరావు అని కొనియడారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం తాత్కాలికం కాదని, యువతలో పెరుగుతున్న అసంతృప్తి, రాజ్యాంగబద్ధ సంస్థలపై నమ్మకం క్షీణించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలని ఆయన హెచ్చరించారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో కూడా ఇదే తరహా ప్రజా అసంతృప్తి కనిపించిందని వివరించారు. యువతలో పేరుకుపోతున్న అసంతృపిని ప్రభుత్వం అర్థం చేసుకుని పరిష్కరించకపోతే అది దేశ రాజకీయ, సామాజిక పరిస్థితులను గణనీయంగా ప్రభావితం చేయగలదన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు జీవితం ఉద్యమ కార్యకర్తలకు ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని అన్నారు. సిఆర్ తన 80 ఏళ్ల జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గత25 ఏళ్లుగా సిఆర్ ఫౌండేషన్‌లో నివాసం ఉంటున్న ప్రొఫెసర్ వేణుగోపాల్, డాక్టర్ రంగనాయలను ఘనంగా సన్మానించారు.

## ల్యాడిలో పేలుడు
(మొదటి పేజీ తరువాయి)

గోల్డ్ కుమార్, కాంట్రాక్టు కార్మికులు రమణ, త్రినాథ్, ఎన్.అప్పలరాజు మతి చెందినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ప్రమాదంలో ఇంకా ఎవరయినా చిక్కుకున్నారా అని వెతుకుతున్నట్లు అధికారులు తెలియజేశారు. కాగా ప్రమాదంలో గాయపడిన వారిని రావూరి మల్లికార్జున రావు, పల్లెల శ్రీనివాస్, అర్జున అప్పారావు, సత్యనశీద్, సూరిబాబు, పైడిరాజుగా గుర్తించారు. 1500 హీట్ డిగ్రీల వేడితో వెళుతున్న స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ పేలడంతో ప్రమాదం జరిగినట్టు తెలిసింది. ఈ ఘటనతో ఒక్కసారి భయంతో కార్మికులు, ఉద్యోగులు పరుగులు తీశారు. అగ్నిపమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పాయి. ప్రమాద స్థలాన్ని హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, సీపీ సందర్శించారు. తదుపరి ఎలాంటి ప్రమాదం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదానికి పూర్తి కారణం యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరేనని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. కాలం చెల్లిన యంత్రాలు, నాసిరకం ముడి సామాగ్రి వాడటం, ఎప్పటికప్పుడు యంత్రాలను నిర్వహణ చేయకపోవడం ప్రధాన కారణాలుగా ఉన్నాయి. వీటి ఫలితంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈసారి జరిగిన ప్రమాదం భారీ వల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. తక్షణమే ప్రమాదానికి గల కారణాలపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీసీ నాయకులు డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. మతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇటువంటి ప్రమాదాలు పునరావతం కాకుండా కట్టు దిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. నాణ్యతను తనిఖీ చేసే వారు లేకపోవడం, అనుభవం లేని కొత్త కాంట్రాక్ట్ కార్మికులను పెట్టడం, యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, కార్మికులు, ఉద్యోగ సంఘాల నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రధాని మోదీ, చంద్రబాబు విచారం**

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై అధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. అనేక మంది కార్మికులు చనిపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కాగా జిల్లా కలెక్టర్ , నగర పోలీస్ కమిషనర్ సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు.

## బొగ్గు రంగం కీలకం
(మొదటి పేజీ తరువాయి)

చేపట్టి దేశాన్ని ప్రపంచంలో రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగా తీర్చిదిద్దామని తెలిపారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత యుపిఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలకు కేంద్రబిందువుగా మారిందని ఆరోపించారు. రూ.1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బయటపెట్టిందని, అనంతరం సుప్రీంకోర్టు అప్పటి బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శక వేలం విధానాన్ని అమలు చేసి, బొగ్గు రంగాన్ని పూర్తిగా సంస్కరించామని చెప్పారు. ప్రస్తుతం దేశంలో 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఇవి దాదాపు 85 రోజుల విద్యుత్ అవసరాలకు సరిపోతాయని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో 72 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం 426 బొగ్గు గనుల్లో ఉత్పత్తి కొనసాగుతోందని, గత రెండు సంవత్సరాల్లో బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడం ద్వారా రికార్డు నెలకొల్పామని తెలిపారు. బొగ్గు దిగుమతులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, గత ఏడాది దిగుమతులు 4 శాతం తగ్గడం వల్ల రూ.60 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యిందని వివరించారు.

**కోల్ గ్యాసిఫికేషన్‌కు రూ.46 వేల కోట్ల ప్రోత్సాహకాలు..**

బొగ్గు రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తూ కోల్ గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.46 వేల కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా అమ్మోనియా, హైడ్రోజన్, ఎరువులు, పెట్రోకెమికల్స్ వంటి ఉత్పత్తులు తయారవుతాయన్నారు. కోల్ గ్యాసిఫికేషన్‌పై పెట్టుబడులను ఆకర్షించేందుకు జూన్ 11న హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్యం తర్వాత నిర్లక్ష్యానికి గురైన పాత బొగ్గు గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 2028 నాటికి 147 పాత గనుల మైన్ క్లోజింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కొన్ని ప్రాంతాలను జలాశయాలు, మరికొన్ని ప్రాంతాలను సోలార్ పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గనుల రంగంలో భవిష్యత్తు క్రిటికల్ మినరల్స్‌దేనన్నారు. మంత్రి, రూ.32 వేల కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం భారత్ కీలక ఖనిజాల అవసరాల్లో 93 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఖనిజ బ్లాకుల కొనుగోలుకు ‘కాబిల్’ సంస్థను ఏర్పాటు చేశామని, అర్జెంటీనాలో కీలక ఖనిజ బ్లాకులను సొంతం చేసుకున్నామన్నారు. సింగరేణి సంస్థకు సంబంధించి గత రెండేళ్లుగా వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. కార్మికుల ప్రమాద బీమా పరిమితిని రూ.3040 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకు పెంచినట్లు చెప్పారు. తెలంగాణలో భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్నును ప్రభుత్వమే భరిస్తుందని మరోసారి ఆయన హామీనిచ్చారు. ప్రైవేట్, కమర్షియల్ మైనింగ్‌కు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయని కిషన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం బొగ్గు రంగంలో సుమారు 5 లక్షల మందికి ప్రత్యక్షంగా, 25 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని తెలిపారు.



## ఫీజు నియంత్రణ చట్టం తెవాలి

### ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి : పేరబోయిన మహేందర్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాన్ని తెచ్చి ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గణేష్ నాయక్‌కి మెమోరాండం సమర్పించి మా ట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అధ్యాపకుల కొరత, మౌలిక సమస్యలతో విద్యాసంస్థలను బలహీనపడుతున్నాయన్నారు. తక్షణమే విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాలకు బదులుగా శాశ్వత ఉద్యోగాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులతో విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిపిఐ మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, గీతా పనివారల సంఘం మండల కార్యదర్శి గుండు వెంకటేష్,గోపగాని రాజు,ఏఐవైఎఫ్ మండల నాయకులు అనంతుల నరసింహ, శ్రీను, కంబాల రాజు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : శాంతి కుమార్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఈ)ను అనేక ప్రైవేట్ పాఠశాలలు ఉల్లంఘిస్తూ, విద్యాసంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చి, పేద , మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అలాగే, సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం బడుగు బలహీన పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రతి ఒక్క ప్రైవేట్ స్కూల్లో 25% ఉచిత నిర్బంధ విద్య అందజేయాలని చట్టంలో ఉన్నజిల్లాలో ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రతినెలా 9న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ప్రతినెల 9వ తేదిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ పెండెం వెంకటరమణ తెలిపారు. సోమవారం జిల్లా కార్యాలయంలో వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రధానంగా హైరిస్క్ గర్భాలను ముందుగానే గుర్తించి తగిన వైద్య పరీక్షలు చేయించాలన్నారు. చికిత్స, పర్యవేక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తపోటు, రక్తహీనత, మధుమేహం వంటి పరీక్షలు చేసి అవసరమైన వైద్యసలహాలు, మందులు ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలో గర్భిణీలను గుర్తించి పిఎం ఎస్ఎంఎస్ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా 2వ, 3వ త్రైమాసికంలో ఉన్న గర్భిణీలు తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ఆరోగ్య సంస్థను సంప్రదించి ఉచిత వైద్య సేవలు పొందాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత గర్భిణీ సేవలను సద్వినియోగం చేసుకొని తల్లి, శిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాచీన కట్టడాలే లక్ష్యం

### గుప్త నిధుల కోసం తవ్వకాలు...ఎడవెల్లిలో కలకలం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పురాతన ప్రాచీన కట్టడాలే లక్ష్యం గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు భారీగా తవ్వకాలు జరిపారు. మండలంలోని ఎడవెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 148లోగల గుడి,దర్గాకు చెందిన భూమిలోఆంజనేయ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న గుమ్మటం దర్గా పరిధిలో సుమారు పది అడుగులకు పైగా లోతుగా గుంతలు తవ్వినట్లు గుర్తించారు.ఘటనా స్థలంలో పలుచోట్ల పూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని,గొర్ల కాపరులు,చుట్టుపక్కల పొలాల రైతులు చూసి భయాందోళనకు గురవుతున్నారు.ఈప్రాంతం అమ్మనబోలు రోడ్డుకు సుమారు అర కిలోమీటర్ దూరంలో నిర్మానుష్యంగా ఉంది.గత కొంతకాలంగా రాత్రి వేళల్లో ఆంజనేయ స్వామి దేవాలయం, దర్గా వద్ద తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాత్రిపూట భారీ శబ్దాలు, కుక్కల అరుపులు వినిపిస్తున్నాయని సమీప కాలనీవాసులు తెలిపారు. గుప్త నిధుల పేరుతో జరుగుతున్న ఈ అక్రమ తవ్వకాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఈప్రాంతంలో నిఘా పెంచాలని,పోలీస్ గస్తీ ఏర్పాటు చేసి దుండగులను పట్టుకోవాలని,పురాతన ప్రాచీన కట్టడాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అధిక ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తన సంపూర్ణ మద్ధతునిస్తుందని ఆ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కాంపాటి వెంకటయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు నెలల వ్యవధిలో డోమెస్టిక్ సిలిండర్ రూ.89 ధర పెరిగిందని, కమర్షయల్ సిలిండర్ ధర రూ.2వేల వరకు పెరిగిందన్నారు. పెట్రోల్ లీటర్‌కు రూ.10, డిజిల్ లీటర్‌కు రూ.10 చొప్పున పెంచిన సామాన్య ప్రజల బ్రతుకు చిద్రం చేసిందన్నారు. రోజుకు రెండుసార్లు ఉపాధి పనిలో పాల్గొనాల్సి రావడం రోఝుకు రెండుసార్లు ఫోటో దిగాల్సి రావడం చూస్తుంటే పథకాలు ఎత్తివేసేందుకు కేంద్రం సర్వసిద్ధంగా ఉందని అర్థమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు ప్రజా సంఘాలుగా తమ సంపూర్ణ మద్ధతు ఉంటుందని తెలిపారు.

## ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలం

### ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి : ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

### మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ సత్యం, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్ అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలంటూ ఎఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. అఖిల భారత యువజన సమాఖ్యకు మద్ధతుగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొని మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నిరుద్యోగ యువత వయోపరిమితి దాటిపోతూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వం ఖాళీలపై పూర్తి వివరాలు వెల్లడించకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా యువతకు ఉద్యోగ భద్రతను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిద్వారా నిరుద్యోగ యువత పట్ల అన్యాయం మాత్రమే కాకుండా ప్రజా సేవల నాణ్యతను కూడా దెబ్బతీస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం, మౌలిక వసతుల కొరత, నిధుల లోపం కారణంగా ప్రభుత్వ విద్య బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయమని ఆరోపించారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలోని అన్ని శాఖల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని, టిజిపిఎస్‌సి ద్వారా వార్షిక నియామక క్యాలెండర్ ప్రకటించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు పరిక భరత్, బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధరల పెరుగుదలకు బిజెపి ప్రభుత్వమే కారణం



సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండలం కేంద్రంలో సిపిఐ మండల సమితి సమావేశం సుర్వి నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైసిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే నిత్యవసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని దామోదర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, కూరగాయలు, పప్పు ధాన్యాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తుందని ఆరోపించారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెరిగిన ధరలను దించాలని ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెరిగిన ధరల కారణంగా కార్మికులు రైతులు మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు ఇటీవల దేశవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ధరలు పెరుగుదలపై ఆందోళనలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పన్నులను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ శాఖలను పటిష్టం చేయాలని ప్రజాసంఘాల బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, మంచాల జంగయ్య, మంచాల సైదులు, గ్రామ శాఖల కార్యదర్శులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు దిగులు పడొద్దు..

### వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి

### అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు నిర్ణయం మేరకు అన్ని సెంటర్లలో వారంలోనే ధాన్యం సేకరణ పూర్తి చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని భువనగిరి కలెక్టర్ వెంకారెడ్డి పునరుద్ఘాటించారు. సోమవారం జరిగిన మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సోమవారం జరిగిన గ్రామ సభలో ధాన్యం కొనుగోళ్లు నేటికీ 50% పూర్తికానందున తీవ్ర జాప్యం జరిగినందుకు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శివారెడ్డి గూడెం గ్రామపంచాయతీ గ్రామ సభలో రైతులు అధికారులను నిలదీస్తూ గ్రామ సభ పూర్తి అయినా కూడా అధికారులను వెళ్ళనీయకుండా హామీ ఇచ్చేంతవరకు పట్టుబట్టారు. తరుగు పేరిట రైస్ మిల్లర్లు బస్తాల కొద్ది ధాన్యాన్ని తూకంలో తగ్గిస్తున్నారని ఆవేదన చెందిన నేపథ్యంలో తాసిల్దారు శ్రీనివాస్ రెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రమణి అసిస్టెంట్ ఆఫీసర్ బాలమణిలతో కలిసి ఇంద్రియాల గ్రామ పరిధిలో గల శ్రీ కన్యకా పరమేశ్వరి రైస్ మిల్ వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని అదనపు కలెక్టర్‌కు ఫోన్లో చెప్పిన వెంటనే కలెక్టర్ రైస్ మిల్లు వద్దకు వచ్చి యజమాన్యానికి సర్ది చెప్పి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలలో సేకరణ పూర్తయినట్లు తెలిపారు. వారం రోజుల్లోగా పూర్తి చేసి మిల్లర్లకు తరలిస్తామని తెలిపారు.

## నల్లగొండలో విషాదం

### కొడుకును చంపి తండ్రి ఆత్మహత్య



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :పట్టణంలోని దేవరకొండ రోడ్డులో సోమవారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది.13 ఏళ్ల కుమారుడు ప్రణీత్ రెడ్డిని సుత్తితో కొట్టి చంపిన తండ్రి లింగారెడ్డి అనంతరం విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పని చేస్తున్న లింగారెడ్డి దేవరకొండ రోడ్డులో నివాసం ఉంటున్నాడు.ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి 8వ తరగతి చదువుతున్నాడు.కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి లింగారెడ్డి కొడుకు ప్రణీత్ రెడ్డిని సుత్తితో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.అనంతరం పశ్చాత్తాపంతో లింగారెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## పోచంపల్లి కో- ఆపరేటివ్ బ్యాంకుకు మూడు ఉత్తమ జాతీయ అవార్డులు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : లక్నోలో జరిగిన భారత రత్న సహకారిత సమ్మాన్ 2026 ప్రతిష్టాత్మక అవార్డులలో పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంకుకు మూడు ఉత్తమ జాతీయ అవార్డులు వరించాయి. జూన్ 5 నుండి జూన్ 7 వరకు ఎంతో అట్టహాసంగా నిర్వహించిన జాతీయ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనం 2026లో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కు బెస్ట్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్, బెస్ట్ చైర్మన్ ఆఫ్ ద ఇయర్, బెస్ట్ ఎన్పీఏ మేనేజ్మెంట్ మూడు అవార్డులను లక్నో ఎమ్మెల్యే పుకాన్ చేతుల మీదుగా బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ లు అందుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డుల ప్రధానోత్సవంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సురేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నరసింహ పాల్గొన్నారు. .బ్యాంకు కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా దిన దినాభివృద్ధి చెందుతూ ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రతి ఏటా అవార్డులు అందుకోవటం పట్ల ఖాతాదారులు వాటాదారులు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## 17న డిండి ప్రాజెక్ట్ ఆయకట్టుకు నీటి విడుదల

### అఖిల పక్షం, రైతుల సమావేశంలో తీర్మాణం



**ప్రజాపక్షం/డిండి:** డిండి ప్రాజెక్ట్ ఆయకట్టు రైతాంగానికి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల పంటలకు నీటిని విడుదల చేసేందుకు సోమవారం డిండి మండల కేంద్రంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో అఖిల పక్ష పార్టీ నాయకులతో, ఆయకట్టు రైతులతో కలిసి అధికారులు సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ సంబంధించి పంటకు పూర్తిస్థాయిలో నీటి విడుదల చేసేందుకు ఈనెల 17న నీటి విడుదలకు ముహూర్తం ఖరారు చేశారు. 17వ తేది లోపు ప్రాజెక్టు మెయిన్ కెనాల్‌లో ఉన్నటువంటి పూడికను తీసేందుకు అధికారుల హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ పంటకు 120 నుండి 130 రోజుల వరకు నీటిని అందించేందుకు అన్ని విధాలుగా సిద్ధం కావాలని అధికారులకు రైతులు అఖిల పక్ష పార్టీల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డిఈ హన్మంత్‌రావు, ఏఈలు పరమేష్, వెంకటేష్, వర్క్ ఇన్స్పెక్టర్ కర్ణాకర్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు వెంకటేశ్వర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు బుచ్చిరెడ్డి, బిఆర్ఎస్ మండల నాయకులు కృష్ణయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మైనోద్దీన్, డిండి ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ రుక్మారెడ్డి, సర్పంచ్ రవి, శైలేష్, వెంకట్‌రెడ్డి, సలయ్య, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మ ణ్, రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డిద, భాస్కర్ రావు పాల్గొన్నారు.

## సంక్షోభంలో కాంట్రాక్టర్ల కుటుంబాలు

### పెండింగ్ బిల్లుల చెల్లింపుకై 18న చలో హైదరాబాద్ : ఎస్ఎన్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ** : డ్రైనేజీ పనుల నుండి డ్యాముల నిర్మాణం వరకు వివిధ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖలలో పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా పాస్ట్ ప్రెసిడెంట్ ఎస్ఎన్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ డివిఎన్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని వెంకటరమణ రెసిడెన్సీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపుల్లో తీవ్రజాప్యం, చెల్లింపులపై అనిశ్చితి కారణంగా కాంట్రాక్టర్లు, వారి కుటుంబాలు సంక్షోభంలో చిక్కుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుకై ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.20,000 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయని,వాటిని ఎటువంటి ప్రభావాలు,సిఫార్సులు లేదా వివక్ష లేకుండా క్రమ సంఖ్య సీనియారిటీ ఆధారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ముందు వచ్చిన బిల్లుకు ముందు చెల్లింపుఅనే సూత్రాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను క్రమ సంఖ్య ప్రకారం పారదర్శకంగా విడుదల చేసి నిర్మాణ రంగాన్ని,తద్వారా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని కాపాడాలని విజ్ఞప్తి చేశా రు. జూన్ 18న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు,నిర్మాణ రంగానికి చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస రావు,ట్రెజరర్ జిసంతోష్ రెడ్డి, వి. శ్రీనివాస్ రెడ్డి, ఎస్ కృష్ణారావు, జిల్లా నాయకులు పాదూరి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్ఓ వెంకటరమణ, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ పాల్గొన్నారు.



### ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 72 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 48, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్ 3, గ్రామీణ అభివృద్ధి 3, పిడి హౌసింగ్ 3, సంక్షేమ శాఖ 2, వ్యవసాయ, ఇరిగేషన్, ఉపాధి కల్పన, విద్య, బీసీ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , ఆర్డీవో శేఖర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, గడువు తీరిన మందులపై ఉక్కుపాదం...



**ప్రజాపక్షం/నెక్కొండ:** రైతుల భవిష్యత్తును నిర్ణయించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల స్పష్టం చేశారు. నెక్కొండ మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు తదితర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. గడువు తీరిన పురుగు మందులను చట్ట నిబంధనల ప్రకారం ప్రత్యేకంగా నిల్వ చేయాలని, ఎరువుల నిల్వ వివరాలను ఈ పాస్ యంత్రం, స్టాక్ రిజిస్టర్లలో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే చర్యలు లేదా నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారిఎనగారాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి: సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/ నల్లబెల్లి :** రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు కాంగ్రెస్ ఏర్పడిన నాటి నుండి పేరుకుపోయిన 12 వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంటు బకాయిలు వెంటనే చెల్లించాలని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా సిపిఐ మండల పార్టీ కార్యదర్శి సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక పోవడంతో ప్రవేట కళాశాల యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు . దీనితో ఒక్కో విద్యార్థి కుటుంబంపై అదనంగా 40 వేల రూపాయల భారం పడుతుందని తెలిపారు . రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి వాటిని పట్టించుకోవడం లేదని అరోపించారు . సిపిఐ మండల పార్టీ నా యకులు కోర్నేల్ ,క్రాంతికుమార్ ,రత్నం ,కుమారస్వామి ,అయిలయ్య పాల్గొన్నారు .

## నీట్ పరీక్షకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు : కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జూన్ 21న నిర్వహించనున్న నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ నీట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షకు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, జిల్లాలో మొత్తం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎబివి డిగ్రీ కళాశాల, పెంబర్తిలోని మహాత్మ జ్యోతి రావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో మొత్తం 588 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటల నుండి 5:15 వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షకు సమయానికి ముందే చేరుకోవాలని, అనుమతించని వస్తువులు తీసుకురాకూడదన్నారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష సిటీ కో ఆర్డినేటర్, ఎబివి కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ రవీంద్ర నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:-** జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోదామును గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్‌ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పని తీరు, అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పా టు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పు స్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఇవిఎంలు, వివి ప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇవిఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎండి సలీం, డిప్యూటీ తహసీల్దారు నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న లారీ డ్రైవర్లు

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** జయశంకర్‌జిల్లా మహాదేవపూర్ మండలంలోని ఇసుక క్వారీల్లో ఇసుక లోడింగ్‌లో చేస్తున్న జాప్యం,ఎండ తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు ఎగుర్కొంటున్నారని లారీ సంఘం అధ్యక్షుడు ఓడేటి భరత్ రెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.ఇసుక క్వారీలకు వస్తున్న వందలాది లారీలను సమయానుకూలంగా లోడింగ్ చేయకపోవడంతో రోజుల తరబడి నిలిచిపోతున్నాయని క్వారీల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా జాప్యం చేస్తుండడంతో ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు.క్వారీల నిర్వహణలో సరైన ప్రణాళిక లేకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని,క్వారీల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసారు.

# నేడు స్టేషన్‌ఘనపూర్‌లో భట్టి విక్రమార్క పర్యటన

### రూ.60.62 కోట్ల పనులకు శంకుస్థాపన ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కడియం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంగళవారం జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 60.62 కోట్ల రూపాయలతో నిర్మాణం చేసిన, చేయనున్న 7 సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ప్రారంభించనున్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో సోమవారం స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామంలో సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తారని, అక్కడే బహిరంగ సభ జరుగుతుందన్నారు. అక్కడే మీడియా సమావేశం నిర్వయించడంతో పాటు స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోన వేలేరు మండలం పీచరలో 132/33 సబ్ స్టేషన్, చిల్పూర్ మండలంలోని కొండాపూర్, జఫర్‌గడ్ మండలం సాగరం, రఘునాథపల్లి మండల కుర్చపల్లి గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్లను ప్రారంభిస్తారన్నారు. చిల్పూర్ మండలం లింగంపల్లి, పల్లగుట్ట, నష్కల్ గ్రామాల్లో 33/11 కెవి సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేస్తారన్నారు. అదే విధంగా 7 మండలాల్లో ఇళ్లపై వెళ్తున్న 33/11 కెవ సర్వీస్ లైన్ల షిఫ్టింగ్ సమస్య, రఘునాథపల్లి మండల కేంద్రంలో 132/33 కెవి సబ్ స్టేషన్‌ను 220/132 కెవి సబ్ స్టేషన్‌ను అప్ గ్రేడ్ చేయాలని మంత్రిని కోరనున్నట్లు కడియం తెలిపారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో 90 శాతం విద్యుత్ సమస్య పరిష్కారం కావడం, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఒకే రోజు 7 సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయని, ప్రజల పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ పాటు చిల్పూర్ ఆలయ కమిటీచైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ రంగంలో కొత్త మైలురాయి: ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి

ఒకే రోజు 60.62 కోట్ల రూపాయల విలువైన 7 సబ్ స్టేషన్ల ప్రారంభం శంకుస్థాపన విద్యుత్ రంగంలో కొత్త మైలు రాయి అని ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 60 వేల 838 మంది వినియోగదారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలగనుందన్నారు. వ్యవసాయ, వాణిజ్య, గృహ, పారిశ్రామిక వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగనుందన్నారు. ప్రజలకు అత్యుత్తమ విద్యుత్ సేవలు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఈ సబ్‌స్టేషన్లు విద్యుత్ రంగ అభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తాయన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రజాపాలన లక్ష్యం

### ఎమ్మెల్యేకోరం కనకయ్య



**ప్రజాపక్షం/గార్ల ;** అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక పాధాన్యత ఇస్తు సంక్షేమమే లక్షంగా పనిచేస్తుందని ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించినకళ్యాణ లక్ష్మి షాది ముభారక్,సిఎం రిలీఫ్ పండ్ చెక్కుల పంపిణీకార్యక్రమంలో ముఖ్యఅతిదిగా పాల్గొన్న ఎమ్మెల్యేసొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్,సర్పంచ్‌లు,అధికారులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్బంగా వారు మాట్లడుతూ ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి , షాది ముభారక్ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తుందని అన్నారు. నిరుపేదలకు వరంగా మారిన సిఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, బానోత్ పార్వతి,గంగావత్ రామసింగ్ నాయక్, భూక్య రాంమ్ సింగ్, మంగీలాల్,గుగులోత్ వీర్యా,సిద్దబోయిన వెంకట రావు,గుగులోత్ భద్రు,డ కేలోత్ వీరన్న, తహశిల్దార్ శారధ,ఎంపిడిఓ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు చేనేత కార్మికుల ధర్నా

### చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** చేనేత కార్మికుల ఎడల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం హనుమకొండ ఏకశిల పార్కు నుండి వందలాది మంది మహిళలతో సహా చేనేత కార్మికులు వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, పిసిసి చేనేత సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెప్పకటేశ్వర్లు, ఆప్కో మాజీ డైరెక్టర్ డి సత్యనారాయణ మూర్తి మాజీ కార్పొరేటర్స్ కుసుమ సతీష్, యెలుగం చిన్న భద్రయ్య, వన్నాల వెంకటరమణ, ఆడిపు రవీందర్ ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తూ గత ఎనిమిది రోజులుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో మగ్గాలు బంద్ పెట్టి ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వ స్పందించనందున శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించి టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన బెడ్డింగ్ మెటీరియల్ యధావిధిగా టెస్కో సంస్థకు ఆర్డర్ ఇప్పించి పేద చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ , కరీంనగర్ జిల్లాలో 50, 000 మందికి పైగా చేనేత కార్మికుల జీవనోపాధిని దెబ్బ తీసే విధానాన్ని విడనాడకుంటే రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మిక ఉద్యమం ఉధృతమైతే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలసి వస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శన ధర్నా కార్యక్రమానికి చేనేత సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షులు పంతగాని శ్రీనివాస్, కార్యదర్శి మాషబత్తుల కుమారస్వామి, చేనేత నాయకులు ఆడెపు రవిరాజు, అడిగొప్పుల సంపత్ , వొడ్నాల నరేందర్, వైద్యం రాజ గోపాల్, యెలుగం వెంకటమల్లు, కొలిపాక మధునయ్య, కూరపాటి సంపత్, తదితరులు నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం చేనేత ప్రతినిధి వర్గం జిల్లా కలెక్టర్ గారిని కలిసి సమస్యలు వివరించి ముఖ్య మంత్రి గారికి పంపించే వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రంగా గ్రామాలు: కలెక్టర్



**ప్రజాపక్షం/నెక్కొండ:** ప్రజల భాగస్వామ్యం ఉంటేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని కలెక్టర్ సత్య శారద అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నెక్కొండ మండల కేంద్ర గ్రామ పంచాయతీలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన గ్రామసభను నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం అనేది కేవలం పంటల సీజన్ మాత్రమే కాదని, ప్రజారోగ్యానికి పరీక్షా కాలమని పేర్కొన్నారు. గతంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెత్త తొలగించడం పంచాయతీ బాధ్యత అయితే, చెత్త వేయకపోవడం ప్రజల బాధ్యత అని గ్రామాన్ని శుభ్రంగా ఉంచడం ఒక్క ప్రభుత్వంతో సాధ్యం కాదని, ప్రతి ఇంటి ముందు పరిశుభ్రతే గ్రామ ఆరోగ్యానికి రక్షణ కవచం అని అన్నారు. గ్రామాల్లో మురుగు కాలువలు మూసుకుపోవడం, నిల్వ నీరు పేరుకుపోవడం, చెత్త కుప్పలు ఏర్పడడం వంటి సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేవలం ఫైళ్లలో నివేదికలు పంపడం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని హెచ్చరించారు. ప్రజలు ఫిర్యాదు చేసే వరకు వేచి చూడకుండా తక్షణమే స్పందించి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పిలుపునిస్తూ ప్రతి కుటుంబం వారానికి కనీసం ఒక గంట సమయం తమ ఇంటి పరిసరాల పరిశుభ్రత కేటాయించాలని అప్పుడే గ్రామాల్లో సగం సమస్య తీరుతాయన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామం కోసం ప్రభుత్వం అధికారులు ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం, సమయం ఇది అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఒ రామ్ రెడ్డి, ఎంపిడిఒ యాసం లావణ్య, మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఎస్ఐ మహేందర్, మార్కెట్ చైర్మన్, జిపిఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం, పాలకవర్గ సభ్యులు చల్లా విష్ణు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న యువకుడు అరెస్ట్

### రూ16 వేల విలువైన గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం:సిఐ



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాంగగా పోలీసులు గంజాయి అమ్ముతున్న యువకుడ్ని అరెస్ట్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన సాధారణ వాహన తనిఖీలు పెట్రోలింగ్ సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకోని తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి లభ్యమైంది. గూడూరు సిఐ వి వినయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మహబూబాబాద్ మండలం రంగశాయిపేట గ్రామానికి చెందిన బండి శ్రావణ్ కుమార్ 23 వద్ద నుంచి 325 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ప్రాథమిక విచారలో అతను గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు వెల్లడైనట్లు సిఐ తెలిపారు. నిందితుడి వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చుసుకున్న గంజాయి విలువ సుమారు రూ16.200 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి ఇతర మాదకద్రావ్యాల రవాణా విక్రయాలు , వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని సిఐ పేర్కొన్నారు.గ్రామాలలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్రవని సి ఐ వినయ్ కుమార్ హెచ్చరించారు.ఈకార్యక్రమంలో ఎస్ఐ గిరిధర్‌రెడ్డి పోలీసులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** పరకాల మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.పరకాల మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్1 అధికారి పోతరాజు పవన్ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విధుల నిర్వహణ, మున్సిపాలిటీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్ర అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, పన్నుల వసూళ్లు, మౌలిక వసతుల కల్పన, ఇంటి నంబర్ల కేటాయింపు, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ, వివిధ గ్రాంట్ల కింద నిధుల వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు.మున్సిపల్ సేవలు ప్రజలకు సకాలంలో, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సేవలను నిర్దేశిత గడువులోగా అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.వీధి దీపాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు విద్యుత్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఎఇ రవీందర్, టిపిఎస్ సుమన, టిపిబిఒ సందీప్, జూనియర్ అకౌంట్స్ అధికారి అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాల పేరుతో భారీ మోసం..!

### ప్రజల భయాలను ఆసరాగా చేసుకుని డబ్బుల దోపిడీ
### సర్పంచ్ అప్రమత్తతతో బయటపడిన కేటుగాళ్ల వ్యవహారం



**ప్రజాపక్షం/గూడూరు;** మంత్రాల చేతబడి దయ్యాల భయం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తుల వ్యవహారం మహబూబాబాదద్ జిల్లా గూడూరు మండలంలో వెలుగులోకి వచ్చింది. గ్రామ ప్రజల భయాలను ఆసరాగా చేసుకుని డబ్బులు దండుకుంటున్న ఈ ఘటన స్థానిక సర్పంచ్ ,గ్రామస్థులు అప్రమత్తతతో బయటపడింది.వివరాల్లోకి వెళ్తే గూడూరు మండలం వెంగంపేట గ్రామపంచాయతీ పరిధి లోని పాల్త్యతండా, బొడచక్రుతండా, చిన్న ఎల్లాపురం తదితర గ్రామాల్లో ఇటీవల కొందరు వ్యక్తులు తిరుగుతూ గ్రామాల్లో దయ్యాలు సంచరిస్తున్నాయని అందువల్లే వరుస మరణాలు జరుగుతున్నాయని ప్రచారం చేశారు.ఈసమస్యను తామే పరిష్కరిస్తామని ప్రత్యేక పూజలు చేస్తే గ్రామానికి శాంతి చేకూరుతుందని చెప్పి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన గురిజీరాల గోపి ప్రసాద్ వీరిద్దరితో పాటు మరికొంత మంది వ్యక్తులు ఈతంతు నడిపినట్లు తెలిసింది.గ్రామ పెద్దలను స్థానికులను నమ్మించి పూజల పేరుతో డబ్బులు సేకరించడమే కాకుండా రాత్రివేళల్లో నగ్నంగా గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలల్లో మరింత భయాందోళనకు సృష్టించినట్లు గ్రామస్తులు తెలిపారు.ఆదివారం రాత్రి పాల్త్యతండాలో కొంత మంది నుంచి డబ్బులు తీసుకొని పూజులు నిర్వహించిన అనంతరం పూజా సామగ్రిని పట్టుకొని బోడ చక్రు తండా మీదినుంచి నగ్నంగా వెళుతూ సమీపంలోని రాళ్లవాగులో వద్ద పడ వేస్తుండగా వెంగంపేట గ్రామసర్పంచ్ జవహార్‌కు సమాచారం అందింది. వెంటనే కొంతమందితో కలిసి వారిని వెంబడించిన సర్పంచ్ గూడూరు మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు.అనంతరం సర్పంచ్ జవహార్ మాట్లాడుతూ మంత్రాలు, చేతబడులు ,దయ్యాలు ,భూతాలు వంటి మూఢనమ్మకాల పేరుతో ఇప్పటికి కొందరు ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మెరుగైన వసతి

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** పాఠశాలలు, వసతి గృహాల పునః ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, ఎం సంపత్ రావుతో కలిసి పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, వసతి గృహాల పునః ప్రారంభంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ నుండి టెలిఫోన్ ద్వారా మంత్రి సీతక్క హాజరై అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్బంగా మంత్రి సీతక్క ఫోన్ ద్వారా మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చ ర్యలు తీసుకోవాలని, ప్రతి పాఠశాల, వసతి గృహంలో అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడలని అధికారులను ఆదేశించారు. అధికారులు వసతి గృహాలు, పాఠశాలలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, డిఆర్‌ఓ రవి కుమార్, ఆర్‌డిఓ కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
09-06-2026
www.prajapaksham.in

నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు(జూన్ 10) వేడుకలు సందర్భంగా రూపొందించిన 'భోళా బాలయ్య' సాంగ్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ బోయపాటి శ్రీను ముఖ్య అతిథిగా హాజరై ఈ పాటను ఆవిష్కరించారు. అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ బాలయ్య.

రీల్

# 'భోళా బాలయ్య' పాటను ఆవిష్కరించిన బోయపాటి శ్రీను



నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు(జూన్ 10) వేడుకలు సందర్భంగా రూపొందించిన 'భోళా బాలయ్య' సాంగ్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ బోయపాటి శ్రీను ముఖ్య అతిథిగా హాజరై ఈ పాటను ఆవిష్కరించారు. అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ బాలయ్య ఏంటనేది నేను నా సినిమాల ద్వారా చెప్పాను. ఈ సాంగ్ గురించి చెప్పాలంటే, పాట చాలా అద్భుతంగా వచ్చింది. మ్యూజిక్, లిరిక్స్, డ్యాన్స్, ఆర్టిస్టులు, అలాగే ఈ సాంగ్ను రూపొందించిన జగన్తో సహా అందరూ అద్భుతంగా కుదిరారు. ముఖ్యంగా విజువల్స్ తోనే అయితే చాలా గొప్పగా ఉన్నాయి.ఎన్‌బికె హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు అనంతపురం జగన్ మాట్లాడుతూ బాలయ్య బర్త్డేను కూడా జూన్ 1 నుంచి 10 వరకు కన్నుల పండుగగా జరుపుకుంటాం. బాలకృష్ణ సాధించిన విజయాలు, సృష్టించిన చరిత్ర, చేసిన సేవా కార్యక్రమాలు ఒక్కరోజులో చెప్పలేం. ఆయనకు అభిమానిగా ఉండడం, ఆయన వెంట నడవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమాకర్ అమిలినేని, సింగర్ కరీముల్లా, నటుడు రచ్చ రవి పాల్గొన్నారు. ఈ పాటకు సంగీతం: ఈశ్వర్ దత్తు.

# 'నాగబంధం' నైజాంలో రిలీజ్ చేస్తున్న దిల్ రాజు



అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్' చిత్రాన్ని దేశవ్యాప్తంగా ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్నారు. నాగబంధం' నైజాం థియేట్రికల్ హక్కులను ఫ్యాన్సీ రేటుకు సొంతం చేసుకున్న ప్రముఖ నిర్మాత దిల్ రాజు, చిత్రాన్ని గ్రాండ్గా విడుదల చేయనున్నారు.జులై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రమోషనల్ టూర్ను ప్రకటించారు.సాధారణ ప్రమోషన్‌కు భిన్నంగా, యాత్రను రూపొందించారు. ప్రతి నగరంలో జరిగే కార్యక్రమం ద్వారా సినిమా ప్రపంచం, అందులోని రహస్యాలు, సాహస అంశాలను ప్రేక్షకులకు మరింత దగ్గర చేయనున్నారు.ఈ టూర్‌లో తొలి కార్యక్రమం జూన్ 19న హైదరాబాద్లో ట్రైలర్ లాంచ్. సినిమా స్థాయి, విజువల్స్, కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఈ ఈవెంట్ ఉండనుంది.అనంతరం జూన్ 20 నుంచి 23 వరకు ముంబై, చెన్నై, బెంగళూరు, కొచ్చి నగరాల్లో వరుసగా ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్స్ ద్వారా దేశవ్యాప్తంగా సినిమా రీచ్‌ను మరింత చిత్రబృందం ముందుకు సాగుతోంది.ఈ ప్రమోషనల్ టూర్‌లో ప్రత్యేక ఆకర్షణగా జూన్ 26న వారణాసిలో 'వీర నాగ' పాట విడుదల కానుంది. వారణాసి నగరానికి ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత సినిమా టైటిల్ వుంటుంది.అలాగే 28న హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. విడుదలకు ముందు రోజు జూలై 2న ప్రత్యేక ప్రీమియర్ షో ఏర్పాటు చేసి, సెలబ్రేట్ చేయనుంది.ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# 'ఐ యామ్ హ్యాండ్సమ్' ట్రైలర్ లాంచ్



తండ్రికొడుకుల అనుబంధం, త్యాగం, ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంలో హృదయాన్ని హత్తుకునే చిత్రం 'ఐ యామ్ హ్యాండ్సమ్'. దుర్గా దేవ్ నాయుడు హీరోగా నటిస్తూ స్వయంగా కథ, స్క్రీన్ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన ఈ చిత్రాన్నికె ఫిలిమ్స్ బ్యానర్ పై, మహేష్ గుడారు సమర్పణలో కేదార్నాథ్ నిర్మించారు. అన్విష కథానాయికగా నటించిన ఈ చిత్రం 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లో విడుదల కానుంది.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రసాద్ ల్యాబ్స్‌లో చిత్ర ట్రైలర్ లాంచ్, ప్రీరిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ సినిమా విజయానికి అసలు బలం కంటెంట్. మంచి కథ, బలమైన భావోద్వేగాలు ఉన్న సినిమాలు ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతాయి. దర్శకుడు, హీరో దుర్గా దేవ్ నాయుడు మాట్లాడుతూ ఒకవేళ నచ్చకపోతే ఇంకా మంచి సినిమా తీస్తాను అని నిజాయితీగా చెబుతున్నాను. చిత్ర యూనిట్లోని ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పనిచేశారు. డబ్బుల గురించి ఆలోచించకుండా సినిమా కోసం కష్టపడ్డారు.నిర్మాత కేదార్నాథ్ , కేఎల్ దామోదర్ ప్రసాద్ ఎంతో సహకారం అందించారు అన్నారు. ఇందులో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి..నిర్మాత కేదార్నాథ్ మాట్లాడుతూ మంచి కథను నమ్మి ఈ సినిమాను . జూన్ 12న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ఎన్.ఎస్. ప్రసూ పాల్గొన్నారు.

## నాకు 20 ఏళ్లు ఉన్నప్పుడు ఈ కథ విన్నాను

# సింగ్ గీతం ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కమల్ హాసన్



ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాస్ రావు రూపొందించిన సింగ్ గీతం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్ కు చీఫ్ గెస్ట్ గా హాజరైన హీరో కమల్ హాసన్ మాట్లాడుతూ మాయాబజార్ నుంచి ఇప్పటి సింగ్ గీతం వరకు సింగీతం శ్రీనివాసరావులో ఎలాంటి మార్పు లేదు. సినిమా ఆయనతో పాటే ఉంది. ఇది చాలా అరుదుగా జరిగే విషయం. నాకు 20 ఏళ్లు ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేయడం మొదలుపెట్టాను. ఆయన సినిమాకి నిర్మాతగా, సహాయ దర్శకుడిగా కూడా పనిచేశాను. నా ఉద్దేశం ఆయనతో కలిసి పనిచేయడమే. చాలా ఏళ్ల క్రితం ఆయన నాకు రెండు కథలు చెప్పారు. అందులో ఒకటి పుష్పక విమానం సినిమాగా వచ్చింది. ఇప్పుడు రెండో కథ సింగ్ గీతం సినిమాగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నాకు 20 ఏళ్లు ఉన్నప్పుడు ఆ కథ విన్నాను. ఇప్పుడు నాకు 70 సంవత్సరాలు. ఇప్పుడు ఆ సినిమాను చూడబోతున్నాను. కొన్ని ఆలోచనలు, కొన్ని కథలు టైమ్‌లెస్‌గా ఉంటాయి. సింగీతం కథలు కూడా అలాంటివే. అవి ఏజ్‌లెస్‌గాఉంటాయి. సింగీతం పేరును చాలామంది 'సంగీతం' అని పలుకుతుంటారు. కానీ ఈ సినిమాతో ఆ కన్ఫ్యూజన్ ఉండదు. ఇకపై అందరూ 'సింగీతం' అనే పిలుస్తారు. ఆయన పేరులోనే సంగీతం ఉంది. కల్కి సినిమాను హాట్ స్టూడియోలో షూట్ చేశాం. కానీ పుష్పక విమానం సినిమాను ఫైవ్‌స్టార్ హోటల్లో ఏసిలోచేశాం. 'పూర్తి సినిమాను ఎయిర్ కండిషన్‌లో తీశాము అని గర్వంగా చెప్పుకుంటాం. అలాగే ఆయనతో కలిసి చేసిన ముంబై ఎక్స్‌ప్రెస్ సినిమాను కూడా మేము ఎంతో ఎంజాయ్ చేస్తూ చేశాం. సింగీతం ఇప్పటికి జెన్జీ కంటే ముందుంటారు. ఆయనను ఈరోజు సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటికీ ఆయనకు సహాయ దర్శకుడిగా ఉండడానికి నేను ఇష్టపడతాను. పుష్పక విమానం అందుకు మంచి ఉదాహరణ. సింగీతం నుంచి మనం ఆ ప్యాషన్ నేర్చుకోవాలి. ఏ సినిమా విజయం సాధిస్తుందో, సాధించదో ఎవరూ ముందుగా చెప్పలేరు. కానీ సినిమా పూర్తయ్యే సరికి మనం సంతోషంగా ఉన్నామా లేదా అనేది మాత్రం తెలుస్తుంది. పుష్పక విమానం, ముంబై ఎక్స్‌ప్రెస్, అపూర్వ సోదరులు వంటి చిత్రాలు మంచి స్పిరిట్‌తో తెరకెక్కాయి. నేను సహ నిర్మాతగా ఉన్నాననే భావన వస్తోంది. అది నాగీకి తెలుసు. సింగీతం పట్ల నాకు ఎప్పటికీ గౌరవం ఉంటుంది.

## కోదండరామి రెడ్డి చేతుల మీదుగా

# 'కొత్త మలుపు' ట్రైలర్ విడుదల

ప్రముఖ నేపథ్య గాయని సునీత తనయుడు ఆకాష్ గోపరాజు హీరోగా భైరవి అర్ధ్యా హీరోయిన్‌గా నటించిన శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వంలో తాటి బాలకృష్ణ నిర్మించిన 'కొత్త మలుపు' మూవీ జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు ఎ. కోదండరామి రెడ్డి చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. అన్ణంతరం ఎ. కోదండరామి రెడ్డి మాట్లాడుతూ, ట్రైలర్ చాలా బాగుంది. సినిమా కాన్సెప్ట్ కూడా నచ్చింది. హీరో, హీరోయిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని పెద్ద విజయంగా నిలబెట్టాలని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాట్లాడుతూ మా సినిమా ట్రైలర్ లాంచ్ చేసి ఆశీర్వదించిన దర్శక దిగ్గజం కోదండరామి రెడ్డి గారికి హృదయ పూర్వక ధన్యవాదములు. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్లో ఈ సినిమాను రూపొందించాం. ఆకాష్‌భైరవి జోడీ చాలా బాగా కుదిరింది. కోనసీమ అందాలను తెరపై ఆవిష్కరిస్తూ మంచి కామెడీతో కూడిన కథను ప్రేక్షకులకు అందిస్తున్నాం. జూన్ 12న సినిమా విడుదల కానుంది అని తెలిపారు.నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిన. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చెప్పారు. కమెడియన్ మహేంద్ర సినిమా లో చేసిన కామెడీ హైలెట్ గా నిలుస్తుందని అన్నారు.. ఈ చిత్రానికి మంచి కథ అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ వంటి సంస్థ మద్దతు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. మా అమ్మ సునీతతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడారు.



# మమతకు మరో దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నట్లు ఘోష్ తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ.. వారు ఎన్నుకున్న ప్రభుత్వంతోనే కలిసి పని చేయాలని తమ బృందం నిర్ణయించుకుందని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై టిఎంసి ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ చీలికతో లోక్‌సభలో మమతాబెనర్జీ సారథ్యంలోని తృణమూల్‌కు కేవలం ఎనిమిదిమంది సభ్యులే మిగిలారు. కాగా పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఇండియా కూటమి సదస్సు కోసం ఢిల్లీలో ఉన్న సమయంలోనే, పార్టీలోని కొందరు అసమ్మతి ఎంపిలు ఢిల్లీలో రహస్య సమావేశం నిర్వహించారు. ఆదివారం రాత్రి పొద్దుపోయాక రహస్య ప్రదేశంలో జరిగిన ఈ అనధికారిక సమావేశానికి సుమారు 20 మంది ఎంపిలు హాజరయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశం గురించి తెలిసిన వర్గాల ప్రకారం, ఎంపిలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, పార్టీ ప్రస్తుత పార్లమెంటరీ నాయకత్వ నిర్మాణంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే, పెద్ద ఎత్తున ఎంపిలు పార్టీని వీడుతున్నారనే సూచనలను సీనియర్ టిఎంసి ఎంపి సౌగత రాయ్ తోసిపుచ్చారు. కొంతమంది ఎంపీలు విడిగా సమావేశం అయ్యారని తాను విన్నానని, ఆ సమావేశంలో ఏం జరిగిందో వారే చెప్పగలరని, వారు తనను సంప్రదించలేదన్నారు. టిఎంసి ఎంపిలను సంప్రదించడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్న వార్తలపై ప్రశ్నించగా, తనను సంప్రదించారని, అయితే తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించానని రాయ్ చెప్పారు. కాగా, 'సమావేశం ప్రధానంగా భవిష్యత్ కార్యాచరణ గురించే జరిగింది. పార్టీ ఎన్నికల పరాజయానికి గల కారణాలను నాయకత్వం అంగీకరించడానికి సుముఖంగా లేదని పలువురు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు' అని ఆ చర్చల గురించి తెలిసిన ఒక టిఎంసి నాయకుడు తెలిపారు. సోమవారం సోషల్ మీడియాలో ఆ సమావేశానికి సంబంధించిన ఒక ఫోటో వెలుగులోకి వచ్చింది, అందులో పలువురు టిఎంసి లోక్‌సభ ఎంపిలు ఒక బల్ల చుట్టూ కూర్చుని ఉన్నారు.

**రాజ్యసభ ఎంపి సుఖేందు రాయ్ రాజీనామా**

సోమవారం టిఎంసి సభ్యుడు సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టిఎంసితో కూడా తన బంధాన్ని తెంచుకున్నట్లు వెల్లడించారు. 'నేను రాజ్యసభ చైర్మన్‌ను కలిసి నా రాజీనామాను సమర్పించాను. అలాగే, పార్టీకి రాజీనామా చేయాలన్న నా నిర్ణయాన్ని వాట్సాప్, ఇ-మెయిల్ ద్వారా మమతా బెనర్జీకి తెలియజేశాను' అని రాయ్ చెప్పారు. 'రాజ్యసభలో నా పదవీకాలం 2029 వరకు ఉంది, కానీ ఇకపై కొనసాగడం కష్టమని భావించి పార్టీకి రాజీనామా చేశాను' అని ఆయన విలేకరులతో అన్నారు. ఇదిలా ఉండగా, రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సోమవారం నాడు టిఎంసి సభ్యుడు సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామాను ఆమోదించి, ఆ స్థానం ఖాళీగా ఉన్నట్లు ప్రకటించారు. 'పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్) సభ్యుడు సుఖేందు శేఖర్ రాయ్ తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు' అని రాజ్యసభ సచివాలయం ఒక ప్రకటనలో పేర్కొంటూ ఆ స్థానం ఖాళీ అయినట్లు తెలిపింది.

# అభివృద్ధికి సహకరించకుండా కిషన్‌రెడ్డి అడ్డంకులు

ప్రభుత్వ సలహాదారు
వి. హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికి సహకరించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (విహెచ్) విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రిగా తన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు సాధించే విషయంలో కూడా కిషన్ రెడ్డి సహకరించడం లేదన్నారు. బిసిలు తిరగబడితే బిజెపి ప్రభుత్వం కూలిపోతుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తాను బిసి వర్గానికి చెందినవాడినని చెప్పుకుంటున్నప్పటికీ, బిసిల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బిసిల వాస్తవ జనాభాను గుర్తించాలని డిమాండ్ చేశారు. బిసిల ఓట్లతో గెలిచిన నాయకులు వారి హక్కులను విస్మరించడం సరికాదన్నారు. దేశంలో బిసిల జనాభా అధికంగా ఉన్నప్పటికీ వారికి తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు కల్పించడం లేదని విహెచ్ ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో కులగణన నిర్వహిస్తే బిసిల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టత వస్తుందని చెప్పారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని కాంగ్రెస్ కులగణనకు ఆయన మద్దతు ఇస్తున్నారని తెలిపారు. బిసిల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తానని విహెచ్ పేర్కొన్నారు.

# ఆధారాలు సమర్పించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరుగుతున్నాయంటూ ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలంటే తగిన ఆధారాలు అవసరమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం చట్ట అమలులో విఫలమైందని నిర్ధారించాలంటే మరింత సమగ్ర సమాచారాన్ని సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. లా పైలట్ ఫౌండేషన్ డైరెక్టర్ బి. కార్తీక్ నవాయన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సోమవారం విచారణ జరిగింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎన్‌సీఆర్‌బీ గణాంకాలను ప్రస్తావిస్తూ 2023లో ఎస్సీ, ఎస్టీలపై దాదాపు 57 వేల కేసులు నమోదయ్యాయని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం, ప్రతి పౌరుడి భద్రత ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ ప్రతి వ్యక్తికి ప్రత్యేకంగా పోలీసు రక్షణ కల్పించడం సాధ్యం కాదని వ్యాఖ్యానించింది. ఎస్సీ, ఎస్టీ చట్టం అమలులో వైఫల్యం వల్లే దాడులు జరుగుతున్నాయని నిరూపించడానికి తగిన ఆధారాలు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

# ఇరాన్ మెరుపు దాడులు

(మొదటి పేజీ తరువాయి)

దురాక్రమణ,దుశ్చర్యలు, సామూహిక హత్యలు కొనసాగితే సహించేదిలేదని, చాలా కఠినమైన అణచివేత చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇజ్రాయెల్‌కు హెచ్చరికలు చేయడంతో ఇరాన్ దాడులు ముగించిందని రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొంది. ''ఇజ్రాయెల్‌పై ప్రారంభించిన సాయుధ దళాల కార్యకలాపాలను నిలిపివేస్తున్నాం'' అని ఇరాన్ అత్యవసర సైనిక కమాండ్ అధిపతి ఖతమ్ అల్-అన్బియా ఇరాన్ ప్రభుత్వ మీడియాకు చెప్పారు. అదే విధంగా ఇజ్రాయెల్ ఉన్నతాధికారులు కూడా, ట్రంప్ చేసిన విజ్ఞప్తి మేరకు ఇరాన్‌పై దాడులు నిలిపివేస్తున్నట్లు ఒక ప్రకటన చేశారు. దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా నిర్మూలనకు దాడులు కొనసాగుతాయని కూడా చెప్పారు. మరోవైపు ఇజ్రాయెల్ విదేశీ మంత్రిత్వశాఖ అధికకార ప్రతినిధి ఇస్మాయెల్ బాఘాయీ మీడియాతో మాట్లాడుతూ, అమెరికాతో పూర్తి సమన్వయ చర్యల ద్వారానే ఇజ్రాయెల్ తమ దేశంపై దాడులు చేసిందని చెప్పారు. ఈ ఉద్రిక్తతలు పెరగడంవల్ల అమెరికాకే ప్రయోజనం కలుగుతుందని విమర్శించారు. అమెరికాతో సమన్వయ సహకారం లేకుండా ఇజ్రాయెల్ జియోనిస్టు పాలకులు ఎలాంటి చర్యలైనా తీసుకుందంటే ఎవరూ నమ్మబోరని అన్నారు.

యుద్ధం ముగించేందుకు జరుగుతున్న శాంతి యత్నాలను ఈ పరస్పర దాడులు దెబ్బతీస్తాయని, అందువల్ల దాడులు నిలిపివేసి సంప్రదింపుల ప్రక్రియను తిరిగి కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విజ్ఞప్తి చేశారు.''ఇక చాలు, ఈ దాడులవల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు, వారు తిరిగి చర్చల బల్ల దగ్గరకు వచ్చి ఒక ఒప్పందం చేసుకోవాలి'' అని ఫాక్స్‌న్యూస్‌కు తొలుత ట్రంప్ చెప్పారు. బీరూట్‌లో హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ చేసిన దాడులపట్ల కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాను ఎంతమాత్రం సంతోషంగా లేనని చెప్పారు.

ఇజ్రాయెల్‌లో ఉన్న నెవతమ్-టెల్‌నోఫ్ వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్‌పై దాడులు చేసినట్లు ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) మొదట ప్రకటించగా, టెహ్రాన్‌లోని ఇస్ఫహాన్ సహా మూడు నగరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. టెహ్రాన్‌లో భారీ పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ కార్యాలయ భవనం కూడా పేలుళ్ళతో దద్దరిల్లింది. రాబోయే కొద్ది గంటల్లో ఇరాన్ క్షిపణి దాడులు చేస్తుందని తమకు ముందుగానే తెలుసునని, ఆము అప్రమత్తంగా ఉన్నామని ఐడిఎఫ్ తొలుత ప్రకటించింది. లెబనాన్‌లోయుద్ధం ఆపి వెనక్కు వెళ్ళకపోతే మరింత విషాదకరమైన దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఐ.డి.ఎఫ్‌కు ఐ.ఆర్.జి.సి హెచ్చరించింది. యెమెన్ భూభాగం నుండి హౌతీలు కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా దాడులు చేశారు. ఇజ్రాయెల్‌లో పలుచోట్ల ఒక పాలస్తీనుడు విచ్చలవిడిగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక సైనికుడు మరణించాడు.

ఇరాన్ దాడులకు స్పందించవద్దని, పట్టించుకోవద్దని,యుద్ధాన్ని విస్తరించి చర్చలు తుది దశలో ఉన్న చర్చలను చెడగొట్టి సమస్యను పెద్దది చేయవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెంటనే నెతన్యాహూకు ఫోన్ చేసి చెప్పారని అమెరికా మీడియా ప్రకటించింది. ఐనాగానీ నెతన్యాహూ ఆ మాటలు లెక్కచేయకుండా ఇరాన్‌పై ఎదురు దాడులు ప్రారంభించారు. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను పనికిరాకుండా నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. ఇజ్రాయెల్ వార్ క్యాబినెట్‌తో అత్యవసర సమావేశం నిర్వహించారు. దీంతో ఏం చేయాలో పాలుపోని ట్రంప్ ఇరాన్-ఇజ్రాయెల్ రెండు దేశాలూ తక్షణం షూటింగ్ ఆపాలని సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. ఇరాన్ ప్రయోగించిన అనేక క్షిపణులు,డ్రోన్లను తమ రక్షణ వ్యవస్థలు ముందుగానే పసిగట్టి స్తంభింపజేశాయని ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఏప్రిల్ ఎనిమిదో తేదీ తర్వాత రెండు దేశాలమధ్యా దాడులు ఆగిపోయాయి. కానీ లెబనాన్‌లో యుద్ధం ఆపాలని పదే పదే ఇరాన్ కోరుతూ వస్తోంది. ఈ అంశాన్ని ప్రతిపాదిత యుద్ధ ఒప్పందంలో కూడా చేర్చాలని కోరుతోంది.గడచిన గురువారం అమెరికా మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినాగానీ నెతన్యాహూ లెక్కచేయకుండా దాడుల ఉద్ధృతి పెంచింది. బీరూట్‌పై ఆదివారం ఎలాంటి హెచ్చరికలూ లేకుండా ఇరాన్ అనుకూల హెజ్బొల్లా కమాండ్ సెంటర్లపై ఐడిఎఫ్ భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇద్దరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. మళ్ళీ ఇరాన్ యుద్ధ రంగంలోకి దిగింది. తీవ్రస్థాయిలో మళ్ళీ దాడులు ప్రారంభం కావడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఇరాన్-ఇజ్రాయెల్‌లలో సైరన్ మోతలు మోగాయి. పశ్చిమ-సెంట్రల్ ఇరాన్ ప్రాంతాలలో ఉన్న మూడు నగరాలపై ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసింది. ఇరాన్ ప్రయోగించిన అనేక క్షిపణులు,డ్రోన్ల జాడ కనిపెట్టి నిర్వీర్యం చేశామని ఐడిఎఫ్ ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఇరాన్ వెంటనే తన గగన తలాన్ని మూసివేయగా, ఇజ్రాయెల్ కూడా గాజా క్రాసింగ్‌ను మూసివేసింది. మరోవైపు ఇరాక్‌లో ఉన్న ఖుర్దిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై కూడా ఇరాన్ దాడులు చేయడంతో ఇరాక్ దేశం తన గగనతలాన్ని మూసివేసింది.

ఇదిలా ఉండగా, సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరం సమీపంలో పేలుళ్ళు సంభవించాయి. ఈ పేలుళ్ళకు తాము కారణం కాదని ఇరాన్ వివరణ ఇచ్చింది. అమెరికా క్షిపణులు పనిచేయడానికి అవసరమైన బ్యాటరీ వ్యవస్థకు సుల్తాన్ ఎయిర్‌బేస్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తోంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మళ్ళీ యుద్ధం ప్రారంభం కావడంతో బ్రెంట్ క్రూడాయిల్ ధర మరోసారి ఐదూశాతం మేరకు భారీగా పెరిగిపోయింది.

# రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల కంటే దిగువకు పడిపోతాయన్నారు.
మూడు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరిక
సోమ, మంగళవారాల్లో వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం, బుధవారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. గురు, శుక్రవారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

# వెంటనే తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి)

పెడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్నురా యితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తున్నదని, ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమం చెందిందని సాంబశివరావు పేర్కొన్నారు. 2014 మే నెలలో పెట్రోల్ ధర రూ. 72 ఉంటే ప్రస్తుతం రూ.111 లకు చేరిందని, రూ.55 లు ఉన్న డీజిల్ రూ.103 లకు చేరిందని తెలిపారు. 2014 మార్చిలో గృహ వినియోగ సబ్సిడీ సిలిండర్ ధర కేవలం రూ.410.50 గా ఉంటే, గత పదేళ్లలో ప్రభుత్వం సబ్సిడీలను క్రమంగా ఎత్తివేయగా ప్రస్తుతం సాధారణ వినియోగదారుల సిలిండర్ ధర రూ.1240 లకు చేరిందని, రూ.1600 లు ఉన్న వాణిజ్య సిలెండర్ ధర బిజెపి పరిపాలనలో రూ.3367 లకు చేరిందని వివరించారు. రూ.90 ఉన్న వంట నూనె ఇప్పుడు రూ.180 లకు చేరిందని, ఈ విధంగా ధరలు పెంచుకుంటూ పోతే సామాన్యుడు జీవించడం కష్టమవతున్నదని తెలిపారు. కార్పోరేట్ కంపెనీలు నష్టపోకుండా రేట్లు పెంచుతున్నారని తెలిపారు. పెంచిన నిత్యావసర, గ్యాస్, పెట్రో ఉత్పత్తుల రేట్లను తగ్గించాలని కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున్న పాల్గొనాలని సాంబశివరావు కోరారు.

# రాజకీయ దుష్ప్రచారమే

(మొదటి పేజీ తరువాయి)

నియంత హిట్లర్ సిద్ధాంతాలతో ముడిపెట్టడం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు.సిఎల్‌పి మీడియా సెంటర్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కెటిఆర్, హరీశ్‌రావు అసలు విషయాన్ని పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 'ఏదైనా లక్ష్యాన్ని సాధించేందుకు దృఢ సంకల్పంతో పనిచేసే వ్యక్తిని సాధారణంగా హిట్లర్ అని వ్యవహరించడం ప్రజల్లో ఉన్న భావన. సీఎం కూడా అదే సందర్భంలో మాట్లాడారు తప్ప, నాజీ సిద్ధాంతాలను సమర్థించలేదు' అని పేర్కొన్నారు.హైడ్రా చర్యల వల్ల కబ్జాదారుల్లో భయం నెలకొనడంతో బీఆర్‌ఎస్ నాయకత్వం అసహనానికి గురవుతోందని శ్రీధర్ బాబు అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములను రక్షించడాన్ని స్థానిక ప్రజలు స్వాగతిస్తుంటే, బిఆర్‌ఎస్ మాత్రం వ్యతిరేకిస్తోందని వ్యాఖ్యానించారు. హైడ్రా రాజ్యాంగబద్ధంగా, చట్టపరిధిలోనే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటోందని చెప్పారు.గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆరోపించిన మంత్రి, కేసీఆర్ సచివాలయానికి కూడా రాకుండా పాలన సాగించారని, ప్రగతి భవన్‌ను ప్రజలకు దూరంగా ఉంచారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్, టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజీ, ఉద్యోగ నియామకాలలో జరిగిన అవకతవకలను ప్రజలు మర్చిపోలేదన్నారు.హరీశ్‌రావు, కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు అసత్య ప్రచారమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో బిఆర్‌ఎస్ పదేళ్లలో చేయలేని అనేక పనులు చేసిందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, పారదర్శకంగా గ్రూప్1 పరీక్షల నిర్వహణ వంటి అంశాలను ఉదాహరణగా చూపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com